thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 340 కరీంనగర్ శనివారం, 15 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సరిహద్దుల్లో పాక్ కాల్పులు

జమ్మూ : జమ్మూకశ్మీర్ పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటీ సెక్టర్‌లో అర్ధరాత్రి తీవ్ర అలజడి నెలకొంది. పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైన్యంపైకి ఒక్కసారిగా కాల్పులు జరిపింది. వెంటనే తేరుకున్న భారత సైన్యం ప్రతిగా ఎదురు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో పాకిస్థాన్ వైపు భారీగా ప్రాణ నష్టం జరిగిందని భారత సైనికాధికారులు వెల్లడించారు. అయితే మృతుల సంఖ్యను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. వారి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ మృతి చెందిన కొంతమంది సైనికులకు ఓ పాక్ అధికారి నివాళులర్పిస్తున్న తేదీలేని వీడియో ఫేస్ బుక్‌లో దర్శనమిచ్చింది. మరోవైపుకృష్ణ ఘాటీ సెక్టర్‌లో ఓ భారత జవాను ప్రమాదవశాత్తు ల్యాండ్‌మైన్‌పై కాలు పెట్టి గాయపడగా అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

# కీలక భేటీకి ముహూర్తం ఫిక్స్..

# భారీ ప్లాన్‌తో కేసీఆర్ రీ ఎంట్రీ..!



## ఇక తగ్గేదేలేదంటోన్న 'కారు' సారు..!!

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ క్షణమైనా నగారా మోగే అవకాశం ఉంది. ఇంకోవైపు కారు పుట్టి 25 ఏండ్లు కావొస్తుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. దీంతో కేసీఆర్ భారీ ప్లాన్‌తో రీ ఎంట్రీ ఇస్తున్నట్టు పొలిటికల్ కామెంట్స్ వినిపిస్తున్నాయి.

**కేటీఆర్‌కు ఆదేశాలు..** ఈనెల 19వ తేదీన బీఆర్ఎస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని.. కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. అధినేత ఆదేశాల మేరకు.. ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట నుండి హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది.

**వీరికి ఆహ్వానం..** కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ల మాజీ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబి, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌లను ఆహ్వానించనున్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ, సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం.. తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చించనున్నట్టు తెలుస్తోంది.

**ఏడాదిగా సైలెంట్..**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి.. ఏడాది కాలం గడిచింది. ఈ ఏడాదిలో కేసీఆర్ సైలెంట్‌గా ఉన్నారు. సంవత్సరం సమయం ఇవ్వాలని వేచి చూశారు. 19న జరగబోయే సమావేశంలో.. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాల మీద ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా.. బీఆర్ఎస్ నాయకులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరిగే అవకాశం ఉంది.

**కచ్చితంగా రావాలి..** కీలక అంశాలపై సమగ్ర చర్చ జరిపే ఛాన్స్ ఉంది. అలాగే పార్టీకి సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అందుకే ఆహ్వానితులందరూ కచ్చితంగా హాజరుకావాలని కేటీఆర్ స్పష్టం చేశారు. దీనిపై తెలంగాణ రాజకీయాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేసీఆర్ భారీ ప్లాన్‌తోనే రీ ఎంట్రీ ఇవ్వబోతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**పాతికేళ్ల ప్రస్థానం..** ఏప్రిల్ 27వ తేదీకి గులాబీ పార్టీ పురుడుపోసుకొని 25 ఏళ్లు అవుతుంది. ఈ నేపథ్యంలో.. సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. 14 ఏళ్లు ఉద్యమంలో.. పదేళ్లు పాలనలో కేసీఆర్ సాధించిన విజయాలు, ఎదుర్కొన్న ఆటుపోట్ల గురించి విస్తృతంగా ప్రచారం చేసే అవకాశం ఉంది. ఉద్యమ పార్టీగా పుట్టి.. స్వరాష్ట్ర కల సాకారం చేసి.. ఫక్తు రాజకీయ పార్టీగా ఎదిగి.. అధికారం చేపట్టిన తీరును ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది.



## యంగ్ ఇండియా స్కూళ్లకు స్థలాలపై వారంలో నివేదిక ఇవ్వాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం త్వరగా స్థలాలు గుర్తించాలని కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నియోజకవర్గంలో స్కూళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్కూళ్లకు స్థలాల సేకరణపై ఆరా తీశారు. గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. "స్థలాలు కేటాయిస్తే అనుమతుల పనులు వేగవంతం చేయాలి. స్కూళ్లకు స్థలాలు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. అనువుగా లేని చోట ప్రత్యామ్నాయ స్థలం సేకరించాలి. కలెక్టర్లు వీలైనంత త్వరగా స్థలాలు గుర్తించాలి. దీనిపై వారంలోగా నివేదిక ఇవ్వాలి. 105 స్థానాల్లో రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా చూడాలి. చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో సరైన వసతులు కల్పించాలి. వర్సిటీ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం తెలిపారు.



## ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మహిళలకు మరో కొత్త రూల్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ TSRTC మహిళలకు సాధికారత కల్పించడానికి ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టింది. శక్తి యోజన అని పిలువబడే ఈ కార్యక్రమం మహిళా ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం మరియు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది...

**ఆధార్ ఆధారిత ధృవీకరణ...** మహిళలు తమ ఆధార్ కార్డును చూపించడం ద్వారా ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ ప్రయోజనాన్ని సులభంగా పొందగలిగారు. అయితే ఈ కార్యక్రమం ప్రజాదరణ పొందడంతో పలు సమస్యలు వెలుగు చూశాయి. స్థానికేతరులు ఉచిత ప్రయాణ ప్రయోజనాన్ని దుర్వినియోగం చేయడం ఒక ముఖ్యమైన సమస్య. ఈ పథకానికి అర్హత లేని ఇతర రాష్ట్రాల మహిళలు, కఠినమైన ధృవీకరణ ప్రక్రియలు లేకపోవడాన్ని ఆసరా చేసుకుని సేవను వినియోగించుకుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి మరియు అర్హులైన మహిళలు మాత్రమే ఈ పథకం ప్రయోజనం పొందేలా చూసేందుకు ప్రభుత్వం ఒక కొత్త నియమాన్నితీసుకువచ్చింది.

**ఆధార్ సరిపోదు.. తెలంగాణ నివాసి అయి ఉండాలి...** దుర్వినియోగాన్ని అరికట్టడానికి మరియు ధృవీకరణ ప్రక్రియను మరింత నమ్మదగినదిగా చేయడానికి ప్రభుత్వం ఒక కొత్త నియమాన్ని ప్రవేశపెట్టింది. మహిళలు ఇకపై ఉచిత ప్రయాణాన్ని పొందడానికి ఆధార్ కార్డు ముఖ్యమైన భాగంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు ఆ మహిళ తెలంగాణ నివాసి అని కూడా సూచించాలి. ఇతర రాష్ట్రాల మహిళలు ఉచిత బస్సు సేవను ఉపయోగించకుండా నిరోధించడం ఈ నిబంధన లక్ష్యం.

**ఉచిత ప్రయాణం కోసం స్మార్ట్ కార్డుల పరిచయం...** ఉచిత బస్సు సర్వీసును పొందేందుకు మహిళలు స్మార్ట్ కార్డ్ పొందడం తప్పనిసరి చేసింది.

ఈ స్మార్ట్ కార్డ్ అర్హతను ధృవీకరించడానికి మరియు బోర్డింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి మరింత సమర్థవంతమైన మరియు సురక్షితమైన మార్గంగా ఉపయోగపడుతుంది.

**స్మార్ట్ కార్డ్ కోసం ఎలా దరఖాస్తు చేయాలి... మీ సేవా కేంద్రాలను సందర్శించండి :** మహిళలు స్మార్ట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమీపంలోని మీసేవా కేంద్రాలను సందర్శించవచ్చు. దరఖాస్తు ప్రక్రియ సమయంలో, వారు ధృవీకరణ కోసం తమ ఆధార్ కార్డును చూపించాల్సి ఉంటుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తు :** మహిళలు తమ ఆధార్ వివరాలను ఉపయోగించి అధికారిక మీసేవా వెబ్ పోర్టల్ నుండి తమ స్మార్ట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు మరియు ప్రింట్ తీసుకోవచ్చు. ఇంటి నుండి దరఖాస్తు చేసుకోవడానికి ఇష్టపడే మహిళలకు ఈ ఆన్‌లైన్ ప్రక్రియ సౌకర్యవంతంగా ఉంటుంది.

**స్మార్ట్ కార్డ్ ప్రయోజనాలు... మోసాల నివారణ :** ఈ వ్యవస్థ నిజమైన రాష్ట్ర నివాసితులు మాత్రమే ఉచిత ప్రయాణ ప్రయోజనాన్ని పొందగలరని నిర్ధారిస్తుంది.

**వేగవంతమైన బోర్డింగ్ :** స్మార్ట్ కార్డులు బోర్డింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తాయి మరియు గందరగోళాన్ని తగ్గిస్తాయి, సీట్ల వివాదాలు మరియు రద్దీని నివారించడానికి సహాయపడతాయి.

**మెరుగైన డేటా నిర్వహణ :** స్మార్ట్ కార్డ్ వ్యవస్థ ప్రభుత్వం సేవ యొక్క వినియోగాన్ని ట్రాక్ చేయడానికి మరియు పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అనుమతిస్తుంది.



## నేతల చుట్టూ తిరిగితే పదవులు రావు

# ఫ్లెక్సీలు, దండలు వేస్తే కాదు...

# కష్టపడితేనే పదవులు!

## యూత్ కాంగ్రెస్ ప్రమాణస్వీకారోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

హైదారాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అగ్ర రాజకీయ నేతలంతా యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శివచరణ్ బాధ్యతలు స్వీకరించారు.

హనుమంతరావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్‌లో పని చేశారని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అక్కడ్నుంచే వచ్చారని పేర్కొన్నారు. రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ అనేది మొదటిమెట్టని ఆయన చెప్పుకొచ్చారు. పదవులు వచ్చినా, రాకపోయినా కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.."తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. పేదల ఆత్మగౌరవం కోసం ఇళ్లు కట్టిస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ పేరుతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేశారు. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. స్థానిక సంస్థల్లో యూత్ కాంగ్రెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తాం. ఫ్లెక్సీలు కట్టి దండాలు పెట్టేవారికి పదవులు రావు. ఢిల్లీ నుంచి కాదు.. గల్లీ నుంచి వచ్చిన వారికే పదవులు ఇస్తాం. దేశంలోనే ఎవరూ చేయనంత రుణమాఫీ తెలంగాణ రైతాంగానికి చేశాం. భూమి లేని వారికీ రూ.12 వేలు ఇస్తున్నాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించాం. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నికల్లో డబ్బుతో ఎవరూ గెలవలేరు. మేము ప్రజాభిమానంతో గెలిచాం. డబ్బులే గెలిపిస్తాయంటే కేసీఆర్‌కు 100 సీట్లు వచ్చి ఉండేవి. కొడితే గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారు. కేసీఆర్‌ను కొట్టాలంటే కేటీఆర్, కవిత, హరీశ్‌నే కొట్టాలి. కేసీఆర్‌ను కేటీఆర్ ఓడించారు, కేజ్రీవాల్‌ను కవిత ఓడించింది. కల్వకుంట్ల కుటుంబం అవినీతి చూసే ప్రజలు బుద్ధి చెప్పారు. దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం మాది. కులగణన, ఎస్సీ వర్గీకరణపై పక్కాగా చేసిన మా లెక్కను తప్పంటారా. కేసీఆర్ ఒక్క రోజే సర్వే చేసి కాకిలెక్కలు చూపించారు. చెట్ల మీద విస్తరాకులు కుట్టినట్టుగా గతంలో సర్వే చేశారు. తెలంగాణలో జీవించే హక్కు కేసీఆర్‌కు లేదు. గ్యాంబ్లర్స్ అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కులాల లెక్కలు ఎప్పటికీ తేలకూడదనే ఆ పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు తెలిసి, బలిసి సర్వేలో పాల్గొనలేదు. జనాభా లేకపోయినా రావులంతా పదవులు పంచుకున్నారు. బీసీలు ఆ లెక్కలు అడుగుతారనే అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన నా కోసం కాదు.. క్రమశిక్షణ కలిగిన సీఎంగా కులగణన చేయిచాం. దొంగ లెక్కలు చెప్పాలనుకుంటే మా కులాన్ని ఎక్కువ చూపించేవాళ్లం. బీసీ కులగణనకు రెండో విడత కూడా అవకాశం ఇచ్చాం. ప్రధాని నరేంద్ర మోదీ బీసీ కాదు.. లీగల్లీ కన్వర్టెడ్ బీసీ. 2002 వరకు మోదీది ఉన్నత వర్గమే.

ఆయన గుజరాత్ సీఎం అయ్యాక తన కులాన్ని బీసీల్లో కలిపారు. అన్నీ తెలుసుకునే మోదీ కులం గురించి మాట్లాడుతున్నా. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును సామాజిక బహిష్కరణ చేయాలని తీర్మానం చేశాం. లెక్కల్లో పాల్గొనాలని కేసీఆర్, కేటీఆర్ ఇళ్ల ముందు డప్పు కొట్టండి" అని అన్నారు.



# దివంగత సీఎం సంజీవయ్యకు సీఎం రేవంత్ ఘననివాళ్లు

దివంగత రాజకీయనేత, దేశంలోనే తొలి దళిత సీఎం స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.

శుక్రవారం ఆయన నివాసంలో సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళ్లు అర్పించారు. నిజాయితీకి నిలువెత్తు రూపం,దళిత జాతి ఆత్మగౌరవానికి ప్రతిరూపమని సీఎం రేవంత్ కొనియాడారు.స్వాతంత్ర్య సమరయోధుడు, దేశంలో తొలి దళిత సీఎం.. పరిపాలనలో మేటి, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ పెన్షన్‌లకు ఆద్యుడు అని ఓ సందేశంలో పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో అధికారిక ఖాతా 'ఎక్స్' వేదికగా ప్రకటించింది.

సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు పటేల్ రమేశ్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.




# గ్రామీణ రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ బ్యాక్ బోన్ లాంటిది

హైదరాబాద్: : గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ ఒక బ్యాక్ బోన్ లాంటిదన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. హైదరాబాద్ మ్యారి గోల్డ్ హోటల్ లో ఏర్పాటు చేసిన నాబార్డ్ రాష్ట్ర క్రెడిట్ సెమినార్ లో స్టేట్ ఫోకస్ పెపర్ 2025-26 ను విడుదల చేశారు భట్టి విక్రమార్క. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. భారత దేశంలోనే తెలంగాణ వృద్ధి రేటు గణనీయ సంఖ్యలో పెరిగిందన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగం పై నిర్లక్ష్యం చూపిందని విమర్శించారు. రానున్న రోజుల్లో నాబార్డ్ ఫ్లోరీ కల్చర్ కు సహకారం అందించాలన్నారు భట్టి. ఆయిల్ ఫాం కల్టివేషన్ అనేది ఇతర దేశాల్లో వెళ్లి చూశాం. అలా మన రాష్ట్రంలో చేయాలి. అన్ని వసతులు ఉన్నాయి కాబట్టి. ఇలాంటివి ఎంకరేజ్ చేయాలి. అర్బానికి ఫామింగ్ పై దృష్టి సారించాలి. మహారాష్ట్ర రాష్ట్రలో మామిడి ఎక్కువ ఎగుమతులు చేస్తుంది. కెన్యా దేశంలో మొబైల్ బ్యాంకింగ్ సిస్టం వల్ల గ్రామీణ ప్రాంతాలలో సులువుగా పనులు చేసుకుంటున్నారని అన్నారు భట్టి.

**రైతులకు రుణాలివ్వడంలో బ్యాంకులు ఆలస్యం చేయొద్దు: తుమ్మల....** వ్యవసాయం రంగం పట్ల తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుంది . దేశంలోనే తెలంగాణ రాష్టం వ్యవసాయంలో ముందు వరుసలో ఉన్నాం. ఆయిల్ ఫామ్ పంటతో పాటు ఇతర పంటలకు బ్యాంకులు సహాయం అందించాలి. ఎగుమతులకు,స్టోరేజ్ కి సంబంధించి బ్యాంకులు సపోర్ట్ చేయాలి. ఆర్టీకల్చర్ సాంగు విషయంలో చాలా వరకు కోతులతో సమస్య ఉంది. ఈ వైపరీత్యం నుండి బయట పడాలి అంటే మీరు రైతులకు సహాయం చేయాలి. ఇంత భూభాగం ఉండి, ఇన్ని వనరులు ఉండి ఇంకా బయట నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అన్ని రకాల పంటల కోసం రైతు బ్యాంక్ వస్తె బ్యాకింగ్ రంగం వారు రైతుకు ముందు గౌరవం ఇవ్వాలి. కొంత మంది లోన్ ఎగ్గొడితే వారి ఇండ్లకు తాళాలు వేస్తున్నారు. ఇంకొంత మంది అసలే అడగరు. చేత కాకపోతే రైతు వచ్చే సంవత్సరం లోన్ కడతాడు.. కానీ వ్యాపారులు విషయంలో అలా చేయరు మీకు దొరకరు రైతు నీ ఇబ్బంది పెట్టకండి. స్టేట్ ఫోకస్ పేపర్ ప్రజలకు ఉపయోగ పడేలా ఉండాలి అని తుమ్మల అన్నారు.

# ఫిబ్రవరి 1రిన దిల్లీ సీఎం ప్రమాణస్వీకారం..!




దిల్లీ: దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా.. ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే సీఎం ప్రమాణస్వీకారం ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ఉండనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ .. భారత్‌కు బయలుదేరిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే సోమ, మంగళవారాల్లో భాజపా శాసనసభా పక్ష నేతలు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశం అనంతరం నూతన సీఎం ఎవరనే దానిపై స్పష్టత రానుంది. ఇక, ఎన్నికల్లో గెలిచిన 48 మంది అభ్యర్థుల్లో 15 మందిని పార్టీ షార్ట్‌లిస్ట్ చేసింది. వీరిలో తొమ్మిది మందిని సీఎం, స్పీకర్, క్యాబినెట్ స్థానాలకు ఎంపిక చేయనుంది. దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మాజీ సీఎం కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నారు. ఆయనతో పాటు సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మ వంటి పలువురు నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళను సైతం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను భాజపా 48 స్థానాల్లో విజయఢంకా మోగించి తన 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంది. ఆప్ కేవలం 22 స్థానాలకే పరిమితం కాగా.. కాంగ్రెస్ ఖాతా తెరవలేక చతికిలపడిన విషయం తెలిసిందే.

# పార్టీ మార్పు ప్రచారంపై తలసాని షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మార్పు ప్రచారంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ఇప్పటికే పార్టీ మారిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని అన్నారు. అప్పటి పరిస్థితులను బట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారారని చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కేడర్ చాలా హుషారుగా ఉందని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వే చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. కుట్ర పూరితంగా కులగణన సర్వే చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌తో సహా.. గ్రామాల్లో కూడా సర్వే సక్రమంగా జరుగలేదని చెప్పుకొచ్చారు. 60లక్షల మంది ఎక్కడకు పోయారో రేవంత్ ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన లెక్కలు చూస్తే కూడా...మిగితా వాళ్లు ఎక్కడకు పోయారనేది క్లారిటీ లేదని అన్నారు. కులగణనపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తీర్మానం చేసి కేంద్రానికి పంపితే లాభం లేదని అన్నారు. జనాభా ప్రాతిపదికన ఫైనాన్స్ కమిషన్ నుంచి కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తుందని తెలిపారు. 57శాతం బీసీ జనాభా ఉంటుందని.. ముస్లింల లెక్క తేలకుండా హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలకు పోవద్దని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలని.. కానీ తమ మీద పడి ఏడవడం ఏంటి..? అని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.



# ఆ విషయంలో మోదీనే టఫ్

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన ప్రధాని నరేంద్రమోదీ పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో ఒకరిపై మరొకరికి ఉన్న స్నేహాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. దానికి ట్రంప్ సరదాగా సమాధానం ఇచ్చారు. ట్రంప్, మోదీ.. ఈ ఇద్దరిలో మెరుగ్గా బేరమాడేది ఎవరు..? అని మీడియా ప్రశ్నించింది. " ఆ విషయంలో మోదీనే నాకంటే చాలా మెరుగ్గా బేరసారాలు ఆడగలరు. అందులో ఎలాంటి అనుమానం లేదు" అని ట్రంప్ టక్కున బదులిచ్చారు. అలాగే పరస్పర సుంకాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "సుంకాలు, పన్నులు పరస్పరం ఉంటేనే న్యాయంగా ఉంటుంది'' అని స్పష్టంచేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ.. దానిని ముగించుకొని స్వదేశానికి పయనమయ్యారు. వీరి భేటీలో సుంకాలు, వలసలు, ఇరుదేశాల వ్యూహాత్మక అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. "చాలా ఏళ్లుగా మోదీ నాకు స్నేహితుడు. మా స్నేహాన్ని రానున్న నాలుగేళ్లు కొనసాగిస్తాం. ప్రపంచంలో ఏ దేశానికీ లేనివిధంగా మాకు ఆయిల్, గ్యాస్ వనరులు అందుబాటులో ఉన్నాయి. అవి భారత్‌కు కావాలి. మా ఇద్దరి మధ్య గొప్ప ఐక్యత, స్నేహం ఉన్నాయి. దేశాలుగా భారత్, అమెరికా కలిసి ఉండటం చాలా ముఖ్యం. వేం ఎవర్నీ ఓడించాలనుకోవట్లేదు. మంచి చేయాలని చూస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అద్భుతంగా పని చేశాం. అమెరికాలో గత పాలన మాకు అంతరాయం కలిగించింది" అని ట్రంప్ అన్నారు. ఇక ఈ భేటీకి కొన్ని గంటల ముందు అధ్యక్షుడు సుంకాల కొరడా ఝుళిపించారు. అమెరికా దిగుమతులపై సుంకాలు విధించే అన్ని దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని ప్రకటించారు. ట్రంప్ విధించిన ప్రతిసుంకాల ప్రభావం అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారత్, బ్రెజిల్, వియత్నాంతోపాటు తూర్పు ఆసియా, ఆఫ్రికా దేశాలపై పడనుంది. ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా సగటున 3శాతం సుంకాలను విధిస్తోంది. భారత్ 9.5శాతం సుంకాలను విధిస్తోంది. దీనిపైనే ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు.

**ఆ కాపీ రైట్ ట్రంప్ వద్దే: మోదీ...** ఈ పర్యటనలో భాగంగా మోదీతో ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు.

ఇద్దరి మధ్య వ్యాపారానికి సంబంధించిన చర్చలు, ఒప్పందాలు జరిగాయా..? అని మీడియా ప్రశ్నించింది. "నాకు ఎలాన్ మస్క్ చాలాకాలంగా తెలుసు. ఆయన కుటుంబంతో కలిసివచ్చారు. కుటుంబ విషయాలే మేం మాట్లాడుకున్నాం. డీల్ అనే పదానికి కాపీ రైట్ ట్రంప్ వద్దే ఉంది" అని మోదీ చమత్కరించారు.

# గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు..



సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి ఫైర్ అయ్యారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయవద్దని అన్నారు. శుక్రవారం గుమ్మడిదలలో జీహెచ్ఎంసీ డంప్‌యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా స్థానికులు చేస్తున్న ఆందోళనకు మాజీ మంత్రి మద్దతు తెలుపుతూ.. సంఘీభావంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు తెచ్చి మా నెత్తిన వేయకండి అంటే మొండిగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. పర్యావరణం దెబ్బతింటదని, నర్సాపూర్ చెరువు కలుషితం అవుతుందని.. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయనే వద్దు అంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు గతంలోనే ఈ పనులను ఆపామని చెప్పుకొచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వెళ్తోందన్నారు. రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ లెక్క చేస్తున్నారని విమర్శించారు. వందల మందిని ఎత్తుకొని పోయి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారని.. రాత్రికి రాత్రి పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదన్నారు. గుమ్మడిదల రైతులు అందరికీ ఆదర్శమని.. బంగారం వంటి పంటలు పండిస్తారని తెలిపారు. తక్షణమే డంపు యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక లగచర్ల భూములు గుంజుకున్నారని..న్యాల్కల్‌లో పచ్చటి పొలాలు గుంజుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయకండని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం అన్నారని.. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఊళ్లలో మంది ఎంత మంది ఉంటే అంత మంది పోలీసులను పెట్టారని.. ఓట్లేసిన పాపానికి ప్రజలను మోసం చేశారంటూ మండి పడ్డారు. రుణమాఫీ, రైతు బంధు, మహాలక్ష్మి, ఇలా అన్నీ మోసమే అని అన్నారు. గుమ్మడిదల రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పకుండా అసెంబ్లీ వేదికగా గుమ్మడిదల ప్రజల తరపున పోరాటం చేస్తామని... ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామన్నారు. ఎయిర్ ఫోర్స్ వాళ్లు కూడా ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని.. అయినా పట్టించుకోవడం లేదన్నారు. టిప్పర్లు, పోలీసులను వెనక్కి తీసుకోవాలని.. ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కళ్లు తెరవకుంటే తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. చేతిలో అధికారం ఉందని బలవంతంగా పని చేయవద్దన్నారు. రెండు సార్లు హైకోర్టు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పనులు ఆపాలని, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌లను హెచ్చరిస్తున్నామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఓటమి ఖాయం.. వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే



సంగారెడ్డి, ఫిబ్రవరి 14: తెలంగాణ మొత్తం కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పదేళ్లు పరిపాలన చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా పూర్తిగా వైఫల్యం అయిందని విమర్శించారు. పదేళ్ళలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత వస్తే కాంగ్రెస్ పార్టీపై పది నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. "రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉంది" అని అన్నారు. బీజేపీ మాత్రమే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు గేలిస్తే ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో ఉంటారన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనమండలిని నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యలు చేశారు. అసలు శాసనమండలి ఉందా లేదా అన్న అనుమానం కలిగేటట్టు బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. హైదరాబాద్‌లో నిరుద్యోగుల వద్దకు వచ్చి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రం పీఆర్సీ ప్రకటించినా రాష్టంలో మాత్రం ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. రాబోయే రోజైల్లో కొత్త ఇంటర్నేషనల్ స్కూల్ మాట దేవుడేరుగు ఉన్న స్కూళ్లకు రంగులు వేయలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్, బీఆర్ఎస్ దెబ్బతీశాయని దుయ్యబట్టారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్క్, కరీంనగర్ యూరియా ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి అంతా బీజేపీ హయాంలోనే జరిగిందని తెలిపారు. రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తున్నది మోడీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది మోడీ అని అన్నారు. 2014లో మోడీ ప్రధాని కాక ముందు 3 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు 26 వేల కోట్లతో తెలంగాణ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. "కేంద్రం ఏం చేసింది అంటూ మాట్లాడుతున్నారు. కేసీఆర్, రేవంత్ కలిసి వస్తే రండి. పదేళ్ళలో మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తాం. గ్రామ పంచాయితీలకు రాష్టం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. హరీష్ రావు, కేటీఆర్ కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా" అంటూ సవాల్ విసిరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి ప్రధాని మోడీ వస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని మండిపడ్డారు. రాబోవు అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా మాత్రమే వస్తుందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమన్నారు. తెలంగాణలో అధికారంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే అంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఆ హార్డ్ డిస్క్‌లో 300లకు పైగా నగ్న వీడియోలు..

హైదరాబాద్: జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు రెండో రోజు శుక్రవారం విచారిస్తున్నారు. నగ్న వీడియోల కేసులో మస్తాన్ సాయిపై లావణ్య ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మస్తాన్ సాయిపై సైబర్ నేరం, లైంగిక దాడి, బ్లాక్ మెయిలింగ్ కేసులు పెట్టారు. నగ్న వీడియోలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను లావణ్య నార్సింగి పోలీసులకు ఇచ్చింది. ఆ హార్డ్ డిస్క్‌లో 300లకు పైగా నగ్న వీడియోలు ఉన్నాయనీ లావణ్య పిర్యాదు చేసింది. ఈ క్రమంలో హార్డ్ డిస్క్, నగ్న వీడియోలపై మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు విచారించనున్నారు. మరో వైపు మస్తాన్ సాయి ఇంట్లో డ్రగ్స్ పార్టీలు జరిగిన నేపథ్యంలో ఆ డ్రగ్స్ ఎక్కడ నుండి వచ్చాయి.. ఎవరు సప్లై చేశారు.. తదితర అంశాలపై పోలీసులు ఫోకస్ పెట్టి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శనివారంతో మస్తాన్ సాయి పోలీస్ కస్టడీ ముగియనుంది. కాగా మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. సైబర్ క్రైం, లైంగిక దాడి, బ్లాక్‌మెయిలింగ్ వంటి కేసులో మస్తాన్ సాయిని పోలీసులు ఈనెల 3న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు మస్తాన్ సాయికి చెందిన హార్డ్ డిస్క్‌ను ఓపెన్ చేసి, అందులో వివరాలు సేకరించనున్నారు. హార్డ్ డిస్క్‌లో ఏముంది. లావణ్య చెప్పినట్లు అశ్లీల రికార్డింగులు ఉన్నాయా.. మొత్తం ఎన్ని వీడియోలు ఉన్నాయి.. అన్న విషయంపై పోలీసులు ఆరా తీయనున్నారు. అయితే మస్తాన్ సాయి పోలీసులతో సానుకూలంగానే ఉన్నట్లు, అన్ని వివరాలను వెల్లడించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణ అనం తరం నివేదికను కోర్టుకు సమర్పిస్తామని నార్సింగ్ పోలీసులు తెలిపారు.

**కోర్టులో తేల్చుకుంటా: లావణ్య..** పోలీసులు మస్తాన్ సాయిని కస్టడీలోకి తీసుకున్న తర్వాత లావణ్య కోకాపేట్‌లోని తన నివాసంలో కొంత మంది మీడియా ప్రతినిధులతో మీడియా సమావేశం నిర్వహించారు. పోలీసుల విచారణలో చాలా విషయాలు వెలుగు చూస్తాయన్నారు. ఆ తర్వాత ఆయా విషయాలపై తాను కోర్టుకు వెళ్లి తేల్చుకుంటానని చెప్పారు. రాజ్ తరుణ్ కుటుంబానికి ఆమె ఈ సందర్భంగా క్షమాపణ తెలిపారు.

తాను ఇంకోసారి. మీడియా ముందుకు రానని. ఏ విషయమైనా కోర్టులో తేల్చుకుంటానని చెప్పారు. సెప్టెంబర్‌లో డీఐతో ఓ కేసు విషయం మాట్లాడాలని.. అయితే, ఈ డీఐ అంశంలో తన అనుమతిలేకుండా చాలామంది వీడియోలు, వాయిస్ రికార్డులు ప్రచారం చేస్తున్నారని ఆమె అన్నారు.




# చురకలు

## సంపాదకీయం

### ఒక్క మాటతో తలకిందులైన జీవితం 15 ఏళ్ల రాజకీయం అంతం!

వల్లభనేని వంశీ.. మోస్ట్ పాపులర్ పొలిటీషియన్. టీడీపీలో రాజకీయ జీవితం ప్రారంభించి ఆ పార్టీపైనే తిరుగుబాటు చేసి.. పార్టీ అధినేత కుటుంబంపై నోరుజారి చిక్కుల్లో పడిన నాయకుడు. గన్నవరం నుంచి టీడీపీ తరఫున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వంశీ.. అదే పార్టీకి టార్గెట్ అయ్యారు. దూకుడైన రాజకీయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటుచేసుకున్న వంశీ.. అదే దూకుడుతో ఇబ్బందులు కొని తెచ్చుకున్నారంటున్నారు. పదిహేనేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసినా, తాజాగా ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితిని ఎవరూ సమర్థించలేకపోతున్నారని అంటున్నారు. ఆయన సొంత పార్టీ వైసీపీ కూడా వంశీ అరెస్టును ఖండిస్తున్నా, ఆయన గతంలో వ్యవహరించిన తీరును దాటవేస్తూ తప్పించుకుంటోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సినీ నిర్మాతగా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చిన వల్లభనేని వంశీ.. టీడీపీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర అనుచరుడిగా ఆ పార్టీకి దగ్గరయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ తో సినిమాలు తీసి ఆయనకు దగ్గరైన వంశీ.. టీడీపీలో ఓ స్థాయి నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2009లో తొలిసారి టీడీపీ టికెట్ పై విజయవాడ పార్లమెంటుకు పోటీ చేసిన వంశీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవి చూసింది. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరగడం, 2014 ఎన్నికల్లో కేశినేని నానికి ఎంపీ టికెట్ ఇవ్వడంతో వంశీకి గన్నవరం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. జూనియర్ ఎన్టీఆర్ తో సంబంధాలు, ఓడినా పార్టీ కోసం పనిచేయడం, దివంగత నేత పరిటాల రవీంద్ర అనుచరుడనే గుర్తింపు కలిసిరావడంతో వంశీకి టీడీపీకి మంచి పట్టున్న గన్నవరం టికెట్ దక్కింది. గన్నవరంలో ఇప్పటివరకు టీడీపీ ఓడిన చరిత్ర లేదు. రెండు సార్లు ఇండిపెండెంట్లు గెలిచినా, ఆ ఇద్దరూ టీడీపీ నేతలే కావడం గమనార్హం. అలాంటి సీటులో రెండు సార్లు పార్టీ అవకాశమిస్తే.. 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత వంశీ అప్పటి అధికార పార్టీ వైసీపీకి దగ్గరయ్యారు. 2014లో ఎమ్మెల్యే అయిన తర్వాత 2019 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత జగన్ పాదయాత్రకు ఎదురెళ్లి ఆయనతో కరచాలనం చేసినా అప్పట్లో టీడీపీ పెద్దగా పట్టించుకోలేదు. వంశీపై నమ్మకంతో 2019లో టికెట్ ఇచ్చి గెలిపించారు. టికెట్ ఇవ్వడమే కాకుండా ఆర్థికంగా భారీ సాయం చేశారని కూడా ఆ పార్టీలో టాక్. అయితే ఎన్నికల్లో గెలిచాక వైసీపీకి దగ్గరైన వంశీ.. మిగిలిన ఎమ్మెల్యేల్లా కాకుండా.. పరిధి దాటి వ్యవహరించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంతి చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్, చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వ్యక్తిగత దూషణలకు దిగి ముప్పు తెచ్చుకున్నాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో వంశీ నోరు జారడంతోనే చంద్రబాబు కన్నీరు పెట్టుకోవడం, కౌరవ సభ నుంచి వాకౌట్ చేస్తున్నానని, మళ్లీ గెలిచి సీఎంగా గౌరవ సభలోనే అడుగు పెడతానని ప్రతినబూనారు. అలా వంశీ నోరు జారిన ఒక్క మాటే ఆయనకు ఆయన మద్దతు పలికిన పార్టీకి తీరని నష్టం చేసింది. 151 ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని నడిపిన వైసీపీ.. ప్రతిపక్ష హోదాకు కూడా అర్హత సాధించలేకపోయింది. ఇక వ్యక్తిగతంగా తాను ఎంతటి తప్పు చేశానో తెలుసుకున్న వంశీ నష్టనివారణ ప్రయత్నాలు చేసినా అవేవీ ఫలించలేదు. అప్పటికే ఆయన మాటలు టీడీపీ క్యాడర్ ను తీవ్రంగా బాధించడంతో సంబంధం లేనివారు కూడా వైసీపీ పతనాన్ని కోరుకునేలా చేసిందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆయన అరెస్టు తర్వాత క్రిష్ణలంక పోలీసు స్టేషన్ ఎదుట మాట్లాడిన వంశీ భార్య కూడా తప్పు అయిపోయిందనే భావాన్ని వ్యక్తం చేయడం.. తప్పు అంతా చేస్తారని, తమకు న్యాయం చేయాలని వేడుకోవడం చూస్తుంటే వంశీ మాటల ద్వారా ఎంత నష్టపోయాడనేది అర్థం అవుతోందనే విశ్లేషిస్తున్నారు. చంద్రబాబు కుటుంబంపై మాట జారిన వంశీ గత 9 నెలలుగా అండర్ గ్రౌండులో దాక్కోవాల్సివచ్చిందని అంటున్నారు. ఆయనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా, ప్రభుత్వ పంతం వల్ల అనూహ్యంగా కిడ్నాప్ కేసులో ఇరుక్కున్నారనే టాక్ వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఓడిన తర్వాత తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని, అమెరికా వెళ్లి వ్యాపారాలు చేసుకుంటానని ప్రభుత్వానికి మధ్యవర్తుల ద్వారా సంప్రదించినా, అటు నుంచి క్షమించే పరిస్థితి లేకపోవడంతో వంశీ ఉక్కిరిబిక్కిరి అయ్యారంటున్నారు. ఏ పార్టీ కోసం అయితే పనిచేశాడో.. అదే పార్టీ కార్యకర్తలుగా బద్ధ శత్రువుగా మారడం వంశీ విషయంలో చూస్తున్నామని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రాజకీయాల్లో పరిధి దాటి వ్యవహరిస్తే ఎలాంటి ఫలితాలు అనుభవించాల్సివస్తుందో వంశీ కేసు ఓ కేస్ స్టడీగా నిలుస్తుందంటున్నారు. కేవలం అదుపు తప్పి నోరు జారిన ఒకే ఒక మాటే వంశీని ఇప్పుడు ఇన్ని కష్టాలు ఎదుర్కొనేలా చేస్తుందనే అభిప్రాయం అంతా వ్యక్తం చేస్తున్నారు.

## నూతన ఆవిష్కరణల రూప కర్త గెలీలియో - ఫిబ్రవరి 15... గెలీలియో జయంతి



గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలీస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జననం 1 5 6 4 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు. గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పదిరెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడగలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ 'Dialogues concerning the two chief world systems" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథానికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర?త్వం బలిగొంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


## నేటి తరానికి ఆదర్శం....ధర్మబిక్షం సేవాభావం - ఫిబ్రవరి 15...తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మబిక్షం జయంతి



ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం.. బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమాలలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచుకున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చుకున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మభిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ - ఫిబ్రవరి 15...సేవాలాల్ మహరాజ్ జయంతి



సంత్ సేవాలాల్ మహారాజ్‌ను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారు. ఆయన జయంతిని పండుగలా జరుపు కొంటారు. గిరిజ నులకు చైతన్యం కలిగించి, వారికి దశ - దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని పేర్కొంటారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపం చానికి చాటేలా అహింసా సిద్ధాం తానికి పునాదులు వేసి, సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గ దర్శకురాలిగా, గురువుగా స్వీకరిం చి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్న మయ్యారు. సేవా లాల్ ప్రజల మూఢ విశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజా రాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండే వారు. రాజుల కాలం నుం చి బ్రిటిష్ కాలం వరకు బంజారాలు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగించే వారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారంతో బంజా రా సమాజం అనేక ఇబ్బందులకు గురయ్యింది. అలాంటి పరిస్థితుల లో బంజారాలను మంచి మార్గంలో నడిపించడానికి సేవాలాల్ అవత రించారని చెపుతారు. సాతీ భవానీ (సప్త మాతృకల)' పూజా విధానా లు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. ఆయన బోధనల ద్వారా బంజారా జాతి నడచుకుంది. లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు. సేవాలాల్ శివ పూజారి. ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు. తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేయడం తీజ్ ఉత్సవ సాంప్రదాయం. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత దేశంలోని దాదాపు 10 కోట్లకు పైగా బంజారా లకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు. సేవాలాల్ మహారాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. అహింస మహా పాపమని, మద్యం, ధూమ పానం శాపమని హితవు పలికాడు. ఆ రోజుల్లో నే బంజారాల పరువు ప్రతిష్టల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. సంత్ సేవాలాల్ మహారాజ్ మహి మలు అద్భుతమైనవిగా చెప్పు కుంటారు. మహిమల గురించి అనేక కథనాలు ఉన్నాయి. వాటిలో పురుషున్ని స్త్రీగా మార్చడం, ఒక ముంత బియ్యంతో 10,000 మందికి భోజనాలు పెట్టడం, చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బ్రతికించడం, విషం కలిపిన తీపి వంటకాలను నిర్వీర్యం చేయడం. ఉధృతంగా పారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం లాంటి మహిమలను ప్రదర్శించారని చెపుతారు. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్య సాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా స్పష్టం అవుతున్నది. బంజా రాలు రాజపుత్రుల వలె ధృఢ కాయు లని, చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నాడు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ సైన్యంలో బంజారాలు వీరోచితంగా పోరాడి నట్లు చరిత్ర చెపుతున్నది. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నా రని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబు లు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చా రని గ్రంథస్థం అయి ఉంది. సభ్య సమాజానికి బహు దూరంగా, అడవి తల్లి ఒడిలో ఉంటూ, అటవీ వనరులపై ఆధార పడుతూ, ప్రత్యేక జీవన విధానం కలిగి ఉన్న, అంతగా అభివృద్ధి చెందని తెగల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికా బద్ధ కార్యక్ర మాలు అమలు చేస్తున్నా, ఇంకా చేయాల్సిన అవసరం అనివార్యం గా ఉంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సింహభాగం వరి సాగుకే సై

కరీంనగర్ : ప్రస్తుత యాసంగిలోనూ జిల్లా రైతులు అధికశాతం వరి సాగు వైపే మొగ్గు చూపారు. గతేడాది యాసంగిలో నీరందక వేలాది ఎకరాల్లో పంట దిగుబడి తగ్గి నష్టపోయారు. నీరందిన చోట పొట్టదశలో ఈదురు గాలులు, వడగళ్ల వానతో కొన్ని ఎకరాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మొక్కజొన్న సైతం దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నేళ్లకు ముందు సరిపడా నీరు అందుబాటులో లేక యాసంగిలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేవారు. అయిదారేళ్లుగా సాగునీరు సమృద్ధిగా ఉండటం, పంట కూలీల ఖర్చు, కోతులు, పక్షుల బెడద లేకపోవడంతోపాటు వరి సాగు వైపు అధిక శాతం మంది మొగ్గు చూపారు. ఈనెల మూడో వారం తర్వాత యాసంగి పంట సాగు సమయం ముగిసినట్లుగానే భావించవ



చ్చని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

**నీటి సరఫరాపై సతమతం**

గతంతో పోల్చితే ఈ యాసంగిలో ఇప్పటివరకు సాగుచేసిన పంటలకు నీటి లభ్యత ఉండే అవకాశముంది. ఎస్సారెస్పీలో 40, మధ్య మానేర్‌లో 20, లోయర్ మానేర్‌లో 15 టీఎంసీల వరకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉష్ణోగ్రతల తీవ్రత గత వేసవికన్నా అధికంగానే ఉండనున్నట్లు సమాచారం. ఆయకట్టు చివరి పంటలకు మినహా మిగిలినవాటికి నీటి సమస్య తలెత్తకపోవచ్చంటున్నారు. గతేడాది మార్చిలో ప్రకృతి ప్రళయానికి గురైన రైతులు పంట నష్టపోయారు. ఈసారి అలాంటి ఘటనలు పునరావృతమైతే వరిసాగు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**సరిపడా నిల్వలున్నాయి**

జిల్లాలోని ప్రాజెక్టుల్లో యాసంగి పంట పూర్తి నాటికి సరిపడా నీటి నిల్వలున్నాయి. ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# ఘాట్‌రోడ్డుకు మోక్షమెప్పుడో..?

మల్లాపూర్: సముద్ర మట్టానికి 800 మీట్లర్ల ఎత్తులో ప్రకృతి రమణీయతతో అలరారుతున్న శ్రీకనక సోమేశ్వరకొండను పర్యాటకప్రాంతంగా గుర్తించడంతో పాటు కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మిస్తామన్న నేతల హామీ నేటికి కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఏటా కొండపై కొలువైన స్వామివారిని దర్శించుకొనే భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. కొండపై వెలసిన సోమేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు ఏటా లక్షల్లో భక్తులు కొండపైకి వెళ్తుంటారు. సోమవారం, శివరాత్రి, శ్రావణమాసాల్లో వేలాదిగా వస్తున్న భక్తులు మెట్లమార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు ఒక్కొక్కరు 5 నుంచి 10 మెట్లవరకు విరాళాలతో నిర్మించారు.



**రూ.10 కోట్లు మంజూరు..** గత ప్రభుత్వం కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనుల్లో పురోగతి కనిపించకపోవడం భక్తులను విస్మయానికి గురిచేస్తోంది. ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. శివరాత్రి సమయంలో మండల దీక్షాపరులు నిత్యం కొండపైకి వెళ్లిరావడం ఇబ్బందిగా పరిణమిస్తోంది. మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఘాట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఘాట్‌రోడ్డు నిర్మించాలని భక్తులు కోరుతు న్నారు.

**కలగానే రోప్‌వే నిర్మాణం** సోమేశ్వరకొండతో పాటు పురాతన వాల్గొండ రామలింగేశ్వర ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి అవసరం ఉంది. గతంలో ఆలయాన్ని పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు సోమేశ్వర కొండకు రోప్‌వే నిర్మాణం చేపట్టి, హరిత హెూటల్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రోప్‌వే ఏర్పాటు కలగానే మిగిలింది.

# విలీన గ్రామాలు.. చెప్పలేని ఇక్కట్లు

నిర్మల్ : నిర్మల్ మండలం మంజులాపూర్ గ్రామాన్ని పురపాలికలో ఆరేళ్ల క్రితం విలీనం చేసి రెండు వార్డులుగా విభజించారు. ఇందులో 19వ వార్డు అంబేద్కర్ కాలనీలో కొత్త ప్లాట్లుగా పిలుచుకునే ఈ ప్రాంతం ఏర్పడి 30 ఏళ్లకుపైగా అవుతోంది. పంచాయతీగా ఉన్నప్పుడు రోడ్లు, మురుగుకాలువలు కొన్నింటిని అభివృద్ధి చేశారు. బల్దియాలో చేరి తర్వాత అయిదేళ్ల కాలంలో ఇక్కడ రూ. 6 లక్షలతో ఒక్క డ్రైనేజీ మాత్రమే నిర్మించారు. ఆ తర్వాత ఎలాంటి పనులు చేపట్టలేదు. విలీనమైన రెండు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

అధిక జనాభా, భూముల ధరలు ఎక్కువగా ఉండి ఆర్థిక వనరు లభించే సమీపంలోని గ్రామాలను గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. అందులో భాగంగా మంజులాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో నిర్మల్ పురపాలికలో చేర్చి మూడు వార్డులుగా విభజించారు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఏదో ఒక పథకం కింద అంతోఇంతో లబ్ధి చేకూరేది. బల్దియాలో కలిసినప్పటి నుంచి ఒక్కో వార్డులో దాదాపు రూ. 6-10 లక్షల వరకు మాత్రమే పనులు చేసిన దాఖలాలు ఉన్నాయి. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు అలాగే ఉండటంతో ప్రజలు వాటి మధ్యే జీవనం సాగించాల్సి వస్తోంది.

**ఇబ్బందుల మధ్య..**

ఇంటిపన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులు వంటి వాటితో బల్దియాకు ఆదాయం సమకూరుతున్నా స్థానికులకు కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. రోడ్లు, మురుగుకాలువలు అభివృద్ధికి నోచుకోలేక పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వీరు ఎదుర్కొనే సమస్యలు చెప్పలేనివి. బురదమయంగా మారే మార్గాలు, ఎక్కడికక్కడ నిలిచే మురుగుతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమల ఉద్ధృతితో వ్యాధుల బారినపడే పరిస్థితి. పంచాయతీలుగా ఉన్న సమయంలో కార్యదర్శులకు, తమకు తెలిసిన వారికి చెప్పి వాటిని పరిష్కరించుకునేవారు. ప్రస్తుతం ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అధికారులే విలీన గ్రామాల సమస్యలపై స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. టీయూఎఫ్‌ఐడీసీలో విలీన గ్రామాల వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు. నిధుల మంజూరు, ఆమోదం వచ్చిన వెంటనే వాటిని చేపట్టి స్థానికుల ఇబ్బందులు పరిష్కరిస్తామని వెల్లడించారు.

# ఆదిలో జోరు.. తుది దశలో జాగు



కరీంనగర్ : దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వంద స్మార్ట్‌సిటీల్లో కరీంనగర్ ఒకటి. అలాంటి నగరంలో అభివృద్ధి పనులు మొదట్లో ఊపందుకోగా.. ఆ తర్వాత నెమ్మదించాయి. భవన నిర్మాణాలతోపాటు సాంకేతికపరంగా చేపట్టాల్సిన పనుల్లో జాప్యం జరుగుతుండటంతో వీటన్నింటిని ఎప్పటిలోగా అందుబాటులోకి తీసుకొస్తారనేది స్పష్టతలేదు. రూ. 937.10 కోట్లతో మొత్తం 48 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టగా.. ఇందులో 33 ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయి.

**14 ప్రాజెక్టులు నిర్మాణ దశలోనే..**

మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా 14 ప్రాజెక్టుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరొకటి టెండర్ల దశలోనే ఉంది. కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణంలో డిజైన్లు ఇవ్వకపోవడంతో ఆలస్యమైంది. మొదటి దశలో రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, వీధిదీపాలు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటివి పూర్తి చేశారు. రెండో దశలో పార్కులు, అంబేడ్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఉచిత వైఫై, డిజిటల్ తెరలు, స్మార్ట్ క్లాసులు వంటివి చేపట్టారు.

**నెలలు గడుస్తున్నా..**

నగరంలోని గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో ఓ మాజీ ఎమ్మెల్సీ ఇంటి ఎదురుగా ప్రధాన వరదకాలువ, ఎన్టీఆర్ విగ్రహం ఎదుటనున్న డ్రైనేజీ నిర్మాణం, కట్టరాంపూర్ నుంచి డ్యాంకు వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు పనులు, అహ్మద్‌పురలో డ్రైనేజీ నిర్మాణం వంటి పనులు పెండింగ్‌లో ఉంచారు. నెలలు గడుస్తుండగా.. కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. పద్మనగర్, సదాశివపల్లి జంక్షన్ల పనులు నేటికి మొదలుకాలేదు. బాలసదనం, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణాలు ఆరంభించి వదిలేశారు.

**అధికారులు మారినా పట్టింపేది?**

నగరపాలికలో ఇంజినీరింగ్ అధికారులు మారుతుండగా.. పూర్తయిన స్మార్ట్ పనుల విషయంలో పట్టింపు లేకుండా పోతుంది. నిర్మాణం పూర్తయ్యాక నిర్ణీత గడువులోగా నిర్వహణ పనులు చూసుకోవాల్సి ఉండగా.. అధికారులు ఆ దిశగా ఆలోచించడంలేదు. వీధిదీపాలు కొత్తవి బిగించడం లేదు.

# నర్సరీ మొక్కలకు నీడ కరవు



జూలూరుపాడు : నర్సరీల్లో మొక్కలకు నీడ కరవైంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అధికమవుతుండగా మొలక శాతం తగ్గిపోతోంది. ఈ కారణంగా మొక్కల పెంపకం ఇబ్బందికరంగా మారింది. జూలూరుపాడు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 24 నర్సరీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 2.47 లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. 2025-26 సంవత్సరంలో వన మహోత్సవంలో భాగంగా పచ్చదనం పెంచేందుకు గతంలో కంటే భిన్నమైన మొక్కల రకాలను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకే నర్సరీల్లో పండ్ల మొక్కలు, ఔషధ మొక్కల పెంపకానికి అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్నీ నర్సరీల్లో విత్తనాలు నాటారు. వీటిల్లో కొన్ని రకాలు అసలు మొలకెత్తనేలేదు. మరోవైపు నీటి తడులు కల్పిస్తున్నప్పటికీ మొక్కల బెడ్లు తేమ ఆరిపోతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు వడబడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35డిగ్రీలకు పైనే నమోదవుతున్న నేపథ్యంలో వీటిని కాపాడుకోవడానికి షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**33 రకాల మొక్కల ఎంపిక**

ఈ ఏడాది మొక్కల పెంపకానికి సంబంధించి 33 రకాల జాబితాను ప్రకటించారు. వీటిలో ఏది అనుకూలంగా ఉంటుందో వాటినే నాటాలని సూచించారు. ఈ మేరకు నర్సరీల్లో కరక్కాయ, గోరింటాకు, మందారం, మునగ, తులసి, మునగ, ఉసిరి వంటి ఔషధ రకాలతో పాటు, సీతాఫలం, వెలగ, టెకోమా, షిషు వంటి రకాలను నర్సరీల్లో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా నర్సరీల్లో ఇంకా అడవి జాతుల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు కనిపిస్తున్నాయి. వీటిని అనంతపురం నుంచి నర్సరీలకు తెప్పిస్తున్నారు. చిన్న నర్సరీల్లో 11 వేల మొక్కలు, పాపకొల్లు, కాకర్ల వంటి పెద్ద నర్సరీల్లో 13 వేల చొప్పున మొక్కలు పెంచుతున్నారు.

**నీడకు పరదాలు**

ప్రస్తుతం ఏ నర్సరీల్లోనూ నీడకు పరదాలు వినియోగించడం లేదు. గతంలో వేసిన షేడ్‌నెట్స్ అన్నీ చిరిగిపోయాయి. కొన్నిచోట్ల అసలు ఆనవాళ్లే లేవు. ఎండలు అధికమవుతున్న ఇలాంటి పరిస్థితుల్లో పరదాలు కొనుగోలు చేయాల్సి ఉంది. వీటిని గ్రామ పంచాయతీల నుంచి గతంలో కొనుగోలు చేశారు. అటు ఉపాధి హామీ సిబ్బంది, మరోవైపు గ్రామ పంచాయతీ కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తున్నా అక్కడక్కడ సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం, మోటార్లు మొరాయించడం వంటి సమస్యలతో నీటి తడులు కల్పించేందుకు అవస్థలు తప్పటం లేదు.

ఈ ఏడాది కలెక్టర్ సూచించిన మొక్కల జాబితాకే ప్రాధాన్యం. వాటిల్లో రకాలను మాత్రమే నర్సరీల్లో పెంచుతున్నాం. ప్రస్తుతం ఎండల తీవ్రత సమస్యగా మారింది. మొక్కలు చనిపోకుండా నీటి తడులు కల్పిస్తున్నప్పటికీ కొన్నిచోట్ల మొలక శాతం తక్కువగా ఉంది. నీడకు పరదా(షేడ్‌నెట్స్)లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రవికుమార్, ఏపీఓ

# ఇక నుంచి 'మీ సేవలో'..!




కొత్తగూడెం: రేషన్‌కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించటానికి పౌరసరఫరాలశాఖ మరో అవకాశం కల్పించింది. ఇందుకోసం మీసేవ వెబ్‌సైట్‌లో 'మీ-దరఖాస్తుల స్వీకరణ' ఐచ్చికాన్ని అధికారులు పునరుద్ధరించారు. నాలుగు రోజులుగా దరఖాస్తుల స్వీకరణపై నెలకొన్న గందరగోళానికి స్వస్తి పలికారు. ఫలితంగా కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచి మొదలైంది. అయితే రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం, కులగణన లేదా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ ఇప్పుడు అర్జీ పెట్టుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కొత్త కార్డు, చిరునామా మార్పు, కొత్తగా కుటుంబ సభ్యులను చేర్చటం వంటి వాటికి అవకాశం కల్పిస్తున్నారు. ఆధార్‌కార్డు ద్వారా కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని మీసేవ నిర్వాహకులు సూచిస్తున్నారు.

**కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ**

ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించిన విషయం విదితమే. వివిధ గ్రామాల్లో అధికారులు వెల్లడించిన అర్హుల జాబితాలపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. జాబితాలో పేర్లు రానివారు, 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకోని వారికి మళ్లీ అర్జీ పెట్టుకునే అవకాశమిచ్చారు. ఇందులో భాగంగా నూతన రేషన్‌కార్డుల కోసం ఖమ్మం జిల్లాలో 17,088, భద్రాద్రి కొత్తగూడెంలో 38,879 దరఖాస్తులు అందాయి. ప్రస్తుతం వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అర్హులు ఎవరనేది తేల్చనున్నారు.

**నిరీక్షణకు తెరపడేనా..?**

తెలంగాణ ఆవిర్భావం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం లక్షలాది మంది నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియలో వేగం పుంజుకుంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పేదల్లో ఆశలు చిగురించాయి. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను అధికారులకు అందించారు. వీటి ఆధారంగా అర్హుల జాబితాను అధికారులు రూపొందించి గ్రామసభల్లో ప్రవేశపెట్టారు.

గ్రామసభల ఆమోదంతో లబ్ధిదారుల వివరాలు సేకరించి తుది జాబితా తయారుచేశారు. ప్రభుత్వం ఆదేశాలిస్తే రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కొంత ఆలస్యం కావొచ్చునని సమాచారం. ప్రజాపాలన కార్యక్రమం, గ్రామసభల్లో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోనివారు 'మీ సేవ'లో అర్జీ పెట్టుకోవచ్చు. రేషన్‌కార్డు ఉన్నవారు అందులోని చిరునామా, పేర్లు చేర్చటం, తొలగించటం వంటి వాటికీ అవకాశం ఉంటుంది. రుక్మిణీదేవి, డీఎస్ఓ, భద్రాద్రి

# వరద బెడద తప్పేలా..

ఖమ్మం: మున్నేరు రక్షణ గోడల నిర్మాణ పనులు గాడినపడ్డాయి. రక్షణ గోడలకు ఆనుకుని ప్రత్యేకంగా రహదారి, దీనిపక్కనే మురుగుకాల్వ నిర్మించనున్నారు. ఖమ్మం నగరం నుంచి వెలువడే మురుగునీరు మున్నేరులో కలిసేలా రక్షణ గోడల పొడవునా పది మీటర్ల వెడల్పుతో మురుగుకాల్వ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ భూమి ఉన్నచోట ప్రస్తుతం రక్షణ గోడల పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనుల్లో మరింత వేగం పెరగనుంది.

**రక్షణ గోడల నిర్మాణమిలా..**

మున్నేరు వరద ఉద్ధృతికి ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం గ్రామీణం మండలంలోని పదుల సంఖ్యలో కాలనీలు అతలాకుతలమవుతున్నాయి. మున్నేరు వరదల నుంచి ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు రూ. 690కోట్లతో రక్షణ గోడల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. నిధుల లేమితో ప్రాధామ్యాల ప్రకారం పనులు చేపట్టాలని కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. రూ. 690కోట్లతో రక్షణ గోడల నిర్మాణం ఆవశ్యకతపై తర్జనభర్జన పడింది. ఖమ్మం, పాలేరు శాసనసభ నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపారు. వేలాది మందికి కవచంలా నిలిచే రక్షణ గోడలు నిర్మించాల్సిందేనని పట్టుబట్టడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ. 501 కోట్లతో మున్నేరుకు రెండువైపులా రక్షణ గోడల నిర్మాణానికి ముందడుగు పడింది. 2024 మార్చిలో టెండర్లు పూర్తవగా ఏప్రిల్‌లో



పనులు మొదలయ్యాయి. ఖమ్మం గ్రామీణం మండలం పోలెపల్లి నుంచి ప్రకాశ్‌నగర్ వరకు 8.50 కి.మీ., రామన్నపేట నుంచి ప్రకాశ్‌నగర్ వైపు 8.50 కి.మీ. మేర పొడవు, 40 అడుగుల ఎత్తుతో కాంక్రీట్‌తో రక్షణ గోడలు నిర్మించనున్నారు.

**భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనులు చకచకా**

రక్షణ గోడల నిర్మాణానికి 200 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మున్నేరుకు రెండువైపులా 300 మీటర్ల మేర భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 25 గృహాలను తొలగించాలని గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణం కోసం నిర్వాసితులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే.. ఇందుకోసం భూములు, ఇళ్లకు పరిహారం ఖరారు కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే పనుల్లో మరింత వేగం పుంజుకోనుంది. ప్రస్తుతం ప్రభుత్వ భూములు ఉన్నచోట రక్షణ గోడలు నిర్మిస్తున్నారు. సుమారు 700 మంది కార్మికులు పనులు చేస్తున్నారు. గుత్తేదారు సంస్థకు 2026 మార్చి నాటికి రక్షణ గోడల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి రక్షణ గోడల నిర్మాణ పనులు పూర్తవుతాయని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

# తప్పొకరిది.. శిక్ష ఇంకొకరికి..

ఆదిలాబాద్ : ఇది నిర్మల్ గ్రామీణ మండలంలోని చిట్యాల వంతెన వద్ద ప్రవహిస్తున్న స్వర్ణవాగు. దిలావర్‌పూర్ మండలం మాటేగాం నుంచి నిర్మల్ పట్టణానికి పైప్‌లైన్ ఈ వాగులోంచే వేశారు. నీటి ప్రవాహానికి పైప్‌లైన్ పగిలిపోయింది. మరమ్మతులు చేయక నిర్మల్ పట్టణానికి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆదిలాబాద్‌కు వెళ్లే నీటిపైప్‌నకు ట్యాపింగ్ చేసి నిర్మల్ పట్టణానికి మళ్లిస్తున్నారే కానీ మూడేళ్లుగా పైప్‌లైన్ వేయడంపై దృష్టిపెట్టడం లేదు. నిర్మల్‌లో చెడిపోయిందని ఆదిలాబాద్ జిల్లాలో సక్రమంగా ఉన్న నీటి సరఫరాను చెడగొట్టి ప్రజలకు అవస్థలు తెచ్చిపెడుతున్నారు.

శ్రీరామసాగర్‌లోని గోదావరి నది నీళ్లను సరఫరా చేసేందుకు దిలావర్‌పూర్ మండలం మాటేగాంలో నిర్మించిన శుద్ధికేంద్రం నుంచి ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల దాహార్తిని తీరుస్తున్నామంటున్నా అది చెప్పడానికే పరిమితమవుతోంది. శుద్ధికేంద్రం నుంచి నిర్మల్ మున్సిపాల్టీకి నేరుగా 16 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక పైప్‌లైన్ వేశారు. ఆదిలాబాద్‌కు వచ్చే పైప్‌లైన్‌ను ఆనుకొని 600 ఎంఎం మందంగల పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. 2018లో పథకం మొదలుకాగా



ఆరంభం నుంచి పైప్‌లైన్‌లో అవాంతరాలు ఎదురవుతున్నాయి. తరచూ లీకేజీలు ఏర్పడటంతో నిరంతర సరఫరా కావడంలేదు. నిర్మల్ మున్సిపాల్టీకి ప్రతిరోజు 24 ఎంఎల్‌డీల నీళ్లు ఇవ్వాల్సి ఉండటంతో నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తాలో ఉన్న ఆదిలాబాద్‌కు వచ్చేపైప్‌లైన్‌కు అక్రమ కనెక్షన్ బిగించారు. తొలుత కొన్ని గంటలే వాడగా ప్రస్తుతం నిరంతరంగా వాడుతుండటంతో ఆదిలాబాద్‌పై ఇది తీవ్ర ప్రభావం చూపెడుతోంది.

**రూ.4.50 కోట్లతో స్టీల్ వంతెనకు ప్రతిపాదించినా**

స్వర్ణవాగు ప్రవాహం నుంచి ఆటంకాలు లేకుండా నిర్మల్ పైప్‌లైన్ కోసం అక్కడ స్టీల్ వంతెన నిర్మించి పైనుంచి పైప్‌లైన్ వెళ్లేలా రూ. 4.50కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిర్మాణానికి కంపెనీ ముందుకు రావడంలేదు. వాస్తవానికి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ప్రధాన పైప్‌లైన్ నిర్వహణ అంతా మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనియే చూస్తుంది. ఎక్కడైనా చెడిపోతే మరమ్మతులు చేపట్టడమో, కొత్త పైప్‌లైన్ వేయడమో చేసి సమస్యకు పరిష్కారం చూపాలి. తొలుత అయిదు సంవత్సరాల వరకు నిర్వహణ బాధ్యత ఉండగా పలుచోట్ల ఇలాంటి అసంపూర్తి పనులు ఉండటంతో ఆరునెలల చొప్పున రెండు మార్లు పెంచారు. అయినా పైప్‌లైన్‌పై దృష్టిపెట్టకుండా ఆదిలాబాద్ నీళ్లు నిర్మల్‌కు మళ్లిస్తూనే ఉండటంతో ఇక్కడ అవస్థలు తప్పడం లేదు.

**నెలన్నరలో పరిష్కరిస్తాం - జ్ఞానకుమార్, మిషన్‌భగీరథ సీఈ**

పైప్‌లైన్ సమస్యపై నిర్మల్ ఎమ్మెల్యే సైతం పలుమార్లు మాట్లాడారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. నెలన్నర రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

# సహకరించుకుందాం.. పంచుకుతిందాం!

హైదరాబాద్: ఒకరు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత.. మరొకరు ఠాణా పనితీరు పర్యవేక్షించే నిఘా విభాగం.. విధుల్లో ఎవరికివారే అన్నట్టుగా ఉంటే ఒరిగేదేముంది.. పరస్పర అవగాహనతో కలసినడుద్దాం, వచ్చింది పంచుకుందామనే ఒప్పందానికి వచ్చినట్టున్నారు. వచ్చే కేసులతీవ్రతను బట్టి రేటు నిర్ణయించి అక్రమ వసూళ్లలో రికార్డులు సృష్టిస్తున్నారు. నగరంలో కొత్తగా ఏర్పడిన ఠాణా ఎస్‌హెచ్‌వో, ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ అక్రమాల పర్వం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**ఎంతచెప్పినా మారట్లేదు..**

గతేడాది ఇదే ప్రాంతంలో బోరు వేస్తున్నట్లు గుర్తించిన సదరు ఇన్‌స్పెక్టర్ అనుమతుల్లేకుండా ఎలా వచ్చారంటూ బోరు వాహనాన్ని జప్తుచేసి ఠాణాకు తరలించారు. ఓ రాజకీయ నాయకుడి సహాయకుడు రంగంలోకి దిగి అధికారికి రూ.40వేలు అప్పగించి కేసును రాజీ కుదిర్చారు. ఓ కేసులో నిందితుడు తప్పించుకోవటంతో అతడి భార్యను ఠాణాకు తీసుకొచ్చారు. మధ్యవర్తి ద్వారా రూ.లక్షతో సరిపెట్టుకొని నోటీసులిచ్చి పంపారనే ఆరోపణలున్నాయి.

**ఇంతకీ వీరేం చేస్తున్నారంటే..**

నగర పోలీసుకమిషనరేట్‌లో కీలక ప్రాంతంలోని కొత్త ఠాణా అది..




ఏడాదిలోనే ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు మారారు. ప్రధాన రౌడీషీటర్లు ఇక్కడే తలదాచుకుంటారు. పోక్సో కేసులు పెద్దఎత్తున నమోదవుతుంటాయి. ఫిర్యాదు అందగానే సదరు ఇన్‌స్పెక్టర్ బాధితులను పిలిచి రాజీపడమంటూ సలహా ఇస్తాడు. గతేడాది ఓ కేసులో బాధితులకు రూ.5లక్షలు ఇప్పించి, సగం తన వాటాగా తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఎంఎన్‌సీ సంస్థ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. తనపై టీం లీడర్ అత్యాచారానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. టీం లీడర్, మాత్రలు విక్రయించిన మెడికల్ షాపు యజమానిపై కేసు నమోదుచేశారు. ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ రంగంలోకి దిగి షాపు యజమానితో బేరం కుదుర్చుకున్నారు. అందిన రూ.5లక్షల్లో ఇన్‌స్పెక్టర్, హెడ్‌కానిస్టేబుల్ చెరోరూ.లక్ష పంచుకున్నట్లు తెలుస్తోంది. రిమాండ్ నివేదికలో షాపు యజమాని పరారీలో ఉన్నట్లుచూపి, ముందస్తు బెయిల్ తీసుకోవాలంటూ సలహా ఇచ్చి పంపారు. ఈ వ్యవహారం సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయినట్లు సమాచారం.

**నా ఇలాకా..** ప్రస్తుతమున్న నిఘా విభాగ హెడ్ కానిస్టేబుల్‌పై ఆది నుంచి ఆరోపణలున్నాయి. ఒకే జోన్‌లో 8 ఏళ్లుగా పనిచేయటం, కొందరు పెద్దల అండదండలతో ఠాణాలను శాసించే స్థాయికి చేరినట్టు చర్చ సాగుతోంది. రోజూ తనిఖీల పేరుతో నెంబర్‌ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని వాహనాలను ఠాణాకు తరలిస్తారు. ఇన్‌స్పెక్టర్‌తో సన్నిహితంగా మెలిగే చోటానేతను రంగంలోకి దింపి వాహనాలను విడిపించేందుకు యజమానులకు హెడ్‌కానిస్టేబుల్ సహకరిస్తాడు. ప్రతిఫలంగా వచ్చే కాసుల్లో తన వాటా జేబులో వేసుకుంటాడు. ఠాణా వేదికగా సాగుతోన్న అక్రమాల పర్వంపై వస్తున్న ఆరోపణలతో పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టారు. కీలకమైన విభాగానికి మచ్చతెచ్చేలా వ్యవహరిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసేందుకు రంగం సిద్ధమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది.

# ఎండలు సుర్రు.. మీటర్లు గిర్రు

హైదరాబాద్ : వాతావరణం మారడంతో విద్యుత్తు వినియోగంలోనూ గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్తు డిమాండ్ పైపైకి వెళుతోంది. ఈనెలలో 7న 3,371 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. నగరంలో విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య ఏటా 2 లక్షలకుపైగా పెరుగుతోంది. వినియోగదారుల సంఖ్య 63 లక్షలకు చేరింది. ఎలాంటి కోతలు పెట్టకుండా 24 గంటలు కరెంటు సరఫరా చేస్తున్నా ట్రిప్పింగ్‌లు మాత్రం వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నాయి. వేసవి మొదలుకాగానే ప్రతి ప్రాంతంలో రోజూ ఒకటి రెండుసార్లు కరెంట్ పోతోందని వాపోతున్నారు.



**ఏ సమయంలో ఎలా?**

శీతాకాలంలో ఉదయం 7 నుంచి 8 గంటల ప్రాంతంలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ నమోదైంది. గీజర్లు వినియోగించడమే ప్రధాన కారణం. ప్రస్తుతం సాయంత్రం 6.40 నుంచి 7.40 గంటల మధ్య గరిష్ఠ డిమాండ్ నమోదైంది. ఇళ్లు, వాణిజ్య కేంద్రాల్లో దీపాలు వెలిగించడం, ఫ్యాన్లు, ఏసీల వాడకంతో డిమాండ్ అధికంగా ఉంటోంది. ప్రస్తుతం పగటిపూట 34 డిగ్రీల సాధారణ ఉష్ణోగ్రతలు ఉండగా రాత్రి 21 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఇది సాధారణంకంటే 2 డిగ్రీలు అధికం. ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఏసీల వాడకంతో కరెంటు వినియోగం పెరుగుతోంది.

**ఎప్పటికప్పుడు లోడ్‌పై పర్యవేక్షణ** ఈ వేసవిలో గ్రేటర్ హైదరాబాద్ గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 5వేల మెగావాట్లకుపైగా నమోదయ్యే అవకాశముంది. ఎంతగా డిమాండ్ పెరిగినా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రతిరోజూ విద్యుత్తు ఉప కేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్)/ఫీడర్ల లోడ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. అవసరమైన చోట వెంటనే సామర్థ్యం పెంచడం, ఇంటర్‌లింకింగ్ పనులు చేపడుతున్నాం. ముషారఫ్ ఫరూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

# ఎండ.. చలి.. వ్యాధుల దాడి



హైదరాబాద్: కొన్నిరోజులుగా మారిన వాతావరణంతో వైరల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఎక్కువ మంది గొంతు నొప్పి, ముక్కు కారడం, జ్వరం, ముక్కు దిబ్బడ, చెవి ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతూ.. వైద్యులను సంప్రదిస్తున్నారు. పగలు వేడి.. రాత్రి చలితో వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరిని చాలా రోజులపాటు దగ్గు వేధిస్తోంది. ఉస్మానియా, గాంధీ, ఈఎన్‌టీ, నిలోఫర్ తదితర ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. మారిన వాతావరణంతో 0–5 ఏళ్ల పిల్లలు దగ్గు, జలుబు, జ్వరంతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

**అనవసరంగా యాంటీబయోటిక్స్ వద్దు...**

చిన్నగా దగ్గు, జలుబు, జ్వరం రాగానే చాలామంది వైద్యుల సూచనలు లేకుండానే యాంటిబయోటిక్స్‌ను కొనుక్కొని వాడేస్తుంటారు. పిల్లలకు సైతం వీటిని తెచ్చి పట్టిస్తారు. ఈ కాలంలో ఎక్కువగా వైరల్ వ్యాధులు ఉంటాయని, వీటికి యాంటీ బయోటిక్స్ వల్ల ఉపయోగం లేదని వైద్యులు చెబుతున్నారు. వైద్యులు సూచించేవరకు వాటిని వినియోగించొద్దని కిమ్స్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శివరాజ్ తెలిపారు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. కొందరి పిల్లల్లో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా వల్ల హైఫీవర్, గొంతు ఎర్రగా మారడం తదితర లక్షణాలు వేధిస్తున్నాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని నిలోఫర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.ఉషారాణి పేర్కొన్నారు.

**ఇవీ లక్షణాలు...**

జ్వరం, దగ్గు, ముక్కుకారడం.
గొంతు లోపల
ఎర్రగా మారడం.
ఒంటిపై ఎర్రని దద్దుర్లు.
ముక్కు దిబ్బడ, చెవి, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు.
కొందరిలో న్యుమోనియా లక్షణాలు.

ఈ జాగ్రత్తలు అవసరం...
గుంపులోకి వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం.
కాచి, చల్లార్చి వడపోసిన నీటిని తీసుకోవడం.
సాధ్యమైనంత వరకు బయట నీళ్లు, ఆహారానికి దూరంగా ఉండటం.
వేడి వల్ల శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవడం.
ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు భాగం చేసుకోవాలి.
రోజులో తప్పనిసరిగా 7–8 గ్లాసుల నీళ్లు తాగాలి.
కనీసం 6–7 గంటలపాటు మెలకువ లేని నిద్ర అవసరం.
ఎండ పెరిగేలోపే ఉదయపు నడక, వ్యాయామాలు ముగించడం.
ఎండలో బయటకు వచ్చేటప్పుడు టోపీ, గాగుల్స్ లాంటివి ధరించాలి.
అధిక నూనెలు, ముప్పు, వేపుళ్లతో కూడిన ఆహారం తగ్గించాలి.
4–5 రోజులుగా జ్వరం తగ్గకపోయినా, నీరసం, నిస్సత్తువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# పొదుపుతోనే 'గృహజ్యోతి' వెలుగులు



భగత్‌నగర్: వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులతో వేసవికి ముందే ప్రజలు వేడికి తాళలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి ఏసీలు, కూలర్లు వాడుతుండటంతో ఫిబ్రవరి మొదటి వారంలోనే విద్యుత్తు వినియోగం పెరిగిపోతోంది. విచ్చలవిడిగా వాడితే గృహజ్యోతి పథకం వర్తించకుండా పోయే ప్రమాదముంది. 200 యూనిట్లపై ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా బిల్లు కట్టాల్సిందే. ఒకవైపు వేసవి తాపం మరో వైపు విద్యుత్తు బిల్లుల భారం.. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాల్సిన పరిస్థితి. దీని నుంచి గట్టెక్కాలంటే విద్యుత్తును పొదుపు చేసుకోవడమే మార్గం. అలా అని ఉపకరణాలను పూర్తిగా కట్టేయాల్సిన పని లేకుండా విద్యుత్తు పొదుపుగా వాడుకుంటే మేలు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంట్లో నిరంతరాయంగా గృహజ్యోతిని వెలిగించొచ్చు. అవి ఏమిటో చూద్దాం.


**మీ ఇంట్లో ఇలా చేయండి..**

ప్రస్తుతం దాదాపు అన్ని ఇళ్లలో ఎల్‌ఈడీ బల్బులు వినియోగిస్తున్నారు. ఇప్పటికీ కొందరు పాతకాలం ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్లే వాడుతున్నారు. వీటి సామర్థ్యం 40 వాట్స్ ఉండటంతో విద్యుత్తు వినియోగం మరింత పెరిగే అవకాశముంది. దీని దృష్ట్యా ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు మేలు.

ఏసీలు 24 నుంచి 29 డిగ్రీల మధ్య ఉపయోగిస్తేనే చల్లదనంతో పాటు బిల్లు ఆదా అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇన్‌వర్టర్‌తో కూడిన ఏసీలు లభిస్తున్నాయి. గది చల్లబడగానే ఆటోమెటిక్‌గా ఏసీ నిలిచిపోతుంది. వీటితో కొంత విద్యుత్తు వినియోగం తగ్గే అవకాశముంది. సాధారణ ఏసీలు కరెంటు పోయి వచ్చినప్పుడు పునఃప్రారంభమయ్యే సమయంలో లోడ్ పెరిగిపోతుంది. ఇది విద్యుత్తు సరఫరా వ్యవస్థపై భారం పడుతుంది. ఇన్‌వర్టర్స్‌తో కూడిన ఏసీలతో ఈ ఇబ్బంది తొలగి కొంత విద్యుత్తు పొదుపు అయ్యే అవకాశముంది. వేసవికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించాలి. ఫిల్టర్లు శుభ్రం చేయించడంతోపాటు..గాలి ఫ్లోటింగ్ పరిశీలించాలి.

సీజన్ మేరకు ఫ్రిజ్‌లో ఫ్రీజర్ దశలు మారుస్తూ ఉండాలి. వేసవిలో ఎక్కువ ఉంచినా మిగిలిన కాలాల్లో తగ్గించుకోవాలి. మంచు పొరలు పావు వంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డీఫ్రాస్ట్ అనే ఆప్షన్‌తో తొలగించాలి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులు, రిఫ్రిజిరేటర్లు తదితర విద్యుత్తు గృహోపకరణాలు బీఈఈ రేటింగ్ 1 నుంచి 5 స్టార్లతో విక్రయిస్తున్నారు. వీటిలో 5 స్టార్ ఉంటే విద్యుత్తు వినియోగం తగ్గి బిల్లు ఆదా అవుతుంది. కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు అవసరంలేని సమయంలో స్విచ్ఛాఫ్ చేయాలి. ఫోన్ ఛార్జింగ్ పూర్తయ్యాక ఛార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి. ఉమ్మడి జిల్లాలో జనవరి నెల గృహజ్యోతి లబ్ధిదారులుకరీంనగర్ 1,67,591 పెద్దపల్లి 1,30,435 జగిత్యాల 2,03,895 రాజన్నసిరిసిల్ల 1,02,938

# వరికి తెగుళ్ల బెడద



ఎల్లారెడ్డిపేట: వాతావరణంలో ఆకస్మిక మార్పుల వల్ల పంటలకు నష్టం వాటిల్లుతోంది. వరిపైరు సల్ఫైడ్ ఇంజూరీ బారిన పడుతోంది. మరోవైపు జింకు ధాతులోపం, కాండం తొలుచు పురుగు, అగ్గితెగులుతో వంటి తెగుళ్ల బెడద తీవ్రమవుతుండటంతో జిల్లాలో వరిసాగుచేసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సల్ఫైడ్ ఇంజూరీ వల్ల పైరు ఎరుపురంగులోకి మారడం, ఎదుగుదల లోపించడం వంటి లక్షణాలను గుర్తించి పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, చందుర్తి, తంగళ్లపల్లి తదితర మండలాల్లో వరిపైరుకు సల్ఫైడ్ ఇంజూరీతోపాటు ఇతర తెగుళ్ల ప్రభావం అధికంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఇష్టారీతిగా పురుగు మందులను పిచికారీ చేయకుండా సరైన యాజమాన్య పద్ధతులతో తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**పెరుగుతున్న సాగు విస్తీర్ణం**

మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత రెండుమూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడం, సాగునీటి వనరుల్లో పుష్కలంగా నీరు ఉంటడంతో వరిసాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. కోతులు, వన్యప్రాణుల బెడద తదితర కారణాల వల్ల ఆరుతడి పంటలను అంతంతమాత్రంగానే సాగుచేశారు. ఈ యాసంగిలో ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,77,004.5 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇందులో సుమారు 1,74,070 ఎకరాల్లో వరిసాగు చేశారు.

**తప్పని ముప్పు**

రాత్రి ఉష్ణోగ్రత తగ్గడం వల్ల ఇన్ని రోజులు నేలలో ఉన్న కొయ్యలు కుళ్లిపోకుండా ఉన్నాయి. క్రమంగా ఎండలు పెరుగుతుండటంతో కుళ్లిపోవడడం ప్రారంభమైంది. కమతాల్లో నీరు ఉండటం వల్ల కొయ్యల నుంచి వెలువడే సల్ఫర్‌డయాక్సైడ్ గాలిలో కలిసిపోకుండా వరి వేర్ల చుట్టూ చేరుతోంది. దీంతో ఆకులు పసుపువర్ణంలోకి మారి పైరు ఎండిపోతోంది. ఎండిన పైరు కుదుర్లు నలుపురంగులోకి మారి, కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తోంది. దీనితో పాటు మిగతా తెగుళ్ల ప్రభావంతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **యాజమాన్య పద్ధతులతో మేలు**

ప్రస్తుతం వరిపంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. సల్ఫైడ్ ఇంజూరీ నివారణ కోసం కమతాల్లో చీమపగుళ్లు వచ్చేంత వరకు వారం నుంచి పది రోజుల వరకు పొలాన్ని ఆరబెట్టాలి. ఆరబెడుతూ నీటిని అందించడం వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ గాలిలో చేరిపోతుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు లక్షణాలు కనిపిస్తే 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కవిత, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# అవిశ్వాసం.. అంతర్గత మథనం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్‌ఎంసీ)కు ఎన్నికలు జరిగి నాటికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. దీంతో జీహెచ్‌ఎంసీ మేయర్‌పై అవిశ్వాసం అంశం గురించి చర్చ జరుగుతోంది. మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి కావాలనేది చట్ట నిబంధన. వాస్తవానికి కొంత కాలంగా అవిశ్వాసంపై రాజకీయ పార్టీల్లో అంతర్గత చర్చ నడుస్తోంది. మరోవైపు రాజకీయ సమీకరణాలు తారుమారు కావడం, మిత్రులు దూరంగా ఉండటంతో అసలు అవిశ్వాసం అనేదానికి తావు ఉందా..? అనేదానిపై అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

**అవిశ్వాసం ఎందుకు..?**

బల్దియాలో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన భారాస కార్పొరేటర్ల నుంచి వస్తోంది. 2021 ఎన్నికల్లో ఎంఐఎంతో కలిపి మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు



దీరింది. దీంతో మేయర్ విజయలక్ష్మి పార్టీ మారారు. ఈ విషయమై భారాస వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. నాలుగేళ్ల వరకు అవిశ్వాసం ప్రతిపాదించే అవకాశం లేకపోవడంతో మౌనంగా ఉన్నారు. ఇటీవల మాజీ మంత్రి తలసాని నివాసంలో జరిగిన సమావేశంలో అవిశ్వాసంపై చర్చ జరిగింది. అవకాశాలను పరిశీలించాలని మాజీ మంత్రి కేటీఆర్ సైతం సూచించారు. కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టి తీరాలని ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు.

**సాధ్యాసాధ్యాలు..!**

బల్దియాలో మారిన సమీకరణాల నేపథ్యంలో ఏ పార్టీకి అనుకూల అవకాశాలు లేవని చెబుతున్నారు. గతంలో భారాస, ఎంఐఎం జత కట్టాయి. ప్రస్తుతం ఎంఐఎం దూరమైంది. భారాస ప్రతిపాదనకు ఎంఐఎం అంగీకరించదని పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. అవిశ్వాసం ప్రతిపాదన తమంతటా తామే ఎందుకు తీసుకురావాలని భాజపా భావిస్తోంది. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో భారాస ఒంటరిగా మిగిలింది. అవిశ్వాసం నోటీసు ఇవ్వడానికి సగం మంది కార్పొరేటర్ల మద్దతు భారాసకు లేదు. ఒకవేళ నోటీసు ఇచ్చినా భాజపా తటస్థంగా ఉండాలని భావిస్తోంది.

# సర్వే సాగదే!

హుజూరాబాద్: ఉమ్మడి జిల్లాలో 62 మండలాలు ఉండగా 42 మంది మాత్రమే సర్వేయర్లు ఉన్నారు.. మిగతా 20 మండలాలకు సర్వేయర్లు లేకపోవడంతో పక్క మండలాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు.. భూమి కొలతలకు కీలకమైన చైన్‌మెన్, రోవర్ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.. దీంతో 12 వేలకుపైగా హద్దుల గుర్తింపు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం భూసర్వే శాఖ పునర్ వ్యవస్థీకరణకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో పోస్టుల పెంపు, సిబ్బంది నియామకాలు త్వరితగతిన పూర్తి చేస్తే భూ సర్వే సమస్యలు తీరనున్నాయి..

భూ కొలతలు, హద్దులు నిర్ణయించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. కానీ క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా వీరి నియామకం లేకపోవడంతో సర్వేల కోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఆస్తుల పంపకాల సమయంలో హద్దుల నిర్ణయానికి, పక్క పక్క భూముల యజమానుల మధ్య హద్దుల గొడవ జరిగినపుడు, భూక్రయ విక్రయాల సమయంలో సర్వేకు దరఖాస్తు చేసుకుంటారు. నిబంధనల ప్రకారం సర్వే కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తహసీల్దార్లు 45 రోజుల్లోగా సర్వేయర్లతో భూ కొలతలు తీసుకుని దరఖాస్తుదారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కానీ సర్వేయర్ల కొరత కారణంగా భూ కొలతలు ఎప్పుడు



చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది.

**పోస్టులు భర్తీ అయితే..**

భూసర్వే శాఖ పునర్ వ్యవస్థీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పోస్టుల పెంపు, సిబ్బంది నియామకాలపై కసరత్తు చేస్తుండటంతో త్వరలోనే ఆ విభాగం సమస్య తీరనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. కొత్త జిల్లాలు ఏర్పడినా కొత్త పోస్టులు మంజూరు కాకపోవడంతో జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఏడీలుగా ఇన్‌స్పెక్టర్లకే అదనపు బాధ్యతలు అప్పగించారు. 'భూ భారతి' అమలులో భాగంగా ప్రతి భూమి రిజిస్ట్రేషన్– మ్యుటేషన్‌కు భూమి పటం తప్పనిసరి కావటంతో సర్వేయర్ల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరముంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల భర్తీకి పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి ఆసక్తి ఉన్న వారిని నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 20 సర్వేయర్, 15 డిప్యూటీ సర్వేయర్ పోస్టులతోపాటు చైన్‌మెన్, రోవర్ సహాయకుల పోస్టులు 84 వరకు భర్తీ చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే భూకొలతలు సకాలంలో జరిగి వివాదాలు సద్దుమణిగే అవకాశాలున్నాయి. దీనిపై భూమి కొలతలు, రికార్డుల నిర్వహణ శాఖ కరీంనగర్ ఏడీ ప్రభాకర్‌ను సంప్రదించగా భూసర్వే శాఖ పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం దృష్టి సారించినప్పటికి జిల్లాల వారీగా ఏఏ పోస్టులు ఎన్ని భర్తీ చేస్తారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు.

చురకలు

శనివారం 15 ఫిబ్రవరి 2025

# కాలువకు గండి.. ఊరిలోకి వరద

మానకొండూర్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి వద్ద ఆదివారం ఉదయం ఎస్సారెస్పీ డి-4 కాలువకు గండి పడింది. ఆ నీరంతా కాలువ పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటపల్లి రిజర్వాయర్ లింక్ కెనాల్ నుంచి సైదాపూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాలకు సాగు నీరు సరఫరా అవుతోంది. ఇందులో భాగంగా చిగురుమామిడి మండలం పీచుపల్లి వద్ద ఉన్న రెగ్యులేటర్ నుంచి సైదాపూర్, మానకొండూర్ మండలం చెంజర్లకు సాగునీరు అందిస్తున్నారు. 150 క్యూసెక్కుల ప్రవాహంతో నీరు వెళ్లడంతో సైదాపూర్ వైపు నీటి అవసరాలు తీరడంతో గుర్తు తెలియని వ్యక్తులు గేట్‌వాల్వ్ మూసేశారు. దీంతో చెంజర్ల వైపునకు వరద 300 క్యూసెక్కులకు పెరిగిపోవడంతో మన్నెంపల్లి వద్ద కాలువకు గండి పడింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు మన్నెంపల్లి గ్రామంలోకి రావడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. పండగపూట చూస్తుండగానే ఇళ్లలోకి నీరు చేరి విలువైన



సామగ్రి తడిసిపోయిందని స్థానికులు వాపోయారు. ఇప్పుడు గండి పడిన చోటే గతంలో మూడు పర్యాయాలు గండిపడిందని.. పకడ్బందీ మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే పరిశీలన**గండిపడ్డ ప్రదేశాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షు డు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఇళ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లామని చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

**మరమ్మతులు చేపట్టిన అధికారులు**

గండిపడ్డ ప్రదేశంలో అధికారులు ఇసుక సంచులతో మరమ్మతు చేపట్టారు. రాత్రి వరకు పనులు పూర్తి చేస్తామని డీఈ సదయ్య తెలిపారు. ఈఎన్సీ శంకర్ పనులు పర్యవేక్షించారు.

సహాయక చర్యలు చేపట్టండి

**కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

కాలువ గండితో మన్నెంపల్లిలోకి నీరు చేరిన ఘటనపై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గండిని పూడ్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# దుకాణాలే లక్ష్యంగా చోరీలు

జగిత్యాల : ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో దొంగల ముఠా పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. కేవలం దుకాణాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠా ప్రతిరోజు రాత్రి వరుసగా రెండు, మూడు పట్టణాల్లో చోరీలకు పాల్పడుతోంది. అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా భావిస్తున్నప్పటికీ పలు చోరీలకు పాల్పడ్డ వారు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిలో ఒకరిద్దరిని నిజామాబాద్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ మరో ముఠా చోరీలకు పాల్పడుతోంది. 10 రోజులుగా నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, కమ్మర్‌పల్లి, జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి, కోరుట్ల, ధరూర్, వరంగల్, మహబూబాబాద్. సిద్దిపేట జిల్లాలో రహదారులపై ఉన్న పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డవారు ఒకే ముఠాగా తెలుస్తోంది. నలుగురు సభ్యులుగల ముఠా కారులో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.



ఈనెల 4న మెట్‌పల్లిలో 2, అమ్మక్కపేటలో 1, కోరుట్లలో 3 దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. మెట్‌పల్లి సీఐ ఎ.నిరంజన్‌రెడ్డి పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా నిర్మల్ జిల్లా టోల్‌గేట్ మీదుగా నిజామాబాద్ జిల్లా మీదుగా జగిత్యాలకు కారులో ముఠా వచ్చినట్లు తేలింది. అయితే రెండ్రోజుల కిందట ముఠా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఓ దుకాణంలో చోరీకి పాల్పడుతుండగా సమీపంలో ఉన్న బ్లూకోర్ట్ పోలీసులు చేరుకోగా వారిని చూసి పారిపోతుండగా ఒకరు దొరికినట్లు తెలిసింది. దీంతో చోరీకి పాల్పడ్డవారు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా తేలింది. శుక్రవారం రాత్రి ధర్మపురి మండలం నేరెళ్లలో తాళం వేసి ఉన్న 4 ఇళ్లల్లో చోరీ జరగగా శనివారం రాత్రి జగిత్యాల జిల్లా కేంద్రంలో 4 దుకాణాలు, కొడిమ్యాల మండలం పూడూరులో 1 దుకాణం, కరీంనగర్ జిల్లా గంగాధర ఎక్స్‌రోడ్డు ఒక దుకాణంలో చోరీ జరిగింది.

ఒకేరోజు రాత్రి ఒకే తరహాలో 3 ప్రాంతాల్లో చోరీలు జరగడంతో ఈ ముఠా సైతం వాహనంలోనే తిరుగుతున్నట్లు భావిస్తున్నారు. వారంకిందట చోరీలకు పాల్పడ్డవారు అంతర్రాష్ట్ర ముఠాగా భావించినప్పటికీ ఆర్మూర్‌లో ఒకరు పట్టుబడడంతో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారిగా తేలింది. శుక్ర, శనివారాల్లో రాత్రి చోరీలు జరిగిన తీరును బట్టి చేసింది అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. అన్ని రహదారుల్లో దుకాణాలు, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వాహనాల నంబర్లను సేకరిస్తున్నారు. జిల్లాలో రెండ్రోజుల వ్యవధిలో మూడు ప్రాంతాల్లో చోరీలు జరిగిన నేపథ్యంలో ముఠాను పట్టుకునేందుకు పోలీసు అధికారులు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# ఆమోదం లేకుండానే టెండర్లా!




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హెచ్-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులను జీహెచ్‌ఎంసీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఇంజినీర్లు ఇప్పటి వరకు డీపీఆర్‌లను ఆమోదించలేదు. దాదాపు రూ.6వేల కోట్లతో రూపుదిద్దుకున్న పనులపై అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తుండటంతో.. ప్రాజెక్టులు పూర్తవుతాయా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిలిచిన డీపీఆర్‌లు..**

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లను రెండు దశల్లో రూ.1090కోట్లతో అభివృద్ధి చేసేందుకు అక్టోబరు, 2024లో జీహెచ్‌ఎంసీ టెండరు నోటీసు ఇచ్చింది. మూడు నెలలవుతున్నా టెండరు నోటిఫికేషన్ మాత్రం విడుదల కాలేదు. డీపీఆర్ లేకుండా టెండరు నోటీసు విడుదలపై అధికారుల నుంచి సమాధానం లేదు.

రూ.459కోట్లతో గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ కూడలిని అభివృద్ధి చేయాలన్నది ప్రణాళిక. డీఎల్‌ఎఫ్ రోడ్డు నుంచి ఐఎస్‌బీ రోడ్డు, ఐఎస్‌బీ రోడ్డు నుంచి గచ్చిబౌలి కూడలి వైపు, డీఎల్‌ఎఫ్ రోడ్డు నుంచి గచ్చిబౌలి స్టేడియం దిశలో పైవంతెనలు, గచ్చిబౌలి కూడలి-గచ్చిబౌలి స్టేడియం మధ్య కూడలిలో ఆరు లైన్ల అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సైతం అటకెక్కింది. రూ.158కోట్లతో విప్రో చౌరస్తాపై ఐఎస్‌బీ రోడ్డు-ఓఆర్ఆర్ మధ్య రాకపోకల కోసం నాలుగు లైన్ల పైవంతెన, ఐసీఐసీఐ చౌరస్తాలో విప్రో జంక్షన్-ఓఆర్ఆర్ మధ్య నాలుగు లైన్ల అండర్‌పాస్ నిర్మించాలన్న ప్రణాళిక నిలిచిపోయింది.

రూ.220కోట్లతో ఖాజాగూడ చౌరస్తాలో టోలిచౌకి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాల కోసం అండర్‌పాస్, నానక్‌రామ్‌గూడ నుంచి టోలిచౌకి వైపు వెళ్లే వారికి పైవంతెన నిర్మాణ పనుల ప్రాజెక్టులోనూ జాప్యం చోటు చేసుకుంది.

హెచ్-సిటీపైనే ఆశలు.. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎస్సార్డీపీ కింద చేపట్టాల్సిన కొత్త పనులు నిలిచిపోయాయి. హెచ్-సిటీ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా డిసెంబరు 3న 23 ప్రాంతాల్లో రూ.5,942కోట్ల విలువైన పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కేబీఆర్ పార్కు కూడళ్ల అభివృద్ధి పనులు కూడా హెచ్-సిటీలో భాగమే.

# పరిష్కారం దిశగా ధరణి దరఖాస్తులు




కరీంనగర్ : మండల రెవెన్యూ, జిల్లా కార్యాలయాలు, ప్రజావాణి చుట్టూ తిరుగుతున్న అన్నదాతల భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రైతులకు సులభతరమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన ఆర్‌ఓఆర్ చట్టానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లు చట్టంగా మారగానే ధరణి పోర్టల్ స్థానంలో 'భూభారతి'ని ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్‌లోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యల తీరుపై కథనం.

**సమస్యలతో సతమతం**

భూముల రిజిస్ట్రేషన్‌కు స్లాట్‌బుక్ చేసుకొని రుసుం చెల్లించే సమయంతోపాటు దరఖాస్తులకు సంబంధించిన దస్త్రాల కంప్యూటరీకరణ సమయంలో ధరణిలో ఆప్షన్ లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త చట్టం రూపకల్పన నేపథ్యంలో రైతులు పెండింగ్ సమస్యల పరిష్కారంపై నమ్మకంతో భూభారతి పోర్టల్ వచ్చాకే పరిష్కరించుకుందామని అర్జీలు సైతం సమర్పించటం లేదు. గతంలో రోజుకు 150 నుంచి 250 దరఖాస్తులు రాగా ప్రస్తుతం రోజుకు పదుల సంఖ్యలో మాత్రమే వస్తున్నాయి.

**పెండింగ్ అర్జీలపై సమీక్ష**

ధరణి పోర్టల్‌లో స్థానిక మండల తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు లాగిన్ పాస్‌వర్డు కల్పించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తులను పూర్తి మొత్తంలో పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి రెవెన్యూ యంత్రాంగానికి గడువు విధించటంతో పెండింగ్ దరఖాస్తుల బూజు దులుపుతున్నారు. వారం, పది రోజుల్లోపు సమస్యలన్నీ పరిష్కరించాలనే లక్ష్యంతో యంత్రాంగం పని చేస్తోంది. పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరిస్తున్నారు. డిజిటల్ పట్టాదారు పాసు పుస్తకాల్లోని తప్పులను సవరిస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కరిస్తున్నారు.

**807 దరఖాస్తులే మిగిలి ఉన్నాయి**


వారం రోజుల్లో అర్జీలన్నీటిని క్లియర్ చేస్తాం. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పేర్కొన్నారు. వేలల్లో ఉన్న పెండింగ్ అర్జీలు ప్రస్తుతం 807 కు తీసుకొచ్చామన్నారు.

మహేశ్వర్, ఆర్డీవో, కరీంనగర్

# జలం.. సంరక్షిస్తే అమృతం

పెద్దపల్లి : సకల జీవరాశులకు ప్రాణాధారామైన నీరు రానురానూ విషతుల్యమవుతోందని కేంద్ర భూగర్భ జల మండలి ఇటీవల తన నివేదికలో వెల్లడించింది. భూగర్భ జలాల నాణ్యత వార్షిక నివేదిక-2024లో ఉమ్మడి జిల్లా నీటిలో సూక్ష్మజీవులు, రసాయన అవశేషాలు అధిక మోతాదులో ఉన్నాయని స్పష్టం చేసింది. నైట్రేట్, ఫ్లోరైడ్, క్లోరైడ్ మోతాదులు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది.

ఉమ్మడి జిల్లాలో గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ, బోర్లు, బావుల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. భూగర్భ జల శాఖ అధికారులు గ్రామాల వారీగా బోర్లు, బావుల నుంచి సేకరించిన నీటి నమూనాల్లో నైట్రేట్, ఫ్లోరైడ్, క్లోరైడ్ అవశేషాలు అధికంగా ఉన్నాయి. పంటల్లో అధిక దిగుబడుల కోసం రైతులు విచ్చలవిడిగా యూరియా, ఇతర రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో నైట్రేట్ అవశేషాలు పెరుగుతున్నట్లు నివేదికలో తేలింది.



**నైట్రేట్**

ఆ రెండు లవణాలు అధికం : లీటరు నీటిలో 45 మిల్లీగ్రాములు మించితే సాగు, తాగు అవసరాలకు పనికి రాదు. ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల జలాల్లో నైట్రేట్ అధికంగా ఉంది. జగిత్యాల జిల్లాలో బుగ్గారంలో 139 మి.గ్రా., రాజారం 165, వెనుగుమట్ల 150, తిమ్మాపూర్ 142, గుల్లపేట 109, కంట్లకుంట 94, ల్యాగలమర్రి 70, రాయికల్ 130, అర్పపల్లి 103, కప్పరావుపేట 100.. కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి 124, దుర్శేడు 104, కందులపల్లి 91, జమ్మికుంట 79, కోరపల్లి 69, శ్యామ్‌పేట 61, వెలిచాల 103.. పెద్దపల్లి జిల్లాలో అందుగులపల్లి 93, పెద్దపల్లి 133, తక్కళ్లపల్లి 140, బేగంపేట 184, నాగారం 106, వెక్లాస్‌పూర్ 168, బిట్టుపల్లి 152, మచ్చుపేట 119, వెంకటాపూర్ 161, ఓదెల 114.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధర్మపురం 55, కోరెం 58, రేపాక 79, జోగాపూర్ 79, తిమ్మాపూర్ 54, వల్లెంపట్లలో 167 మి.గ్రా.ల నైట్రేట్ ఉంది.

**ఫ్లోరైడ్**

లీటరు నీటిలో 1.50 మిల్లీగ్రాములలోపు ఉండాలి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా జగిత్యాల జిల్లాలో మల్లన్నపేట 2.05, అయోధ్య 2.31, చెప్యాల 2.42, ఇటిక్యాల 2,21, రాంపూర్ 1.82, సర్వాపూర్ 3.58, కరీంనగర్ జిల్లాలో 2.54, జగ్గయ్యపల్లి 2.11, బేతిగల్ 2.57, పోతిరెడ్డిపేట 2.10, తోకలపల్లి 2.52, టేకుర్తి 2.5, నాగంపేట 2.59, గోపాల్‌రావుపేట 2.54, సైదాపూర్ 2.93, ర్యాలపల్లి 2.10, పెద్దపల్లి జిల్లాలో కాట్నపల్లి 1.85, రాఘవాపూర్ 5.63, ఓదెల 2.06, అడవిసోమన్‌పల్లి 1.67, కాచాపూర్ 3.45, వెంకటాపూర్ 1.69, ఖమ్మంపల్లి 5.59, కల్వచెర్ల 2.36, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజన్నపేట 2.51, ధర్మారం 1.94, కందికట్కూర్ 3.80, గాలిపల్లి 4.15, అల్మాస్‌పూర్ 2.01, బూరుగుపల్లిలో 2.14 మి.గ్రా.ల ఫ్లోరైడ్ ఉంది.

**వాన నీటిని భూమిలోకి ఇంకించడమే మార్గం**

నీటిలో లవణాలు మోతాదుకు మించితే తాగు, సాగు అవసరాలకు వినియోగించినపుడు అనర్థాలకు దారి తీస్తాయి. నైట్రేట్ లవణాలతో గర్భిణులకు పుట్టబోయే పిల్లల్లో బ్లూ బేబీ సిండ్రోమ్(రక్తంలో తగినంత ఆక్సిజన్ లేకపోవడం) సమస్యకు దారి తీస్తుంది. అయిదేళ్లలోపు పిల్లల్లో కంటి చూపు పోతుంది. నేల చౌడుగా మారి పంట దిగుబడులు తగ్గుతాయి. ఫ్లోరైడ్ నీటితో చేతులు, కాళ్లు వంకర పోతుంటాయి. క్లోరైడ్ వల్ల నీటిలో కఠినత్వం పెరగడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తాయి. బోర్లు, బావుల వద్ద ఇంకుడు గుంతలు, మానేరు, వాగుల ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా సమస్యను అరికట్టవచ్చు. చెరువుల్లో ఏటా పూడిక తొలగించాలి. వర్షపు నీరు భూమిలోకి చేరితే ఫ్లోరైడ్, నైట్రేట్ అవశేషాలు తగ్గుముఖం పడతాయి.

**ఎరువుల వినియోగం తగ్గిస్తేనే మేలు**

జిల్లాలో బావులు, బోర్ల నీటిలోనే నైట్రేట్ శాతం అధికంగా ఉంది. రైతులు దిగుబడులు పెరగాలన్న ఆతృతలో ఎరువులు అధికంగా వినియోగిస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల నేల నిస్సారమవుతుంది. భూగర్భ జలాల సంరక్షణకు ప్రజలు స్వచ్ఛందంగా కృషి చేయాలి.లావణ్య, పెద్దపల్లి జిల్లా భూగర్భ జల శాఖ అధికారి

# పస్తులతో ఫలితాలెలా?

సారంగాపూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రత్యేక తరగతులను ప్రారంభించగా మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రంలో ఉన్న కళాశాలలకు రావాలంటే బస్సులు లేకపోవడం.. ఉదయం వచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు ఉండాల్సి రావడంతో ఆకలితో అలమటించాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుకు నోచుకోవడం లేదు. విద్యార్థుల హాజరు శాతం పడిపోతుందని అధ్యాపకులు వాపోతున్నారు. విద్యార్థులు మధ్యాహ్నం కళాశాల నుంచి వెళ్లిపోతుండడంతో ఫలితాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా 90 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే కళాశాలల్లో సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఫిబ్రవరి 3 నుంచి ప్రయోగ పరీక్షలు, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు మరో రెండు నెలలు ఎంతో కీలకం. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేయడం తోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన



అవసరముంది. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5089 విద్యార్థులు ఉండగా, ప్రథమ 2029, ద్వితీయ 1816 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యేందుకు అధ్యాపకులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ఒక్కో విద్యార్థి ఇంటికి రెండుమూడు మార్లు వెళ్లినా విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించకపోవడంతో అధ్యాపకులకు తలనొప్పిగా మారింది.

**దాతల సహకరంతో అమలు**

రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు సొంతంగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెంబట్లకు చెందిన మర్యాల రాజన్న అనే దాత సహకారంతో అల్పాహారం అమలు చేస్తున్నారు. దాతలు సహకరించకుంటే విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. కనీసం అల్పాహారం అందించేందుకు నిధులు మంజూరు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

**నిరుపేద విద్యార్థులే ఎక్కువ**

మాది కండ్లపల్లి గ్రామం. ఉదయం ఇంటి వద్ద తిని బస్సులో వస్తే ఇంటికి వెళ్లే సరికి రాత్రి అవుతుంది. పాఠశాలల మాదిరిగా కళాశాలల్లోనూ భోజనాన్ని అందించాలి. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నందున ప్రత్యేక భోజన వసతి కల్పించాలి.రమ్య, ద్వితీయ, కండ్లపల్లి

**ఏకాగ్రత కోల్పోతున్నాం** ఆకలితో ఉండడంతో చదువుపై దృష్టి సారించలేక ఏకాగ్రత కోల్పోతు న్నాం. మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. కనీసం అల్పాహారం అందించినట్లయితే సాయంత్రం వరకు చదువు కొనసాగించడంతోపాటు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంటుంది.కార్తీక్, ప్రథమ, చర్లపల్లి

# పెరటి తోట.. ఆరోగ్యానికి బాట

ఖమ్మం : లబ్ధిదారుల మానసిక, శారీరక పరివర్తనే లక్ష్యంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆరోగ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోంది. తల్లీ పిల్లల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే బాలామృతంతో పాటు కోడిగుడ్లు, తల్లులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. ఈ క్రమంలోనే తాజా కూరగాయలతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు సన్నద్ధమైంది. అంగన్‌వాడీ కేంద్రాలున్న ప్రాంగణాల్లో ఖాళీ ప్రదేశంలో గ్రీన్ గార్డెన్(పెరటితోట)లు ఏర్పాటు చేయాలని భావించింది. సొంత భవనాలున్న కేంద్రాల్లో తొలుత ఈ తరహా ప్రయోగాలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తోటల పెంపకం పూర్తిస్థాయిలో చేపడితే లబ్ధిదారులకు పోషక విలువలతో కూడిన ఆహారం స్థానికంగానే లభించే అవకాశం ఉంది.

**అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా..**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3,900 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సొంత భవనాలు, స్థలాలు అనువుగా ఉన్న ప్రదేశాల్లో పెరటి తోటల పెంపకం చేపట్టాలని నిర్ణయించారు. నీటి సదుపాయం లేని వాటికి నల్లా కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. సాగు పద్ధతులపై టీచర్లు,



ఆయాలకు తర్ఫీదు ఇచ్చారు. నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ఆకు కూరలు, కూరగాయల పంటలు పండించాలి. క్రిమిసంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో మాత్రమే వాటిని పెంచాలి. సహజంగా అందుబాటులో ఉండే టమాటా, మునగ, సొర, బీర, బెండ, దొండ, చిక్కుడు, పాలకూర, గోంగూర, చుక్కకూర, కొత్తమీర, కరివేపాకు, మెంతికూర వంటి పలు రకాలు సాగు చేయాలి. ఆయా మొక్కల్లో ఒక్కో రకం కనీసం ఐదు వరకు పెంచాలి. భవిష్యత్తులో విత్తనాలనూ సరఫరా చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నాయి. **వనరులున్న చోట పెంచాలని సూచించాం**

పెరటి తోటల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. వనరులున్న అన్ని కేంద్రాల్లో వీటిని పెంచాలని సిబ్బందికి సూచించాం. కేంద్రాలను సందర్శిస్తూ పర్యవేక్షించాలని సీడీపీఓలను ఆదేశించాం.

కె.రాంగోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ

# పారిశ్రామిక శిక్ష

డోన్ : కిక్కిరిసిన గదుల్లో శిక్షణ.. పాతకాలపు యంత్రాలు.. సరిపడా శిక్షణాధికారుల్లేరు.. పేదవర్గాల వారి ఉపాధికి భరోసాగా నిలిచిన పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐ)లో అసౌకర్యాలు యువతకు 'శిక్ష'లా మారాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలెక్కువ.. వాటిలో కొలువుదీరాలంటే ఐటీఐ పూర్తి చేయాలి. పదో తరగతి పూర్తి చేసిన కొందరు విద్యార్థులు అటువైపు అడుగులేస్తున్నారు. నంద్యాల, ఆలూరు, అవుకు పట్టణాల్లో ఐటీఐలకు సొంత భవనాలు లేవు. ప్రైవేట్ షెడ్డులో 176 మందికి శిక్షణ కల్పిస్తున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఐటీఐలను పట్టించుకోలేదు.. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

**వీటిని ప్రారంభించాలి మరి**

బేతంచెర్లలో 150 మంది శిక్షణ పొందుతున్నారు. గోరుమానుకొండలో 5.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.4.50 కోట్లు వెచ్చించి కొత్త భవనం నిర్మిస్తున్నారు. విద్యుత్తు, నీటి సరఫరా, మరుగుదొడ్లు, ల్యాబొరేటరీ, పెయింటింగ్ తదితర పనులు నిధుల్లేక ఆగిపోయాయి. డోన్ ప్రభుత్వ ఐటీఐలో 480 మంది చదువుకుంటున్నారు. రూ.2.40 కోట్లతో సొంతభవనం నిర్మిస్తున్నారు. మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, పెయింటింగ్, తలుపులు, నీటి ట్యాంకు పనులు పూర్తి చేయాల్సి ఉంది.



**ఐదేళ్లు పట్టించుకోని వైకాపా**

ఆలూరులో 2008లో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 240 మంది శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. రూ.7 కోట్లు వెచ్చించి సొంత భవన నిర్మాణానికి నాలుగేళ్ల కిందట రెండున్నర ఎకరాలు కేటాయించారు. నిధులు మాత్రం విడుదల కాలేదు.

అవుకు ఐటీఐ కళాశాలకు సొంత భవనం లేక బ్రిటిష్ కాలంలో సబ్‌జైలుగా వినియోగించుకున్న గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. 2008లో ఏర్పాటైన కళాశాలకు తెదేపా హయాంలో పదెకరాలు కేటాయించారు. రూ.6 కోట్లు మంజూరు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ విధానంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఆదోని శివారు ఆరేకల్ శివారులో తెదేపా హయాంలో 2019లో రూ.3.91 కోట్లు వెచ్చించి మైనారిటీ విద్యార్థులకు ఐటీఐ కళాశాల నిర్మించారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి పట్టించుకోలేదు. ఐదేళ్లు పట్టించుకోలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించాం.. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించే అవకాశం ఉందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సూరప్ప తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు.. ఉపాధి కూలీలు!

నంద్యాల: ఉపాధి హామీ నిధులను పలువురు క్షేత్ర సహాయకులు బరితెగించి అక్రమంగా కాజేస్తున్నారు. నందికొట్కూరు మండలం కోళ్లబావాపురంలో క్షేత్రసహాయకురాలు భారతి ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను, మరణించిన వారిని, ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కూలీలుగా చూపి డబ్బులు తినేసినట్లు వెలుగులోకి వచ్చింది. రూ.1,49,242 పక్కదారి పట్టినట్లు తేలడంతో తాత్కాలికంగా తొలగించారు.. రూ.32,699 రికవరీ చేసి మళ్లీ పోస్టింగు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తి మొత్తాన్ని రికవరీ చేయకుండా పోస్టింగు ఇవ్వడంపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కె.రాముడు ఎక్సైజ్‌శాఖలో సీఐగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఖాతాలో రూ.947 జమ చేశారు. ఆయన భార్య సుంకమ్మ 2023లో మృతిచెందారు. ఆమె ఖాతాలో ఉపాధి హామీ కూలీ జమచేశారు.

జి.వరలక్ష్మి ఆశా కార్యకర్తగా విధులు నిర్వరిస్తున్నారు. ఆమె ఖాతాకు రూ.3,507 చెల్లించినట్లు రాశారు. అధికారులు విచారణ చేయగా ఆశా ఉద్యోగినిగా ఉంటూనే ఉపాధిహామీ పనులకు వెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు. కె.పార్థసారథి అటవీశాఖలో అతని తండ్రి స్థానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఖాతాలో రూ.11,297 వేశారు.

కర్నూలులోని ఓ ప్రముఖ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న రామాంజనేయులు ఖాతాలో రూ.1,743, ఎరువుల సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.మధుసూదన్ ఖాతాలో రూ.10,510లు, ఎం.ప్రసాద్ అనే వ్యక్తి ఖాతాలో కూడా రూ.11,323 డిపాజిట్ చేశారు. పి.కవిత మహిళ భర్త వి.ఆర్.ఒ.గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె ఖాతాలో రూ.15,943 వేశారు.

కోళ్లబావాపురానికి చెందిన.మురళిని అధికారులు విచారించగా, తాను ఉపాధి పనులు చేయలేదని, ఖాతాలో డబ్బులు వేయడానికి అంగీకరిస్తే 50 శాతం మొత్తాన్ని ఇస్తానని చెప్పారని అంగీకరించారు.. అతని ఖాతాలో రూ.10,774 జమ చేశారు. హెచ్.ఎన్.ఎస్.ఎస్. ప్రాజెక్టు వాచ్‌మెన్ సంగిరెడ్డి రాముడు ఖాతాలో రూ.7,618లు, టయోటా షోరూంలో పనిచేసే ఎన్.మధుసూదన్ వ్యక్తి ఖాతాలో రూ.10,894 పంపించారు. బి.శివకుమార్ తిరుపతి ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఖాతాలో రూ.6,548 జమ చేశారు.

# అవ్వా తాతలకు ఆయుష్మాన్

ఆళ్లగడ్డ : 70 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేయాలని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది.. లబ్ధిదారుడి సామాజిక, ఆర్థికస్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించనున్నారు. వృద్ధులు ఆర్థిక ఇబ్బందులతో పాటు, రోగాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంటారు. వారు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఉచిత వైద్య సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ వయోవందన కార్డు'లు ఇవ్వాలని నిర్ణయించింది.

గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ కార్డులను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

ఇప్పటికే దాదాపు 95 శాతం మందికి ఆయుష్మాన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులను గుర్తించి ప్రత్యేకంగా ఈకేవైసీ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హెల్త్‌కార్డుల్లోని వివరాల ఆధారంగా వృద్ధులను గుర్తించి ఏఎన్ఎంలు నేరుగా వారి వద్దకే వెళ్లి ఈకేవైసీ తీసుకుంటున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయిన వెంటనే అక్కడికక్కడే వృద్ధుల పేరిట హెల్త్‌కార్డు జనరేట్ అవుతుంది.

# పట్టణ ప్రణాళిక.. అవినీతి మరక




విశాఖపట్నం : జీవీఎంసీ పట్టణ ప్రణాళికకు అవినీతి మరక అంటింది. వైకాపా హయాంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇందులో పట్టణ ప్రణాళిక అధికారులే సూత్రధారులని అర్థమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఇప్పటికీ చర్యలకు వెనుకాడుతున్నారు. అంతేనా? అక్రమార్కుల నుంచి కాసులు తీసుకుని, సలహాలిచ్చి మరీ కొమ్ముకాస్తున్నారు.

**వైకాపా అక్రమాలకు వెన్నుదన్నుగా:** వైకాపాకు కొమ్ముకాసిన కొందరు అధికారులు జీవీఎంసీలో వివిధ హోదాల్లో పనిచేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నగరంలో టీడీఆర్(ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట రైట), నాలా పన్ను చెల్లింపు అక్రమాలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో వీరిలో కొందరు అధికారులు ప్రాధాన్యతలేని పోస్టుల్లో ఉన్నారు. ఐతే అక్రమాలకు కారణమైన బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. చిత్రమేమంటే ప్రభుత్వం మారినా, ఇంకా అదే స్థాయిలో అక్రమాలు జరుగుతుండటం, వైకాపా నాయకులకు మళ్లీ అధికారులు కొమ్ముకాస్తుండటం గమనార్హం.

**తాత్కాలికంగా నిలిపారే తప్ప రద్దు చేయరేం?:** నగరంలో వెంకటపతిరాజు నగర్‌కు రూ.30కోట్లు విలువైన టీడీఆర్‌ను గత ఏడాది జారీ చేశారు. 1926 డాక్యుమెంటు ఆధారంగా జారీ చేసిన ఆ టీడీఆర్‌ను ఏ దశలోనూ నిలిపివేయడానికి పట్టణ ప్రణాళికాధికారులు ప్రయత్నించకపోవడం విడ్డూరం. ఏఎస్ఆర్ నగర్, బిలాల్‌కాలనీ, జాలారిపేట మురికివాడలకూ యజమానులున్నారని, వారికీ టీడీఆర్‌లివ్వాలని దరఖాస్తు చేయగా, ఆయా దస్త్రాలను ఎలాంటి విచారణ లేకుండా ముందుకు ప్రణాళికాధికారులు నడిపించారు. ఆయా వ్యవహారాలను అప్పటి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, జాలారిపేట టీడీఆర్‌లపై స్థానికంగా కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలిపివేశారే తప్ప, పూర్తిగా రద్దు చేయకపోవడం విచిత్రం.

**పట్టణ ప్రణాళిక ఆదాయ వనరుగా:** నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి 19 సెంట్లకు టీడీఆర్ ఇవ్వడానికి ప్రణాళికాధికారులే దస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. ఆ భూమి గెడ్డకు చెందిందని, యూఎల్‌సీగా సర్వేయరు నివేదిక ఇవ్వగా, దానిని అధికారులు పక్కనపెట్టడానికి యత్నిస్తున్నారు. నగరంలో భారీ ప్రాజెక్టులు వీఎల్‌టీ లేకుండానే సాగిపోతున్నాయి. తాజాగా రూ.120కోట్ల నాలా పన్ను చెల్లించకపోయినా, ఓసీలు జారీ చేసిన విషయాలు విజిలెన్స్ విచారణలో వెలుగుచూస్తున్నాయి. ఇలాంటివాటితో జీవీఎంసీలో ప్లానింగ్ అధికారులుగా పనిచేసినవారంతా భారీగానే వెనుకేసుకుంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది.

**అధికారుల మద్దతు లేకుండా ఇవన్నీ జరిగాయా?:** కాకినాడలో జారీ చేసిన టీడీఆర్‌లపై ఆరోపణలుండగా, వాటిని సీబీసీఎన్‌సీ ప్రాజెక్టులో వాడిన ఉదంతంలో జీవీఎంసీలో ఓ ఉన్నతాధికారి పూర్తిగా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో రేవళ్లపాలెంలోని భూమికి రూ.209 కోట్ల టీడీఆర్ విడుదల చేసి, మళ్లీ దానిని పక్కనపెట్టగా, ప్రస్తుతం దాని విడుదలకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. డైమండ్‌పార్కు సమీపంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణానికి ప్రణాళికాధికారులు ప్లాను మంజూరు చేయడమే కాకుండా రూ.5కోట్లు టీడీఆర్ జారీ చేయడంపై అనుమానాలున్నాయి. ఎన్‌సీసీ భూముల మీదుగా రహదారి నిర్మించి రూ.660 కోట్లు టీడీఆర్ ఇవ్వడానికి, దసపల్లా భూముల్లోనూ రహదారి వేసి టీడీఆర్ కొట్టేయడానికి జరిగిన ప్రయత్నాల వెనుక అప్పటి ప్రణాళికాధికారులు సహకరించారన్న విమర్శలున్నాయి. ఎలాంటి యాజమాన్య హక్కుల్లేని సింహాచలం బీఆర్‌టీఎస్ రహదారి బాధితులకు టీడీఆర్‌లు విడుదల చేయడంలోనూ అధికారులే కీలక పాత్ర పోషించారు. విజిలెన్స్ వెలికి తీస్తున్న అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే పట్టణ ప్రణాళిక గాడిలో పడుతుందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

# రాయితీ మింగారు సాగు యంత్రం అమ్మారు



కర్నూలు : గత వైకాపా హయాంలో మూడేళ్ల కిందట గ్రామ స్థాయిలో వైకాపా నాయకులు, కార్యకర్తల పేర్లతో రైతు సమూహాలను నియమించారు.. నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు ఇచ్చేలా వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాలు (సీహెచ్‌సీ)లు ఏర్పాటు చేశారు. పేరుకే రైతు సమూహాలు.. పెత్తనమంతా వైకాపా నాయకులు, కార్యకర్తలదే. ప్రభుత్వం నుంచి రైతు సమూహానికి రాయితీ సొమ్ము జమకాగానే సీహెచ్‌సీ యూనిట్లలోని ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను ఇతరులకు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. సహకార బ్యాంకులకు రుణ చెల్లింపులు చేయకుండా మొండికేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 21 సహకార బ్యాంకు శాఖల పరిధిలో 516 వైఎస్సార్ యంత్రసేవా రైతు సంఘాలు రూ.15.17 కోట్ల మేర రుణాలు చెల్లించకుండా మొండికేస్తున్నారు.

**అద్దె సొమ్ము ఆరగించారు**

యంత్రాలను ఆయా గ్రామాల్లో రైతులకు అద్దెకు ఇవ్వాలి. క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైకాపా నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించారు.

ఉమ్మడి జిల్లాలో 2,717 మంది రైతులు అద్దె ప్రాతిపదికన యంత్రాలు తీసుకున్నారు. తీసుకున్నవారి వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా... అలా జరగలేదు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 877 యూనిట్లు మంజూరు చేయగా కర్నూలు జిల్లాలో 84 సీహెచ్‌సీలు, నంద్యాల జిల్లాలో 32 మాత్రమే వినియోగంలో ఉన్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ వెల్లడించిన నివేదికలు చెబుతున్నాయి.

**రాయితీ సొమ్ము కోసం నాటకం**

ఉమ్మడి జిల్లాలో 1,037 కస్టమ్‌హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సీహెచ్‌సీ యూనిట్ విలువ రూ.15 లక్షలు. ఐదుగురు రైతుల సమూహం వాటా 10 శాతం కాగా.. 40 శాతం అంటే రూ.6 లక్షల మేర రాయితీ పోనూ మిగిలిన రూ.7.50 లక్షలను సహకార బ్యాంకులో రుణం ఇప్పించారు.

కర్నూలు జిల్లాలో 539 సీహెచ్ సీలకు రూ.21.13 కోట్లు, నంద్యాల జిల్లాలో 498 సీహెచ్‌సీలకు రూ.22.36 కోట్లు మంజూరయ్యాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఉమ్మడి జిల్లాలో రైతు సమూహాలు కేవలం రాయితీ కోసమే యూనిట్లు మంజూరు చేయించుకున్నారన్న విమర్శలున్నాయి. 1,037 యూనిట్లకు కర్నూలు జిల్లాలో 84, నంద్యాలలో 32 యూనిట్లు వినియోగంలో తీసుకొచ్చారు.

**అడిగితే బెదిరింపులు**

కర్నూలులో రూ.7.23 కోట్లు, నంద్యాలలో రూ.7.93 కోట్ల మేర దీర్ఘకాలికంగా రుణ బకాయిలు ఉన్నాయి.

ఆదోని సహకార బ్యాంకు శాఖ పరిధిలో అత్యధికంగా 67 రైతు సమూహాలున్నాయి. గత రెండేళ్లకుపైగా రూ.2.17 కోట్ల వరకు రుణ చెల్లింపులు చేయకుండా మొండికేశాయి.

ఆలూరులో 57 రైతు సంఘాలు.. రూ.1.07 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయలేదు.

డోన్ సహకార బ్యాంకు బ్రాంచి పరిధిలో 65 రైతు సంఘాలు గత రెండేళ్లకుపైగా రూ.2.37 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయలేదు. చివరికి అధికారులనే బెదిరించే పరిస్థితికి చేరింది.

కోవెలకుంట్ల మండల పరిధిలో గత రెండేళ్లుగా 33 రైతు సమూహాలు రూ.1.07 కోట్ల మేర రుణాలు చెల్లించలేదు. సహకార బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు.

**తాఖీదులు జారీ చేస్తాం**

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద సహకార బ్యాంకు శాఖల నుంచి రుణాలు తీసుకున్న రైతు సమూహాలు రుణ చెల్లింపులు చేయడం లేదు. ఇదివరకే తాఖీదులిచ్చినా స్పందించలేదు. లీగల్ నోటీసులు జారీ చేస్తాం.. మొండి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విజయ్‌కుమార్, సీఈవో, జిల్లా సహకార బ్యాంకు

# 24 గంటల్లో ఇంటి నిర్మాణ అనుమతులు

ఆదోని : పురపాలికల్లో 18 మీటర్లలోపు నిర్మించే ఇళ్లకు 24 గంటల్లో అనుమతులు పొందేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ సర్వేయర్స్, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్)లు దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు (అప్‌లోడ్) చేసి కొద్ది గంటల్లోనే అనుమతులు పొందే వీలు కల్పించింది. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టి, ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాన్ని పొందొచ్చు.

**పాత ఇంటికి కొత్త కష్టాలు**

పట్టణాల్లో పాతబస్తీలో అధికంగా 30-40 (1,200 చ.అ.) నివాసాలే ఉంటాయి.. అన్ని పాత ఇళ్లే.. కొత్త ఇల్లు నిర్మించుకోవాలంటే.. నాలుగు వైపులా ఐదు అడుగుల స్థలం వదలాలి. మిగిలేది సగం స్థలమే. ఈ విధానంలో పాతబస్తీలోని ఇళ్ల నిర్మాణాలకు కొత్త కష్టాలు వచ్చిపడినట్లైంది.

**ఏటా వేలల్లో దరఖాస్తులు**


ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది పురపాలక సంఘాలు, నగర పంచాయతీలున్నాయి. వీటిలో ఏటా సుమారు 3-4 వేల ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వస్తుంటాయి. ఏటా సుమారు రూ.15-18 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

**ఇవి కచ్చితంగా పాటించాలి**

300 చ.మీ. ఇంటి నిర్మాణానికి ప్లాన్ ఆమోదం పొందాలంటే.. ముందు భాగంలో 2 మీటర్లు, చుట్టూ.. మూడు వైపులా చెరో 1.5 మీటర్ల మేర సెట్‌బ్యాక్ స్థలం వదలాలి. వాణిజ్య పరమైన అపార్ట్‌మెంట్ల విషయానికొస్తే 100 అడుగుల రహదారి ఉన్నచోట, మూడు వైపులా ఐదు మీటర్ల చొప్పున స్థలం వదలాలి.

**తప్పు చేస్తే చర్యలు తప్పవు**

అనుమతి పొందిన స్థిరాస్తి వెంచర్లలో నిర్మాణాలకే అనుమతి తీసుకోవాలి. వాటిపై యజమాని హక్కులు కలిగి ఉండాలి. సర్వే నివేదిక, స్థల విలువ ఆధారిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ప్లాన్ ఆమోదం పొందిన ఏడు రోజుల్లోపే భవన నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ స్థాయి చిత్రాలు అంతర్జాలంలో అప్‌లోడ్ చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నిర్మాణ అనుమతులు రద్దు చేస్తారు. అనుమతుల ముసుగులో ఎల్టీపీలు తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకొనేలా మార్గదర్శకాల్లో రూపొందించారు. ఇందుకు సహకరించిన సాంకేతిక సిబ్బంది (టెక్నికల్ పర్సన్స్)పైనా చర్యలు తీసుకోవడానికి వీలుంది.



ఉమ్మడి జిల్లాలో 300 మంది వరకు ఎల్టీపీలున్నారు. వీరు తప్పులు చేసినట్లైతే, వారి లైసెన్సును ఐదేళ్లపాటు రద్దు చేయనున్నట్లు నిబంధనల్లో పొందుపరిచారు.

# అవసరమే ఆసరాగా దోపిడీ

భీమవరం : అన్నదాతల అవసరాన్ని ఆసరా చేసుకుని దళారులు దోచుకుంటున్నారు. రబీ సీజన్‌లో యూరియా వినియోగం ఎక్కువగా ఉండటంతో ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తూ రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో రబీ 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని అంచనా. రబీలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిలో అధిక భాగం యూరియాదే. ముందస్తుగా ఎరువుల కొరత లేకుండా నెలల వారీగా ఏఏ ఎరువులు ఎన్ని మెట్రిక్ టన్నులు అవసరమో వ్యవసాయ శాఖ లెక్కలు కట్టింది. కంపెనీ నుంచి హోల్‌సేల్ డీలర్ల ద్వారా రిటైల్ డీలర్లకు చేర్చడం, సొసైటీలు, ఆర్ఎస్‌కేలకు చేర్చి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. పీఏసీఎస్‌లకు లక్ష్యాలు విధించడంతో వచ్చిన స్టాకును వచ్చినట్లు దళారులకు విక్రయించేస్తున్నారు.



**రైతులపై భారం**

ఎరువుల అమ్మకాల్లో ప్రైవేటు డీలర్లదే ప్రధాన పాత్ర కావడంతో బస్తాకు రూ.50 నుంచి రూ.100 మధ్య వసూలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్క ప్రకారం యూరియా 45 కేజీల బస్తా ఎమ్మార్పీ ధర రూ.266.50. సొసైటీలు, ఆర్ఎస్‌కేల అమ్మకాలు చేస్తున్నారు. ప్రైవేటు డీలర్లు వద్ద ధరలు ఇష్టానుసారంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఎరువులు దిగుమతి అయ్యే రైల్వే యార్డు నుంచి 100 కి.మీ. వరకు యూరియాను రూ.300 వరకు అమ్ముకోవచ్చని వ్యవసాయ శాఖ చెబుతోంది. ట్రాన్స్‌పోర్టు ఛార్జీలివ్వకపోవడంతో డీలర్లకు వెసులుబాటు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇదే అదునుగా కొంత మంది రూ.320, ఆపై విక్రయిస్తున్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ జేడీ వెంకటేశ్వరరావు తెలిపారు. ములపర్రుకు చెందిన ఓ రైతు అయిదెకరాలు వరి సాగు చేస్తున్నారు. సొసైటీలో యూరియా లేకపోవడంతో ఓ ప్రైవేటు దుకాణంలో బస్తా రూ.320 చొప్పున కొనుగోలు చేశారు. ఇందుకు బిల్లు ఇవ్వలేదు. ఇదే పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉందని రైతులు వాపోతున్నారు.

# బిల్లులిచ్చేదెప్పుడు?

ఉంగుటూరు ": వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు నీడ, నీటి వసతి కల్పించడానికి 'మినీ గోకులాలు' పేరిట పేద రైతులకు షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మొన్నటివరకు షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగగా.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇటీవల నెమ్మదించాయి.

తొలుత జిల్లాకు 900 మినీ గోకులాల యూనిట్లు మంజూరు చేశారు. పాడి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి కేటాయించారు. ఆసక్తి చూపని వారిని గుర్తించి రద్దు చేశారు. చివరకు 714 చోట్ల మొదలుపెట్టారు. 10 శాతం రైతుల భాగస్వామ్యంతో రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగింటికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షల చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీ ఇస్తున్నారు. సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించినా అన్నిచోట్ల పూర్తి చేయలేకపోయారు. మండలాల వారీగా అత్యధికంగా కుక్కునూరులో 10కి 10, ఏలూరు 5కి 5, వేలేరుపాడు 10కి 9, పోలవరం 14కి 13, ఉంగుటూరు 45కి 38, అగిరిపల్లి 38కి 31.. అత్యల్పంగా భీమడోలులో 37కి 15, పెదవేగి 60కి 35, నూజివీడు 41కి 21, ముసునూరులో 36కి 17 పూర్తయ్యాయి.

సొమ్ముల కోసం ఎదురుచూపులు.. పశు పోషకులు షెడ్లను నిర్మించుకున్నా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. తొలి విడతలో కొంతమంది ఖాతాల్లో మాత్రమే జమ చేశారు. చాలా మందికి నిరాశే మిగిలింది. పనులు పూర్తి చేసి గత నెల 10-12 తేదీల్లో చిత్రాలను యాప్‌లో నిక్షిప్తం చేశారు. అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అంటూ ఊరిస్తూ వస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 'రూ.4 కోట్లు నిధులు రావాల్సి ఉండగా రూ.కోటి మంజూరైంది. వారం పది రోజుల్లో నిధులు మంజూరవుతాయి' అని డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు.

# రూ. కోట్లు.. పొలాలకు నీళ్లిస్తాయా

బొబ్బిలి : జలాశయాల ఆధునికీకరణకు నిధులు ఉన్నా పనుల పూర్తి ప్రశ్నార్థకంగా మారింది. జైకా నిధులతో చేపట్టిన నిర్మాణాలకు నిర్దేశించిన గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తోంది.

**ప్రాజెక్టుల వారీగా పరిస్థితి..**

వెంగళరాయ అదనపు ఆయకట్టు పనులకు పదేళ్ల క్రితం రూ.9 కోట్ల ప్రత్యేక నిధులొచ్చాయి. బొబ్బిలి, సీతానగరం మండలాల్లోని 5,500 ఎకరాలకు సాగునీరు అందాలి. కానీ భూసేకరణ జరగక పనులు ప్రారంభించలేదు. తర్వాత జైకా ద్వారా రూ.63.50 కోట్లతో 2020లో ఆధునికీకరణ ప్రారంభించారు. నాలుగేళ్లలో 20 శాతం మాత్రమే జరిగాయి.

పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణను రూ.28.18 కోట్లతో 2020లో ప్రారంభించి ఇప్పటి వరకు 10 శాతం పనులు మాత్రమే చేశారు.

జియ్యమ్మవలస మండలంలోని వట్టిగెడ్డ జలాశయానికి రూ.44.85 కోట్లు వచ్చాయి. 15 శాతం మాత్రమే పనులు జరగడంతో శివారు ఆయకట్టుకు నేటికీ సాగునీరు అందడం లేదు.

బలిజిపేట మండలంలోని పెదంకలాం ఆనకట్ట నుంచి 8,253 ఎకరాలకు నీరందాలి. రూ.17.30 కోట్లతో పనులు చేపట్టగా కేవలం 5 శాతం అయ్యాయి.

**బిల్లులు రాలేదు..**

జైకా పనులు ప్రారంభించి సుమారు అయిదేళ్లవుతోంది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారు. ముఖ్యంగా గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించలేదు. 2025 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా కొలిక్కిరాలేదు. పూర్తి కావాలంటే మరోసారి ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది.

**బాగు చేయడం లేదు - జి.సింహాచలం, రైతు, మర్రివలస, రామభద్రపురం**

పెద్దగెడ్డ జలాశయానికి శివారున ఉన్నాం. కాలువ తుప్పలతో నిండిపోయింది. గత ఖరీఫ్‌లో నీరు రాలేదు. అధికారులు బాగు చేయడం లేదు.

**ప్రత్యేక దృష్టి పెడతాం- అప్పారావు, ఎస్ఈ, బొబ్బిలి, ఆర్.అప్పలనాయుడు, ఈఈ, పార్వతీపురం మన్యం** జైకాతో ఒప్పందంపై ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది చేపట్టనున్న పనులు వివరాలు వారికి తెలియజేస్తాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ముందుకు వెళ్తాం.

# నిధులకు కోతల్లేవ్!

అనంతపురం : గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక విధాలుగా కోతలు విధించారు. ఆర్థిక సంఘం నిధులే కాదు.... రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జీలను రెండేళ్ల పాటు ఒక్క పైసా జమ చేయని ఘనత వైకాపా సర్కారుదే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థల పాత్ర చాలా కీలకం. వాటిని నిర్వీర్యం చేసిన చరిత్ర కూడా గత ప్రభుత్వానిదే. రాత్రిపూట అంతర్జాలంలో నిధులు కనిపించేవి. ఉదయం లోపు పైసా లేకుండా మాయమయ్యేవి. ఇలా ఒకటి కాదు రెండు కాదు...ఎన్నోసార్లు పంచాయతీ సర్పంచులను జగన్ సర్కారు మోసం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పంచాయతీలు అందుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, వృత్తిపన్ను, తలసరి ఆదాయం, సర్పంచుల గౌరవ వేతనం, సీనరేజ్ ఛార్జీలు చకచకా జమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాలకే జమకావడం పట్ల రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్టాంపుడ్యూటీ



సర్‌ఛార్జి కూడా రెండు నెలలది పంచాయతీలకు జమచేసే ప్రక్రియ ఆరంభమైంది.

**అనంత జిల్లాకు రూ. 37.55 కోట్లు**

వైకాపా ప్రభుత్వం కేంద్రం విడుదల చేసే నిధులే కాకుండా సాధారణ నిధులను సైతం విద్యుత్తు బిల్లుల పేరిట ఖాతాల్లో జమకాకుండానే వాడేసుకుంది. పంచాయతీరాజ్ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టాక నిధులన్నీ పంచాయతీ ఖాతాలకే జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని పంచాయతీలకు రూ. 37.55 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో పనులు ఊపందుకున్నాయి. అప్పులు చేసి విద్యుత్తు మోటర్లు, బ్లీచింగ్ పౌడరు కొనుగోలు చేసిన సర్పంచులకు ఊరట లభించింది.

**జోరుగా అభివృద్ధి పనులు - దేగల కృష్ణమూర్తి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతున్నాయి. మున్సిపాల్టీలకు కూడా జమ అయ్యాయి. ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుండా స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# 205 రోజులు.. 33.378టీఎంసీలు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ) నీటి సీజన్ ముగిసింది. మంగళవారమే ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అడుగంటినా.. బుధవారంతో పూర్తిగా హెచ్చెల్సీకి నీటి సరఫరా ఆగిపోనుంది. ఈమేరకు టీబీ బోర్డు ఇక్కడి అధికారులకు వర్తమానం పంపింది. ప్రస్తుత నీటి సీజన్‌లో హెచ్చెల్సీ వాటా 30.354 టీఎంసీలు, కేసీ కాలువ మళ్లింపు కింద మరో మూడు టీఎంసీలు కలిపి మొత్తం 33.354 టీఎంసీలు రావాల్సి ఉండగా.. తుంగభద్ర ప్రాజెక్టు వద్దే మంగళవారం నాటికి 33.378 టీఎంసీలు విడుదల చేశారు. జిల్లా సరిహద్దుకు 29.265 టీఎంసీలు చేరాయి. కర్ణాటక పరిధిలో 4.113 టీఎంసీలు వృథా కింద లెక్క కట్టడం విశేషం. గతేడాది జులై 22న హెచ్చెల్సీకి నీరు విడుదల చేశారు. ఇప్పటి దాకా నిర్విఘ్నంగా ప్రవాహం కొనసాగింది. మొత్తంగా 205 రోజుల్లో డ్యాం వద్ద 33.378 టీఎంసీలను విడుదల చేయడం ప్రస్తావనార్హం.

**ఆయకట్టుకే 13.052 టీఎంసీలు**

ప్రస్తుత 2024-25 నీటి సీజన్‌లో జిల్లాకు చేరిన 29.265 టీఎంసీలల్లో.. ఆయకట్టుకే అధికంగా 13.052 టీఎంసీలు కేటాయించారు. ఎమ్పీఆర్, కణేకల్లు, పీఏబీఆర్, ముచ్చుకోట, సుబ్బరాయసాగర్ జలాశయాల్లో 5.287 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మరోవైపు హెచ్చెల్సీ పరిధిలో 90,355 ఎకరాలు సాగు చేశారు.




హెచ్చెల్సీపై ఆధారపడి 14 తాగునీటి పథకాలు కొనసాగుతున్నాయి. అనంతపురం నగరంతోపాటు హిందూపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, వంటి ప్రాంతాలకే కాకుండా వందలాది గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది.

**గతేడాది కంటే రెట్టింపు**

గతేడాది వైకాపా ప్రభుత్వ హయాంలో హెచ్చెల్సీ వాటాగా 16.071 టీఎంసీలు, కేసీ మళ్లింపు వాటా కింద ఒక టీఎంసీ కలిపి మొత్తం 17.071 టీఎంసీలే వచ్చాయి. ఇందులోనూ తాగునీటి అవసరాలకు ఎక్కువ కేటాయించారు. సింహభాగం ఆయకట్టు బీడుగా మారిపోయింది. గతేడాదితో పోల్చితే ఈదఫా రెట్టింపు స్థాయిలో హెచ్చెల్సీ జలాలు జిల్లాకు చేరడం విశేషం. వచ్చే వేసవిలోనూ నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పేదల పుట్టల్లోని వైకా'పాముల్ని' తరిమేస్తారు!



చిత్తూరు : నగరం తేనెబండలోని జగనన్న కాలనీ. చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉన్న లే అవుట్‌లో పేదలకే పట్టాలు ఇవ్వాలి. అది కూడా ఒక సెంటు మాత్రమే పంపిణీ చేయాలి. ఇందుకు భిన్నంగా ఇక్కడ భవంతులు నిర్మించారు. ఇంత స్థలం గత వైకాపా ప్రభుత్వం వీరికి ఎలా ఇచ్చిందన్నదే అసలైన ప్రశ్న. అధికార పార్టీ నాయకులు కావడమే ఏకైక అర్హతగా స్థలాలు పొంది భవనాలు కట్టుకున్నారన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

రేణిగుంట మండలం తారకరామానగర్, కుర్రకాల్వ గ్రామాల్లో స్థానిక వైకాపా నేతలు ఒక్కో ఇంటి పట్టాను రూ.2 లక్షలకు అమ్మేశారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు కొంత ఖాళీగా ఉండగా వాటినే వారు విక్రయించేశారు. ఇలా దాదాపు 200 పట్టాలను అమ్మి సొమ్ము చేసుకున్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా ఫ్యాను పార్టీ నాయకులు గద్దల్లా వాలిపోయారు. శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్‌నగర్, ఏర్పేడు మండలం చిందేపల్లి వద్ద సైతం ఇదే పరిస్థితి.

ఈనాడు, తిరుపతి- న్యూస్‌టుడే, రేణిగుంట, శ్రీకాళహస్తి: చీమలు పెట్టిన పుట్టల్లోకి చేరిన వైకా'పాముల'ను తరిమేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైకాపా హయాంలో అనేక చోట్ల పేదల స్థానంలో అనర్హులకు ఇంటి పట్టాలు కట్టబెట్టారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో పైసలిచ్చిన వ్యక్తులకే పట్టాలు కట్టబెట్టారు. కొందరు నాయకులు పేదల పేరిట పట్టాలు పొంది భారీ భవంతులు నిర్మించారు. పలుచోట్ల ఇల్లు కట్టలేక లబ్ధిదారే స్థలాన్ని అమ్మేశారు. ఈ అక్రమాలను నిగ్గు తేల్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపి అనర్హుల ఏరివేసే పనిలో పడింది. 'నవ రత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం కింద 2020 డిసెంబరులో ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వ్యక్తులకే వీటిని ఇవ్వాలని అప్పట్లో పేర్కొంది. గతంలో ప్రభుత్వం స్థలం ఇచ్చినా, గృహ నిర్మాణానికి సాయమందించినా అనర్హులేనని తెలిపింది. పకడ్బందీగా చేపట్టాలని భావించిన కార్యక్రమం గాడి తప్పింది. వైకాపా నేతలు, దళారులు ఇందులోకి ప్రవేశించడంతో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది నామమాత్రంగా మిగిలిపోయారు.

**15 రోజుల్లోగా పునఃపరిశీలించాలని ఆదేశం**

తాజాగా అక్రమాల లెక్క తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నెల 5న సీసీఎల్ఏ నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చాయి. ఇందుకోసం తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. 15 రోజుల్లోగా ఇంటి పట్టాలను పునః పరిశీలించాలని స్పష్టంగా పేర్కొన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారు ప్లాట్ నంబరు, పేరుతోపాటు వారు అర్హులా? కాదా? ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉందా? లేదంటే ఇల్లు కట్టుకున్నారా? అనే సమాచారం పొందుపరచాలని తెలిపారు. అనర్హుల జాబితా తేలితే ఆ పట్టాను తహసీల్దారు రద్దు చేస్తారు.

**రూ.20 వేలు - రూ.7 లక్షల వరకు**

శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, చిత్తూరు, గంగాధరనెల్లూరు, పలమనేరు, కుప్పం తదితర నియోజకవర్గాల్లో అధికారులను కేవలం కాగితాలపై సంతకం చేయించుకోవడానికే వినియోగించుకున్నారు. పెద్దగా డిమాండ్ లేనిచోట రూ.20 వేలకు పట్టా అమ్మేయగా.. ఎక్కువమంది ఆసక్తి చూపిన ప్రాంతాల్లో రూ.7 లక్షలకు కూడా విక్రయించారు. అప్పట్లో ఈ వ్యవహారంపై వైకాపా నేతల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చినా యంత్రాంగం కనీస చర్యలకు ఉపక్రమించలేదు.

# క్రీడా హబ్‌కు అడుగులు




తిరుపతి : కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై దృష్టిసారించింది. 'ఖేలో ఇండియా పథకం' కింద క్రీడాకారులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి దేశవ్యాప్తంగా స్టేట్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్‌టీసీ)లను కేంద్రం ఇప్పటికే నిర్వహిస్తోంది. వీటిద్వారా ఎంపిక చేసిన 10 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

కూటమి ప్రభుత్వం అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలను క్రీడా హబ్‌లుగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించింది. తిరుపతి సమీపంలోని తూకివాకం వద్ద 35 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్టేడియం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. తాజాగా తిరుపతిలో ఎస్‌టీసీ ఏర్పాటు చేయాలని సాయ్‌కు ప్రతిపాదనలు పంపారు. క్రీడాకారులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, క్రీడాపరికరాలు, దుస్తులు సాయ్ నిధులతో సమకూరుతాయి.

**ఎస్వీయూతో ఒప్పందం**

తిరుపతిలో ఎస్‌టీసీ ఏర్పాటు చేయాలంటే అన్ని సౌకర్యాలు, సదుపాయాలతో కూడిన భవనాన్ని శాప్ తరఫున సాయ్‌కు కేటాయించాల్సింది. ఇందుకోసం ఎస్వీయూలో నిరుపయోగంగా ఉన్న ఈ-మెస్ (డార్మిరీ)ని కేటాయించాలని ఛైర్మన్ రవినాయుడు కోరారు. స్పందించిన ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్‌లు గతనెలలో ఒప్పందం చేసుకున్నారు. ఎస్‌టీసీ కోసం ఎస్వీయూలో కేటాయించిన భవనాన్ని సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.కె.నరేష్ కుమార్ ఇటీవల పరిశీలించారు. భవన నిర్మాణం, చుట్టుపక్కల పచ్చదనం, క్రీడాకారుల సాధనకు అనువైన ఎస్వీయూ స్టేడియం, శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు అందించే నివేదిక ఆధారంగా తుదపరి చర్యలు తీసుకోనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో క్రీడాకారుల వివరాలు**

తైక్వాండో: 150- 200 మంది

హ్యాండ్‌బాల్: 50- 100 మంది


**కలిసొస్తే సంబరమే**

ఎస్‌టీసీ ఏర్పాటుతో తైక్వాండో, హ్యాండ్‌బాల్ క్రీడాంశాల్లో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ క్రీడాకారులకు నిష్ణాతులైన సాయ్ బృందం ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్వీయూలోని ఈ- మెస్ భవనంలో వసతి, భోజనం సదుపాయం కల్పించనున్నారు. మలిదశలో మరిన్ని క్రీడాంశాలను పరిచయం చేయనున్నారు.

# కరెంటు కష్టాల కట్టడి

పాడేరు : ఏటా వేసవిలో కరెంటు కోతలు, లోవోల్టేజీ వెతలు కనిపిస్తుంటాయి. ఈ ఏడాది ఆ సమస్య తలెత్తకుండా ముందుగానే విద్యుత్తు సంస్థ అధికారులు మేల్కొన్నారు. కరెంటు సరఫరాలో అంతరాయాలు లేకుండా చేయడానికి అదనపు సబ్ స్టేషన్లను అందుబాటులోకి తెస్తున్నారు. ఉన్న విద్యుత్తు ఉపకేంద్రాల సామర్థ్యాలను పెంచుతున్నారు. వ్యవసాయ, గృహ విద్యుత్తు ఫీడర్లను విభజిస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతున్నారు. వేసవి డిమాండ్‌ను అంచనా వేసి ఆ మేరకు విద్యుత్తు సరఫరాను మెరుపర్చేలా ప్రత్యేక బృందాలతో పనిచేయిస్తున్నారు. విశాఖ నగరంలో కొత్తగా నాలుగు 33//11 కిలోవాట్ల విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు మొదలుపెడుతున్నారు. కూర్మన్నపాలెం, తెన్నేటినగర్, సుద్దగెడ్డ (మధురవాడ), చిల్లపేట (భీమిలి) వద్ద ఒక్కో సబ్‌స్టేషన్ రూ.3 కోట్లతో నిర్మించేందుకు గుత్తేదారులకు అప్పగించారు. 300 గజాల్లో ఇండోర్‌లో వీటిని నిర్మిస్తారు. ఇవి కాకుండా ఎన్ఎస్టీఎల్, కాపులుప్పాడల్లో 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటితో సింహాచలం, మురళీనగర్, కంచరపాలెం, విమాననగర్, గోపాలపట్నం, మధురవాడ, ఐటీ హిల్స్, రుషికొండ, ఆనందపురం సబ్‌స్టేషన్లపై ఒత్తిడి తగ్గి కరెంటు సరఫరా మెరుగవనుంది. ఆశీల్‌మెట్ట, ద్వారకానగర్‌లో విద్యుత్తు ఉపకేంద్రాలకు స్థలాలు చూపాలని జీవీఎంసీని కోరుతున్నారు. అలాగే కచరపాలెం, ఆటోనగర్, రుషికొండ వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు ఈపీడీసీఎల్ విశాఖ ఎస్ఈ శ్యామ్‌బాబు తెలిపారు.

**వ్యవసాయ ఫీడర్లు వేరుగా..** అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు, గృహ, వాణిజ్య కనెక్షన్లు ఒకే ఫీడర్‌పై ఉంటున్నాయి. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)లో వ్యవసాయ ఫీడర్లను వేరు చేసి గ్రామాలన్నింటికీ



త్రీఫేజ్ విద్యుత్తు 24 గంటలూ అందించే ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో విద్యుత్తు ఆధారంగా పనిచేసే చిన్న చిన్న యూనిట్లకు కోతలు లేకుండా సరఫరా చేయొచ్చు. దీనివల్ల కొంతమందికి ఉపాధి దెబ్బతినకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 60 బృందాలు వీటికోసం పనిచేస్తున్నాయి. వేసవి నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసి కరెంటు కోతలు అన్నమాటే లేకుండా చేస్తామని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. అనకాపల్లి పట్టణంతో పాటు నక్కపల్లి దగ్గర వేంపాడు, వాడచీపురుపల్లి, మంగళపాలెం సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి విద్యుత్తు లోడు పెరగకుండా చూస్తున్నట్లు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఎస్ఈ గొప్పు ప్రసాద్ తెలిపారు.

# మార్కెట్ యార్డులకు.. పూర్వ వైభవం వచ్చేనా?

గోరంట్ల : మార్కెట్ యార్డులు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రైతులకు ఉపయోగపడాలి. వ్యవసాయ ఉత్పత్తులను యార్డులో ఉన్న ఫ్లాట్‌ఫారాలపై ఆరబెట్టుకోవడం, గిట్టుబాటు ధరలు లభించని నేపథ్యంలో అక్కడి గోదాముల్లో నిల్వ చేసుకోవడం, అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకోవడం జరగాలి. అంతేకాదు మార్కెట్ యార్డులకు వచ్చే ఆదాయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. రైతులకు, పశువులకు వైద్యశిబిరాలు నిర్వహించాలి. అవకాశమున్నచోట స్థిరాస్తులను అభివృద్ధి చేసి ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు వేయాలి. గడిచిన అయిదేళ్లలో ఏం జరిగిందంటే శూన్యం అన్న సమాధానం వినిపిస్తోంది. గోరంట్ల, కొత్తచెరువు యార్డులు ప్రధార రహదారులకు ఆనుకుని ఉండడంతో దుకాణ సముదాయం, పెట్రోల్‌బంక్ నిర్మాణాలకు పంపిన



ప్రతిపాదనల స్థాయి దాటలేదు.

**హిందూపురం మినహా ఎక్కడా క్రయవిక్రయాలు లేవు**

జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డులు ఉండగా హిందూపురంలో మాత్రం మిర్చి, చింతపండు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన వాటిలో కొత్తచెరువు, గోరంట్ల, కదిరిలో పశువుల సంతల నిర్వహణతో వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలకు వినియోగిస్తున్నారు. ఆదాయం విషయంలో ప్రతిఏటా లక్ష్యానికి చేరుతున్న అభివృద్ధి మాత్రం జరగలేదు. అన్ని మార్కెట్ యార్డులకు నూతన కమిటీలను ఏర్పాటు చేయడానికి ఇటీవలే రిజర్వేషన్లు ఖరారు చేశారు. కనీసం నూతన కమిటీల ద్వారా అయినా యార్డుల పరిస్థితిలో మార్పు వస్తుందా అని రైతుల నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**పొరుగుసేవల సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు** మార్కెట్‌యార్డులలో రెగ్యులర్ సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. 50 శాతానికి పైగా పొరుగుసేవల ఉద్యోగులతోనే నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల కార్యాదర్శులు ఇన్‌ఛార్జీలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఖజానాలో నిధులు ఉన్నా నేరుగా ఖర్చు చేయడానికి అవకాశం లేదంటున్నారు.

# తీరగ్రామాల అభివృద్ధికి శ్రీకారం

గూడూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీర గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కేంద్ర నిధులు రూ.2 కోట్లు కేటాయించి మౌలిక వసతులతో పాటు మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా నిర్మాణాత్మక పనులు చేపట్టనున్నారు. మొదటి విడతలో వాకాడు మండలం తూపిలిపాలెం, రాయదొరువు తీర ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. సీఆర్‌సీఎఫ్‌వీ (కోస్టల్ రిలవెంట్ క్లైమేట్ ఫిషరీస్ విలేజ్) ప్రాజెక్టు కింద రూ.2 కోట్లు విడుదల చేసింది. 70% నిధులతో చేపలు ఎండబెట్టుకునే నాలుగు ప్లాట్‌ఫాంలు, బహుళ



ప్రయోజక రక్షిత తుపాను భవనం వంటి పనులు, మిగిలిన 30 శాతం నిధులతో మత్స్యకారుల జీవనోపాధికి ఉపయోగపడే పడవల ఇంజిన్లు, వలలు వంటి వాటికి వినియోగిస్తారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు 2.50 ఎకరాల భూమి కేటాయించారు. రెండో విడతలో కోట మండలం గోవిందపల్లి పట్టపుపాలెంను ఎంపిక చేశారు.

**రూ.23 కోట్లతో మినీ హార్బర్**

రాయదొరువు సముద్ర ప్రాంతంలో రూ.23 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోర్ అండ్ ఫిష్ ల్యాండింగ్ కేంద్రం (మినీ హార్బర్) ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం 60% నిధులు ఇవ్వగా మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం శుభపరిణామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. టెండర్లు పూర్తయ్యాక పనులు చేపడతా మని మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు తెలిపారు.

# వంతెన శిథిలమై.. రాకపోకలు కష్టమై

సోమల : మండలంలోని పెద్దఉప్పరపల్లెలో భారీ వర్షం పడితే చాలు గార్గేయనది, సీతమ్మచెరువు వంక, బోనమంద చెరువు వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తాయి. పెద్దఉప్పరపల్లె-రెడ్డివారిపల్లెబీ చిన్నకమ్మపల్లెబీ బసవపల్లె, గార్గేయనదిబీ చౌడేపల్లె మార్గంలో దేవలకుప్పం వద్ద సీతమ్మచెరువు వంక, పేటూరు ఇర్లపల్లె వద్ద బోనమంద చెరువు వంక మార్గాల్లోని వంతెనలు ధ్వంసమై రాకపోకలు ఆగిపోతాయి. ఇక్కడ వంతెనలు నిర్మించాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ ప్రజలు తిరుగుతున్నా ఫలితం శూన్యం. నాలుగేళ్ల ముందు బసవపల్లె మార్గంలోని గార్గేయనది దాటే ప్రయత్నంలో చిన్నకమ్మపల్లె ఎస్సీకాలనీకి చెందిన తండ్రి, కూతురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెడ్డివారిపల్లె, చిన్నకమ్మపల్లె, బోనమంద, బసవపల్లె, పేటూరు, పేటూరు ఇర్లపల్లె, పొలికిమాకులపల్లె, దేవలకుప్ప తదితర ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులు తర్వాత పెద్దఉప్పరపల్లె-బసవపల్లె వద్ద గార్గేయనదిపై తాత్కాలిక వంతెన నిర్మించడంతో రాకపోకలు కొనసాగాయి. కూటమి ప్రభుత్వంలోనైనా వంతెనలు నిర్మాణాలు పూర్తిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై చౌడేపల్లె పీఐయూ ఇన్‌ఛార్జి డీఈఈ కరుణాకర్‌ను వివరణ కోరగా.. పెద్దఉప్పరపల్లె సమీపంలో గార్గేయనదిపై రెడ్డివారిపల్లె, బసవపల్లె మార్గంలో వంతెనలు నిర్మించేందుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

# ఉపాధిలో 2025 మార్కు

అనంతపురం : వైకాపా హయాంలో ఐదేళ్లుగా సంక్షేమ శాఖలు నిర్వీర్యం అయ్యాయి. ఒక్కపైసా ఇవ్వకపోగా గతంలో ఇచ్చిన రుణాల వసూళ్లకే పరిమితం అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే సంక్షేమ శాఖలకు సరికొత్త జవసత్వాలు తీసుకొస్తున్నారు. 50 శాతం రాయితీతో రుణాలు అందించి చిన్న చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ఊతం ఇవ్వాలని నిర్ణయించారు. ఆయా వర్గాలకు ముందుగానే సంక్రాంతి పండగ వచ్చింది. 2025 సంవత్సరంలో జిల్లాకు సరిగ్గా 2025 యూనిట్లు మంజూరు చేయడం చేశారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకొని దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలోనే బీసీ, అగ్రవర్ణాల పేదలు (ఈబీసీ)లకు ఆయా మండలాలు, పురపాలికల్లో ఉన్న వారికి రుణాలు ఇవ్వడానికి లక్ష్యాలను నిర్దేశిస్తూ నిధులను సైతం కేటాయించారు. ఇష్టమైన రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందడానికి రాయితీ రుణాలు అందజేస్తారు.



ఓబీఎమ్ఎమ్ఎస్‌లో దరఖాస్తుకు అవకాశం- సుబ్రహ్మణ్యం, వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం సంచాలకులు ఆయా వర్గాల వారు ఓబీఎమ్ఎమ్ఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. జిల్లాలోని 13 బ్యాంకుల బ్రాంచిల ద్వారా రుణాలు ఇస్తారు. ప్రతి యూనిట్‌కు రూ.5 లక్షల రుణంలో బ్యాంకు లోను 50 శాతం, రాయితీ 50 శాతం ఉంటుంది. జెనరిక్ మెడికల్ షాపులకు మాత్రం నిరుద్యోగులకు రూ.8 లక్షల రుణంలో రూ.4 లక్షలు రాయితీ, రూ.4 లక్షలు బ్యాంకు రుణం ఇస్తారు. ఇంకా వెబ్‌సైట్ పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఒకటి రెండ్రోజుల్లో షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంటుంది.

# మొక్కజొన్నకు 'కత్తెర' పురుగు దెబ్బ

పుట్టపర్తి : నల్లమాడ మండలం బసంవారిపల్లి గ్రామానికి చెందిన రైతు జనార్దన్ 5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. పెట్టుబడి రూ.50 వేలు పెట్టారు. పంటకు కత్తెర పురుగు సోకడంతో నివారణకు రెండుసార్లు రసాయన మందులు పిచికారీ చేశారు. నియంత్రణ కాకపోవడంతో.. చేసేదిలేక పాడిపశువులకు గ్రాసంగా వినియోగిస్తున్నారు. ఎంతో ఆశతో పంట సాగు చేస్తే చివరికి నష్టం మూటగట్టుకున్నట్లు రైతు వాపోయారు.మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు బెడద అధికమైంది. మందులు పిచికారీ చేసినా నియంత్రణ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది పంటను వదిలేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3,534 హెక్టార్లు కాగా 1,585 హెక్టార్లలో పంట సాగు చేశారు. మొక్కజొన్నకు మార్కెట్లో ధర ఉండటం, చెరువుల్లోకి ఇటీవల నీరు చేరడంతో బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. దాంతో పంట సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం పూత, కంకి దశలో ఉంది. కొన్ని రోజుల కిందట వాతావరణం ముసురుకోవడంతో కత్తెర పురుగు ఉద్ధృతి పెరిగింది. పూత, కంకిదశలో తీవ్రంగా నష్టం కలిగిస్తోంది.

**పెరిగిన పెట్టుబడి** ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగుకు పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. కత్తెర పురుగు నివారణకు రెండు, మూడుసార్లు మందు పిచికారీ చేసేందుకు అదనంగా రూ.10 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. రైతులు పంటలో కత్తెర పురుగును గుర్తించిన వెంటనే ఇమామిథిన్ బెంజోయేట మందు చల్లితే తగ్గుముఖం పడుతుందని వ్యవసాయాధికారి రామబ్రహ్మం తెలిపారు.

# అపూర్వ తోడ్పాటు..

ఏర్పేడు : వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు. అక్కడే చదివారు. కష్టపడి చదివితే వాటి ఫలితాలు ఎలా ఉంటాయో ఇంకా బాగా తెలుసు. జీవితంలో ఎవరికైనా విద్యార్థి దశ మధురానుభూతులు పంచుతోంది. ఇటీవల వివిధ ప్రాంతాల్లో పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు నిర్వహించి తమ పాత అనుభవాలు నెమరేసుకున్నారు. అంతటితో ఆగకుండా సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టిసారించి తమ పాఠశాలకు లేదా తమ గ్రామానికి ఏదైనా మంచి పనిచేయాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఆ మేరకు కొన్నిచోట్ల కార్యాచరణ కూడా చేసి స్ఫూర్తి దాతలుగా నిలిచారు.

**పాఠశాలను మర్చిపోకూడదని...**

ఉన్న ఊరిని, కన్నతల్లిని, చదివిన పాఠశాలని మర్చిపోకూడదంటారు. అలా చౌడేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన వారు రాష్ట్రస్థాయి అధికారులుగా పేరొందారు. 1986-87 విద్యాసంవత్సరానికి చెందిన 100మంది విద్యార్థులు కలుసుకుని తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీ, ముఖద్వారం అవసరమని గుర్తించారు. దీంతో స్వచ్ఛంధగా రూ.8.5లక్షలు పోగు చేసి ఆ పనులు పూర్తి చేశారు. అలాగే విద్యార్థులకు సురక్షిత నీరందించాలని 1984-85బ్యాచ్ విద్యార్థులు శుద్ధినీటి యంత్రాన్ని అందించారు. చారాల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యాసంవత్సరం విద్యార్థులు బస్‌షెల్టర్ నిర్మిస్తున్నారు.

పుంగనూరు పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్లు ఏర్పాటు చేశారు. పులిచెర్ల మండలంలోని మంగళంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-1986 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సుమారు రూ.2లక్షలు వెచ్చించి సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.20లక్షల వ్యయంతో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తదితర వసతులు ఏర్పాటు చేశారు.

పెనుమూరు పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు రూ.5 లక్షలు పైగా వెచ్చించి సమావేశాలు నిర్వహించేందుకు వేదిక నిర్మించారు.

# నాడు వేధింపులు.. నేడు దక్కని ఊరడింపు




హిందూపురం : వారు ఏ పార్టీ కార్యకర్తలు కాదు.. మూడు దశాబ్దాలుగా హిందూపురం పట్టణంలో గుత్తేదారులుగా పని చేస్తున్నారు. 2014-19లో తెదేపా హాయంలో పలు పనులు చేశారు. వాటికి గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిందని, తమ బిల్లులు వస్తాయని గుత్తేదారులు ఆశించారు. ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బిల్లులు రాకపోవడం, అప్పులు, వాటి మీద వడ్డీలు పెరిగిపోయి, పలువురు గుత్తేదారులు ఉన్న ఆస్తులను అమ్ముకొన్నారు. మరి కొందరు ఈ రంగాన్ని వదిలేసి, ఇతరత్రా పనులు చేసుకొంటున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆరేళ్ల కిందట పూర్తి చేశారు. బిల్లులు చెల్లించకపోయినా, పాత భవనం కూలిపోయే స్థితిలో ఉండటంతో అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. బిల్లుల రాక అప్పుల పాలయ్యాయమని గుత్తేదారు వాపోతున్నారు. పట్టణంలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో ఉండటంతో జామీయా మసీదు అభివృద్ధి కోసం రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారు పనులు పూర్తి చేసినా బిల్లుల చెల్లింపు జరగలేదు. కోర్టుకు వెళ్లినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఎంజీఎం మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. గుత్తేదారు రూ.30 లక్షలు విలువైన పనులు చేసి నిలిపేశారు. గత ఐదేళ్ల రూపాయి మంజూరు కాలేదు.

హిందూపురం గ్రామీణ మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలు అభివృద్ధి పనులు చేశారు. వీటికి సంబంధించి రూ.కోటి బకాయి రావాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం -శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**

బిల్లులు రాకపోవడంతో మున్సిపాల్టీలో ప్రస్తుతం పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిల విషయాన్ని ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లాం. పెద్ద మొత్తంలో బిల్లులు కావడంతో ఉన్నత స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. తప్పకుండా న్యాయం జరుగుతుంది.

# తూకాల్లో నొక్కేస్తూ దర్జాగా అమ్మేస్తూ



కదిరి : ధర్మవరంలోని పౌరసరఫరాల గోదాముల నుంచి చౌక దుకాణాలకు సరఫరా చేసే 50 కిలోల బియ్యం బస్తాను పరిశీలించగా.. 46.490 కిలోలు మాత్రమే తూగింది. వీటినే చౌక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా అయితే డీలర్లు లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేస్తారో చెప్పాల్సిన అవసరం లేదు. కదిరిలోని ఓ వార్డులో ఎండీయూ వాహనంలో తూకంపై గోనె సంచులు పెట్టి బియ్యం పంపిణీ చేస్తున్నారు. 20 కిలోలకు 1.5 కిలోలు, 15, 10 కిలోలకు కిలో తక్కువగా బియ్యం లబ్ధిదారులకు అందిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఓడీసీ మండల కేంద్రంలోని నాలుగు చౌక దుకాణాల్లో 20 కిలోలకు కిలో, 15, 10 కిలోలకు అర కిలో రాయి పెట్టి బియ్యాన్ని వినియోగదారులకు అందిస్తున్నారు. నాలుగు నెలలుగా ఇలా జరుగుతున్నా.. అధికారులు కన్నెత్తి చూసిన పాపనపోలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో నిత్యావసర వస్తువుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి ప్రతి నెలా కిలో బియ్యాన్ని నొక్కేస్తున్నారు. తూకం యంత్రాల్లో కిలో రాయి లేదా ఖాళీ గోనె సంచులు పెట్టి బియ్యాన్ని కొలుస్తున్నారు. ఈ వ్యవహారం బహిరంగంగానే జరుగుతున్నా.. అక్రమాలపై చర్యలకు అధికారులు వెనకాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు ప్రశ్నిస్తే గోదాముల నుంచి తక్కువ తూకాలతో వస్తున్నాయని, అందుకే కోత విధించి సరఫరా చేస్తున్నామని డీలర్లు చెబుతున్నారు. గోదాముల్లో నిల్వలలో తేడా, డీలర్లకు పంపే బియ్యం బరువుల్లో వ్యత్యాసం ఉన్నప్పటికీ పట్టించుకునే నాథులే కరవయ్యారు.

**బియ్యానికి బదులు డబ్బులు..**

తూకాల్లో మోసం చేసి సేకరించిన బియ్యాన్ని డీలర్లు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల లబ్ధిదారులు బియ్యం బదులు డబ్బులు తీసుకుంటున్నారు. డీలర్లు కిలోకు రూ.10-12 ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా సేకరించిన బియ్యాన్ని కర్ణాటకలోని మిల్లులకు తరలిస్తున్నారు. పుట్టపర్తి, కదిరి పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఓడీసీ, అమడగూరు, చిలమత్తూరు, అమరాపురం, గోరంట్ల మీదుగా అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దు దాటించేస్తున్నారు. అక్కడి మిల్లుల్లో సన్న బియ్యంగా మార్చి తిరిగి ఇక్కడికే సరఫరా చేస్తున్నారు.

**తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం - వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌వో**

బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాం. తూకాల్లో మోసంపై ఎవరినీ ఉపేక్షించేది లేదు. తనిఖీలు చేసి డీలర్లకు నోటీసులు జారీ చేస్తున్నాం. గోదాముల నుంచి చౌక దుకాణాలకు బియ్యం తూకాలు తక్కువగా రావడంతో కొన్ని చోట్ల డీలర్లు సంచి పెట్టి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# మన్ను నిండింది నీరు ఆగింది



నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా తుంగభద్ర, కృష్ణ, హంద్రీ నదులు పారుతున్నాయి..ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే కాల్వలు ఉన్నాయి.. వాటిలో గత ఐదేళ్లుగా పూడిక తీయలేదు నిర్వహణ చేపట్టలేదు. గడ్డి, జమ్ము, ముళ్లపొదలు పెరగడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. గతేడాది ప్రధాన కాల్వల్లో కొన్నిచోట్ల జంగిల్ క్లియరెన్స్( ముళ్లపొదలు) చేసి వదిలేశారు.. ఎక్కడా పూడికతీత పనులు చేపట్టలేదు. పూడిక తొలగించి సమస్య పరిష్కరించాలని ఆయకట్టు రైతులు అర్థించినా పట్టించుకోలేదు. ఉపాధి హామీ కింద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టడానికి అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. పైగా కొన్నిచోట్ల పూడిక తొలగించామంటూ దొంగ బిల్లులు పెట్టి నిధులు కూటమి ప్రభుత్వమైనా ఉపాధి హామీ నిధులతో సాగునీటి కాల్వలు బాగు చేయాలని కర్షకులు కోరుతున్నారు.

**పంట కాల్వలు అస్తవ్యస్తం**

నిర్వహణ లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పంట కాల్వలు అధ్వానంగా మారాయి. పూడికతో పేరుకుపోవడంతోపాటు గడ్డి, ముళ్లపొదలు విపరీతంగా పెరిగాయి. కాల్వల గట్లు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల కాల్వలు ఆనవాళ్లు కోల్పోయాయి.తెలుగుగంగ, హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలకు సంబంధించి చాలా ఏళ్లుగా పూడికతీత పనులకు ప్రతిపాదనలే లేవు.పాణ్యం, బనగానపల్లి, సంజామల మండలాల్లోని ఎస్సార్బీసీ కాల్వలు పూడిపోవడంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లి మండలంలోని యనకండ్ల, కైప, అప్పలాపురం, పాణ్యం మండంలోని భూపనపాడు, ఆలమూరు గ్రామాల పరిధిలో పెద్ద ఎత్తున పూడిక చేరింది.

గోనెగండ్ల, ఆస్పరి, చిప్పగిరి, కోసిగి, మంత్రాలయం మండలాల్లోని ఎల్ఎల్‌సీ పంట కాల్వల్లో పెద్దఎత్తున పూడిక పేరుకుపోయింది.

కేసీ కాల్వకు సంబంధించి బనకచర్ల నుంచి సంతజూటూరు వరకు వివిధ ప్రాంతాల్లో కాల్వల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. సాగునీరు ముందుకు సాగడం లేదు.

రుద్రవరం, మహానంది, చాగలమర్రి, బండిఆత్మకూరు మండలాల్లో చాలాచోట్ల తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని పంట కాల్వలు శిథిలమయ్యాయి. 12 నుంచి 17వ బ్లాక్ మధ్య పూడిక పేరుకుపోయింది. ఉపాధి హామీ నిధుల కింద రూ.కోట్లు వెచ్చిస్తున్నారు.. వాటిని సాగు నీటి కాల్వల బాగుకు ఉపయోగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు సూచిస్తున్నారు.

**నీటి తీరువా రూ.కోట్లు**

నిబంధనల మేరకు రైతులు ప్రాజెక్టుల వారీగా చెల్లించే నీటి తీరువాతో సాగునీటి కాల్వల అభివృద్ధి పనులు చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలోని తెలుగుగంగ, కేసీ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్, ఎల్ఎల్‌సీ ప్రాజెక్టుల పరిధిలో సుమారు రూ.8 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

# 'పట్టు'తప్పుతోంది

పలమనేరు : టమాటా రైతులు ఒకవైపు ధరలు లేక పండించిన పంటను రోడ్లమీద పడేసి పోతున్నారు. ఇప్పుడు పట్టు రైతుల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ధరలు ఉన్నా.. పంట రావటం లేదు. మంచు కారణంగా మల్బరీ ఆకు పండటం లేదు. దాంతో పురుగులు పెంచడానికి ఆకులు లేక పట్టుగూళ్ల ఉత్పత్తి పడిపోయింది. ధరలేమో ఆశాజనకంగా ఉండటంతో ఒకరిద్దరు రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. పలమనేరు ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ రెండుమూడు రోజులగా రైతులు, వ్యాపారులు లేక వెలవెలబోతోంది. ఇక్కడ 25 వేల హెక్టార్లలో పంటను పండిస్తుంటే నిత్యం 5 నుంచి 10 టన్నుల పట్టు గూళ్లు మార్కెట్‌కు వచ్చేవి. ప్రస్తుతం అరటన్ను కూడా రావడంలేదు. వచ్చిన రైతులు తమ గూళ్లను విక్రయించి వెళ్లిపోతున్నారు. దాంతో మార్కెట్ ఉదయం 11 గంటలకే మూసేస్తున్నారు. ఇప్పుడు కిలో ధర రూ.600 పలుకుతోంది. అదే ధర గతంలో రూ.200 కూడా పలకలేదు. ఇలా ధరలుంటే పంటలేక.. పంటలుంటే ధరల్లేక రైతులు వాణిజ్య వైకుంఠపాళిలో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు.



**ప్రోత్సాహకం రాలేదు**

ప్రభుత్వం పట్టు రైతులకు ధరలు లేని సమయంలో కిలోకు రూ.50 ప్రోత్సాహక నగదు ఇచ్చేది. అయితే గత ప్రభుత్వంలో దాదాపు జిల్లా వ్యాప్తంగా రూ.12 కోట్ల వరకు ఈ మొత్తం బకాయి నిలిచిపోయింది. అప్పట్లో ధరలు పెద్దగా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటీవల గంగవరం మండల కేంద్రంలో పట్టు రైతుల సమ్మేళనం నిర్వహిస్తే రైతులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇన్సెంటివ్, షెడ్ల నిర్మాణానికి రాయితీలు ఇవ్వాలని కోరారు.

**రాయితీల అంశం పరిశీలనలో ఉంది**

ఇలా మంచు కాలంలో కొంత వరకు పంట మార్కెట్‌కు రాదు. తరువాత కొంత కాలానికి అంతా కుదురుకుంటుంది. యథాతథంగా పంట మార్కెట్‌కు వస్తుంది. ఇన్‌సెంటివ్ విషయం కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. కిశోర్‌నాయక్, ఏడీ, పట్టుపరిశ్రమ, పలమనేరు

# ఎరువుల కొరత ధరల మోత

నంద్యాల : జిల్లాలోని సహకార సంఘాలతో పాటు ఆగ్రోస్ కేంద్రాల్లో అవసరమైన ఎరువులు అందుబాటులో లేవు. రైతులకు మరో మార్గం లేక ప్రైవేటు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తున్నారు. కోవెలకుంట్ల, డోన్, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లోని మండలాల్లో ఎరువులు లభించడం లేదు. మార్క్‌ఫెడ్‌లో తగిన నిల్వలు లేకపోవడంతో సహకార సంఘాలకు సరఫరా కావడం లేదు. ఒక రైతుకు టన్ను యూరియా అవసరమైతే రూ.2 వేల విలువైన కాంప్లెక్స్ ఎరువులు అదనంగా కొనుగోలు



చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

**యథేచ్ఛగా దోపిడీ**

జిల్లాకు వచ్చే ఎరువుల్లో 50 శాతం ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌లు, మార్క్‌ఫెడ్‌లకు కేటాయిస్తారు. మిగిలిన 50 శాతం ఎరువులను హెూల్‌సేల్ పంపిణీదారులకు కేటాయిస్తారు. హెూల్‌సేల్ పంపిణీదారుల నుంచి డీలర్లు, రిటైలర్లకు సరఫరా అవుతాయి. ప్రభుత్వరంగ సంస్థలకు ఇచ్చే ఎరువులకు ఆయా సంస్థలే రవాణా ఛార్జీలు చెల్లిస్తాయి. మిగతా వారికి ఇచ్చే దానికి మాత్రమే కొంతమేర ఛార్జీలు వసూలు చేస్తారు.ప్రస్తుతం యూరియా ఎమ్మార్పీ ధర రూ.266.50 ఉండగా ఎరువుల దుకాణదారులు రూ.290 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.డీఏపీ ఎమ్మార్పీ ధర రూ.1350 ఉండగా రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. రవాణా ఛార్జీల పేరుతో మండల కేంద్రాలు, గ్రామాల్లో మరో రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా దండుకుంటున్నారు.

# ఫలరాజుపై పగమంచు

డోన్: ఫలరాజుపై 'పగ'మంచు పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. పూతదశలో మంచు, చలి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. బనగానపల్లి (బెనిషాన్) మామిడి రకానికి జిల్లా ప్రసిద్ధి.. ఇక్కడి నుంచే ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా తేతాపురి, అమృతం, పెద్దరసాలు, ఆచారి, మలగువా రకాలూ సాగు చేస్తున్నారు. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లోనే పూత వస్తుంది.. ఫిబ్రవరి, మార్చినెలల్లో పిందెలు ఏర్పడి ఏప్రిల్, మే నెలల్లో కాపు రావాలి. ఈ ఏడాది సంక్రాంతి వచ్చినా పూత జాడే కన్పించడం లేదు. పూత వచ్చినా పురుగులు, తెగుళ్లబెడద అధికమై రాలిపోతోంది. **పెట్టుబడి అధనం**" ప్రస్తుతం చలి ప్రభావంతో పూత రావడం కొంత ఆలస్యం అవుతుంది. పూత వచ్చే పరిస్థితుల్లో మొగ్గదశ, పచ్చిపూతదశ, నల్లపూత, పిందె దశల్లో రైతులు మందులు పిచికారీ చేయాలి. తామర, తేనెమంచు, లద్దె పురుగులు మొగ్గలు, పూత దశలో నష్టం చేకూర్చే అవకాశం ఉంటుంది. వీటికి సరైన సమయంలో మందులు పిచికారీ చేయాలని" ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు పేర్కొన్నారు." ఆరెకరాల మామిడి తోటను కౌలుకు తీసుకున్నా. కొన్ని చెట్లకే పూత వచ్చింది.

# ఆధునిక యంత్రాలకు తుప్పు

గుంతకల్లు : గుంతకల్లు పురపాలికలో పారిశుద్ధ్య పనులు చేయడానికి గతంలో తెదేపా ప్రభుత్వం అధునాతన యంత్రాలు కొనుగోలు చేసింది. వీటిని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మూలకు చేర్చింది. ఫలితంగా రూ.2 కోట్లు విలువల చేసే యంత్రసామగ్రి తుప్పుపడుతోంది. వీటి ద్వారా రహదారులు, మురుగు కాలువలు, పిచ్చి మొక్కల తొలగింపు, రోడ్లను చదును చేయడం వంటి పనులను వేగంగా చేయడానికి అవకాశం ఉంటుంది. అప్పటి ప్రభుత్వం స్వచ్ఛాంధ్రప్రదేశ్ పథకం కింద కేటాయించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉంది.

**పురపాలికలో ఇదీ పరిస్థితి**

పారిశుద్ధ్య పనులకు వినియోగించే యంత్రాలు పురపాలిక కార్యాలయ ఆవరణ, మండీబజార్‌లోని ఉపరితల నీటి ట్యాంకుల ఆవరణలో వృథా పడి ఉన్నాయి. వాటిని నడపడానికి అధికారులు చోదకులను నియమించక పోవడంతో కొనుగోలు చేసిన యంత్రాలు ప్రస్తుతం



చిలుం పట్టి పాడైపోతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులను ఎక్కువ మందిని నియమించుకుని వారికి జీతాలు ఇవ్వడానికి రూ. కోట్లు ఖర్చు చేసే అవసరం లేకుండా ఉండటానికి గతంలో యంత్రాలను కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటిని ఉపయోగించడం లేదు.

**అనవసర ఖర్చులు అదనం**

కాలువల్లోని మట్టిని తొలగించడానికి ఏటా రూ. 50 లక్షలకు పైన ఖర్చు పెడుతున్నారు. అదనంగా కార్మికులను నియమించుకుని వారికి జీతాలను చెల్లించడానికి ఏటా రూ.2 కోట్లకు పైన నిధులు వ్యయం చేస్తున్నారు. వ్యయాన్ని తగ్గించుకోవడానికి, రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయడానికి కేటాయించిన యంత్రాలను వినియోగంలోకి తేవాలని, ఆదా అయ్యే నిధులు అభివృద్ధికి ఖర్చు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**యంత్రాలను వాడుకలోకి తెస్తాం - నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్**

యంత్రాలను వృథాగా ఉంచడం వల్ల అవి కొంత దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. యంత్రాల్లో ఒకదానికి మరమ్మతులు చేయించాం. చోదకులను నియమించి వాటి ద్వారా పట్టణంలో పారిశుద్ధ్య పనులను చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

# కుళాయి కనెక్షన్ల పేరుతో అక్రమ వసూళ్లు

గుత్తి : ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని పురపాలకలోని ఓ అధికారి ప్రైవేట్ కుళాయి కనెక్షన్లపేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. వేసవి రాబోతుండటంతో ప్రజలు ప్రైవేట్ కుళాయి కనెక్షన్ల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని అవినీతికి తెరతీశారు. గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగన పల్లిలో మొత్తం 6,300 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ 10-15 రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఇది వరకు 30 రోజులకోసారి కుళాయిలకు నీరు వచ్చేది. అధికారులు పవర్‌బోర్ల నుంచి ప్రజలకు కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. దీంతోపాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.



గుత్తి చెరువులో నీరు ఉండటం వల్ల బోర్లలో నీటి లభ్యత పెరిగింది. దీంతో తాగునీటి సమస్య కొంత వరకు తగ్గుతోంది. పురపాలికలో ప్రజా కుళాయిలు కనుమరుగు అవుతున్నారు. పురపాలికలో కేవలం 200 ప్రజాకుళాయిలు ఉన్నాయి. ప్రజలు ప్రైవేట్ కుళాయి కనెక్షన్లకు పోటీపడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఓ అధికారి లంచావతారం ఎత్తారు. ప్రజల డిమాండును సొమ్ము చేసుకుంటున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

ఇటీవల బండగేరి, బెస్తగేరిలలో రూ.6.50 లక్షలతో పురపాలిక అధికారులు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఇదే అదునుగా భావించిన అధికారి పైపులైన్ వేస్తున్నాం. ఎవరికైనా కుళాయి కనెక్షన్ కావాలంటే తీసుకోవాలన్నారు. పైపులైన్ పూర్తయిన తరువాత కనెక్షన్లు ఇచ్చేందుకు కుదరదని చెప్పడంతో ప్రజలు ముందుకొచ్చారు. రూ.600 లోపు ఆస్తిపన్ను ఉన్నవారికి కేవలం రూ.2,500కు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ఆ అధికారి మాత్రం రూ.6వేలు వసూలు చేస్తున్నారు. రెండు కాలనీల్లో 60 కనెక్షన్లు ఇచ్చారు. పురపాలికకు రూ.1.50లక్షలు చెల్లించి మిగిలిన రూ.2.10లక్షలు జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**అధికారే రంగంలోకి దిగి దోపిడీ**

పేదలకు రూ.2,500కే కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా అధికారే రూ.6 వేలు వసూలు చేస్తున్నట్లు కౌన్సిలర్ ఫరూక్ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీశారు. కనెక్షన్లు తీసుకున్న వారికి రసీదులు ఇవ్వకుండా జాగ్రత్త పడ్డారు. రెండేళ్ల కిందట అప్పటి కొందరు కౌన్సిలర్లు ప్రజల నుంచి అక్రమంగా కనెక్షన్లకు డబ్బులు వసూలు చేసుకుని స్వాహా చేశారు. ఇప్పుడు అధికారులే అక్రమాలకు తెరలేపడం వివాదాస్పదంగా మారింది. దీనిపై కమిషనర్ జబ్బార్‌మియా మాట్లాడుతూ కుళాయి కనెక్షన్లకు అధికంగా వసూలు చేశారన్న ఆరోపణలపై విచారిస్తామన్నారు. రూ.600లోపు ఆస్తిపన్ను ఉంటే రూ.2,500కే కనెక్షన్లు ఇస్తామన్నారు.

# ఇళ్లు కాదు.. ఊళ్లు అన్నారు.. రూ. కోట్లు కొల్లగొట్టారు



కర్నూలు : పేదలందరికీ ఇళ్ల స్థలాలు అంటూ వైకాపా హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా భూములు సేకరించారు. ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో 143 గ్రామాల్లో 1,034.85 ఎకరాలకు రూ.153.43 కోట్లు వెచ్చించారు. చాలాచోట్ల ఊరికి దూరంగా కొండ ప్రాంతాలను ఎంపిక చేశారు. ముందస్తుగానే వైకాపా నేతలు కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయించారు. భూసేకరణపై అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జగనన్న కాలనీల్లో 'భూ'దందాపై విజిలెన్స్ బృందం ప్రాథమిక విచారణ చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. బీడు భూములు కారుచౌకగా కొనుగోలు చేసి లక్షలాది రూపాయలు జేబులో వేసుకొన్నట్లు.. అందుకు రెవెన్యూ అధికారులు సహకరించినట్లు ప్రాథమిక అంచనాకొచ్చారు.

**ఆదోనిలో ఆరగించారు**

ఆదోని మండలంలో చాలా చోట్ల ఎకరా రూ.6 లక్షలు, మరికొన్నిచోట్ల రూ.6.50 లక్షలు, మండగేరిలో రూ.13.50 లక్షల వరకు భూసేకరణకు చెల్లించారు. అక్కడ గతంలో పనిచేసిన తహసీల్దారు, వైకాపా నేతలు కుమ్మక్కై తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికే అధిక ధరలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**నందికొట్కూరులో నయా దందా**

నందికొట్కూరు పట్టణ పరిధిలో 208/ఏ1, ఏ2, బి2, 207, 84, 73, 75, 72 తదితర సర్వే నంబర్లలో సుమారు 25 నుంచి 30 ఎకరాలు సేకరించారు. 2020లో ఇక్కడ మార్కెట్ విలువ ఎకరా రూ.8-10 లక్షలు ఉండేది. కానీ ఎకరాకు రూ.25 లక్షల వరకు చెల్లించారు. పగిడ్యాలలో ఎకరా మార్కెట్ ధర ప్రకారం రూ.5-6 లక్షలు ఉండగా.. ఎకరా ఏకంగా రూ.13.50 లక్షల చొప్పున భూసేకరణ చేయడం గమనార్హం.

తాత్కాలిక నీటి సరఫరాకు కర్నూలు జిల్లాలో రూ.20.10 కోట్లు, నంద్యాలో రూ.9.95 కోట్లు వెచ్చించారు. విద్యుద్దీకరణ పేరుతో రూ.లక్షలు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రూ.6 కోట్లు పంచుకొన్నారు**

కర్నూలు మండలం పి.రుద్రవరం. నగరానికి 16 కి.మీ ఉంటుంది. అక్కడ 430 ఎకరాలు సేకరించారు. అందులో 54 ఎకరాలు ప్రభుత్వ భూమి.. మిగిలింది డి.పట్టా. అంతా కొండ ప్రాంతం.. అయినా భూసేకరణకు ఎకరా రూ.18 లక్షల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. వైకాపా నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి పర్సంటేజీల రూపంలో సుమారు రూ.6 కోట్ల వరకు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.కోట్లు వెచ్చించి భూములు చదును చేయించి ప్లాట్లు వేసి 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించారు. ఏళ్లు గడిచినా ఒక్క ఇంటికి కూడా పునాది రాయి పడలేదు.

**మంచాలలో ముంచారు**

మంత్రాలయం మండలం మంచాలలో సర్వే నంబరు 335/1లో 4.89 ఎకరాలు 2020లో సేకరించారు. 478 మందికి పట్టాలు ఇచ్చారు. అక్కడ ఎకరా రూ.10-15 లక్షలు పలకడమే గగనం. అలాంటిది ఎకరాకు రూ.25-30 లక్షలు చెల్లించారు. వైకాపా నేతలు చెప్పిన ధరకే రెవెన్యూ అధికారులు తలూపినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూసేకరణకు రూ.1.30 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ.3.49 కోట్లు వెచ్చించారు. మూడేళ్లలో ఇళ్లు పూర్తయ్యింది కేవలం 55 మాత్రమే.

**ధొర్నిపాడులో దోచారు**

దొర్నిపాడు మండల కేంద్రంలో ఎకరా రూ.24 లక్షల చొప్పున 2.04 ఎకరాలను కొనుగోలు చేశారు. గుండుపాపలలో ఎకరా రూ.15.60 లక్షల చొప్పున 1.18 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ మండలం జిల్లా కేంద్రానికి చివరన ఉంటుంది. అప్పటి మార్కెట్ ధర ప్రకారం అక్కడ ఎకరా రూ.10 లక్షలు కూడా లేదు. వైకాపా నేతలు పెత్తనం చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉన్నాయంటూ అధికారులను నమ్మించారు. భూసేకరణ డబ్బులు రాగానే బాధితుల వద్ద కమీషన్లు తీసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఇక్కడ అదే పరిస్థితి**

ఆలూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన భూములకు ఎకరాకు రూ.5.38 లక్షల పరిహారం అందించారు. పత్తికొండలో పెద్దగా విలువ లేకపోయినా ఎకరాకు రూ.9 లక్షలు ముట్టజెప్పారు. ఆళ్లగడ్డలో సర్వే నంబర్లు 285/2, 286లో 1.49 ఎకరాలకు రూ.50 లక్షల వరకు చెల్లించారు. పాత కందుకూరు, జమ్మాలుదిన్నెలో రూ.14 లక్షలు, పేరాయిపల్లెలో రూ.14 లక్షలు, బత్తలూరులో రూ.20 లక్షలు, ఎస్.లింగందిన్నెలో ఎకరా రూ.16 లక్షలు వెచ్చించి భూసేకరణ చేశారు. చాగలమర్రి మండలం గొడిగెనూరు, తోడెండ్లపల్లె తదితర ప్రాంతాల్లో ఎకరా రూ.13 లక్షలు, డోన్‌లో ఎకరాకు రూ.15 లక్షలు, ఉడుములపాడులో ఎకరా రూ.7 లక్షల చొప్పున డబ్బులు చెల్లించి భూమి సేకరించారు.

# కాల్వ కూలింది.. కాడితప్పింది

ఎమ్మిగనూరు : పశ్చిమ ప్రాంత పల్లెలకు జీవనాడి తుంగభద్రమ్మ.. లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే దిగువ కాల్వ (ఎల్లెల్సీ) పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కాల్వలు, షట్టర్లు అధ్వానంగా మారడంతో పొలాలకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. షట్టర్లు పూర్తిగా విరిగిపోయాయి. రైతులే ఇసుక సంచులు, బండరాళ్లు అడ్డుపెడుతున్నారు. ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు నుంచి గోనెగండ్ల వరకు 22 కి.మీ. మేర నీరు ముందుకెళ్లాలి. సుమారు 18 కి.మీ. మేర కాల్వకు లైనింగ్ లేక సాగునీరు ముందుకు పారటం లేదు. 210 క్యూసెక్కుల నీరు పారాల్సిన చోట 160 క్యూసెక్కులకే పరిమితమైంది. కాల్వ కింద 10 వేల ఎకరాలకు నీరు పారాల్సి ఉండగా.. కొన్ని డిస్ట్రిబ్యూటరీలకు అందడం లేదు.

ఆయకట్టు : 1,51,134 (రబీ, ఖరీఫ్) హెక్టార్లు (ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు తదితర మండలాలు)
కాలువలో పారాల్సిన నీరు : 724 క్యూసెక్కులు
సాగునీటి వాటా: 24 టీఎంసీలు
కాల్వ పొడవు: 127 కి.మీ.
డిస్ట్రిబ్యూటరీలు : 15
పిల్లకాల్వలు : 310

282.315 కి.మీ నుంచి 305 కి.మీ వరకు లైనింగ్ లేదు. 305 కి.మీ నుంచి 315 కి.మీ వరకు లైనింగ్ శిథిలావస్థకు చేరింది. ప్రధాన కాల్వ 45 కి.మీ, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 105 కి.మీ., పిల్ల కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు.

ఖరీఫ్‌లో ఆగస్టు నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు, రబీలో డిసెంబరు 15 నుంచి మార్చి 31వ తేదీ వరకు నీటిని అందించాలి. గోనెగండ్ల మండలం కులుమాల వద్ద షట్టర్ దుస్థితి.. ఈ కాల్వ కింద మూడు వందల ఎకరాల ఆయకట్టు ఉంది. షట్టర్ పరిస్థితి అధ్వానంగా ఉండటంతో సాగునీటికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రైతుల మధ్య గొడవలకు దారి తీస్తోంది. **ప్రస్తుత ప్రభుత్వం ఆదుకోవాలి : మబాషా, గోనెగండ్ల**తుంగభద్ర దిగువ కాల్వపై ఆధారపడి ఎన్నో రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాల్వలు శిథిలావస్థకు చేరాయి. షట్టర్లు లేక రాళ్లు, ఇసుక సంచులు అడ్డుగా పెడుతున్నాం. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి షట్టర్లు బిగించాలి.. పంట కాల్వలు బాగు చేయాలి. **ప్రతిపాదనలు పంపాం : విద్యాసాగర్, డీఈ, ఎమ్మిగనూరు** ఎల్ఎల్‌సీ కాల్వపై దెబ్బతిన్న షట్టర్ల దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఆదేశాలు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

# ఉప్పుటేరు ప్రక్షాళనకు కదలిక

కైకలూరు : 'ఉప్పుటేరు కుదించుకుపోయింది. 12 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కలిగిన ఉప్పుటేరు 6 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో వరదల సమయంలో కొల్లేరు పరీవాహక ప్రాంతం పూర్తిగా ముంపు బారిన పడుతోంది. ఇటీవల బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా కైకలూరు, కలిదిండి, ఉండి నియోజకవర్గాలు ముంపునకు గురయ్యాయి. ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపే దీనికి శాశ్వత మార్గం' కనుమూరి రఘురామకృష్ణ రాజు, ఏపీ ఉప సభాపతి, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, కైకలూరు

మూడు జిల్లాల పరిధిలో ప్రవహించే ఉప్పుటేరును ఆక్రమణ చెర నుంచి విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం ఓ అడుగు ముందుకేసింది. ఇటీవల కైకలూరులో జిల్లా కలెక్టరు వెట్రి సెల్వి అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పుటేరు సంరక్షణ ద్వారా కొల్లేరు పరిరక్షణకు బాటలు వేస్తామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీలోగా ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇది సాకారమైతే.. కొల్లేరు సంరక్షణకు బాటలు ఏర్పడతాయి. ఉప్పుటేరు సాగుటేరుగా మారి.. ప్రత్యక్షంగా.. పరోక్షంగా 4 లక్షల కుటుంబాలకు భరోసా ఇస్తుంది. మత్స్య సంపద వృద్ధి చెంది.. వేలాది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది.

**1400 ఎకరాలకుపైగా ఆక్రమణ?..** ఏరుకు ఓ వైపున ఏలూరు, కృష్ణా జిల్లాలు, రెండో వైపు పశ్చిమగోదావరి జిల్లా ఉన్నాయి. ఏటికి రెండు వైపులా సుమారు 1,400 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైనట్లు ప్రాథమిక అంచనా ఉంది. ఇది మరింత స్పష్టంగా తేలాలంటే.. సర్వే చేయించాల్సి ఉంది. డ్రెయినేజీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, ఈ అంశాన్ని గత పాలకులెవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణ తొలగింపు వట్టి మాటగానే మిగిలిపోయింది.



**యజ్ఞంలా భావిస్తేనే సాధ్యం**

ఉప్పుటేరుకు ఆనుకుని పేద వర్గాలకు చెందిన వాళ్లు అక్కడక్కడా చిన్నచిన్న కమతాల్లో సాగు చేసుకుంటున్నప్పటికీ.. మూడొంతుల కుపైగా భూ స్వాముల చేతుల్లోకి వెళ్లిపోయింది. కంటితుడుపు చర్యలతో ఆక్రమణలు తొలగించడం సాధ్యం కాదు. మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి.. సర్వే పేరిట సంవత్సరాలు సాగదీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏరు పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన డ్రెయినేజీ, రెవెన్యూ, పోలీసు శాఖల యంత్రాంగం ఏకతాటిపైకొచ్చి ఒత్తిళ్లు.. బెదిరింపులను ధిక్కరించి నిలబడితేనే ఉప్పుటేరు ప్రక్షాళన సాధ్యమవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రయోజనం పొందే జిల్లాలు ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి
పొడవు 60 కి.మీ.
ప్రవాహం 12 వేల క్యూసెక్కులు
ఆక్రమణలు 1,400 ఎకరాలు (సుమారు)

# పోషకాలిలా.. వద్దంటే ఎలా?

తిరుపతి : గర్భిణులు, బాలింతలు పోషకాలను నిర్లక్ష్యం చేస్తే ఆ ప్రభావం పుట్టే బిడ్డలపై పడనుందని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. అంగన్‌వాడీలు అందించే పోషకాలు తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే ప్రసవ సమయంలో రక్తహీనత సమస్యలు ఎదురవడం, బాలింతలకు శక్తి నశించడం, అలసట, అసహనం ఏర్పడి పిల్లలను సరిగా పెంచలేరు. పోషకాల్లేమీ వల్లే మాతృత్వ, శిశు మరణాలు సంభవిస్తున్నాయి.

**41.92% మందిలో రక్తహీనత**

నాయుడుపేట, కోట ప్రాంతాల్లో బరువు తక్కువగా పుట్టే శిశువుల సంఖ్య అధికంగా నమోదైంది. ఇప్పటివరకు ఉన్న 10,530 మంది గర్భిణీల్లో 41.92శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వీటిల్లోనూ గూడూరు, కోట, నాయుడుపేట ప్రాంతాల్లో తీవ్రత అధికంగా ఉంది. గూడూరుకు చెందిన ఓ బాలింత అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే ఆహారం వద్దని చిక్కీలు మాత్రమే టీచర్‌ను అడిగింది.



చిక్కీలు మాత్రమే కాకుండా అన్ని కలిపి తింటెనే పోషకాలు లభిస్తాయని ఆమె చెప్పినా వినిపించుకోలేదు. దీంతో బాలింత అడిగింది ఇచ్చి పంపించారు. చంద్రగిరికి చెందిన గర్భిణి అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారం వద్దని గుడ్లు మాత్రమే తీసుకుంటానని తెగేసి చెప్పడంతో అక్కడున్న సహాయకురాలు గుడ్లు మాత్రమే ఇచ్చింది. 'తన కోపమే తన శత్రువు' అన్నట్లు.. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోకుండా చేస్తున్న నిర్లక్ష్యమే.. వారి బిడ్డల అనారోగ్యానికి దారి తీస్తుంది. తిరుపతి జిల్లాలో చాలా మంది మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న పోషకాలను వద్దంటున్నారు. పోషకాహారాలున్నా వాటిలో గుడ్లు, చిక్కీలు మాత్రమే తీసుకునే వాళ్లు కొందరైతే.. బాలింతకు కేటాయించిన పోషకాలను ఇంటిల్లిపాది తినేవారు మరికొందరు. ఈ తరహా నిర్లక్ష్యం వల్ల గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురవుతున్నారు. ఆ ప్రభావం పుట్టే బిడ్డలపై పడుతోంది. **పోషకాహారం తప్పనిసరి** గర్భిణులు, బాలింతలు నిర్లక్ష్యం చేయకుండా అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. వారే తినాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండి, పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యం గా ఉంటారు. జయలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారి, తిరుపతి జిల్లా

# బాధితుల 'దారి'చూపులు

ఆదోని : ఆదోని పట్టణ శివారులో 167 జాతీయ రహదారి నిర్మాణం పనులు కొందరిని రోడ్డున పడేశాయి. భూములు, స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు నేటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందక పోవడం ఆందోళనకు 'దారి' తీస్తోంది. ఎన్నిలకు ముందు వైకాపా హయాంలో హడావుడిగా పనులు చేపట్టారు.. అప్పటి నుంచి అన్నీ సందేహాలే.. సమాధానం లేని ప్రశ్నలే వెంటాడుతున్నాయి. బడాబాబుల భూములొదిలేసి, పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కొనుగోలు చేసిన భూమిని కోల్పోయేలా చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నమూనా మార్చేశారు**

జాతీయ రహదారి-167 హగరి నుంచి తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల వరకు 62-700 కి.మీ. విస్తరించి ఉంది. ఆదోని శివారు మీదుగా రోడ్డు వెళ్తోంది. రహదారి నిర్మాణం పనులను వైకాపా మాజీ ప్రజాప్రతినిధికి సమీప బంధువు చేపడుతున్నారు. రోడ్డు వస్తుందన్న విషయం ముందుగా తెలుసుకొన్న వైకాపా నేతలు రహదారి చుట్టూ భూములు దక్కించుకున్నారు. వారి భూముల నుంచి కాకుండా పేదలు కొనుగోలు చేసిన స్థిరాస్తి వెంచర్ నుంచి దారి వెళ్లేలా నమూనా మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

945 మంది నుంచి భూమి సేకరించారు. భూ సేకరణకు రూ.125



కోట్లు వెచ్చించాల్సి ఉంది. 113 మంది బాధితులు పత్రాలను రెవెన్యూ అధికారులకు అందించారు.. 93 మందికి పరిహారం కింద రూ.5 కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.

6 మార్కెట్ విలువతో పోలిస్తే ఏమాత్రం సరిపోదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపోదని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు.

**బాధితులకు బెదిరింపులు**

నిజానికి 90 శాతం పరిహారం చెల్లించాకే పనులు చేయాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే.. మట్టి తరలింపు, అనుమతులేకుండా కొండలు బ్లాస్టింట్ చేస్తున్నారు. భూ బాధితులకు కొందరు ఫోన్లు చేసి.. వచ్చిన డబ్బులు తీసుకెళ్లాలని, లేదంటే మున్ముందు అవీ దక్కవని.. కోర్టు నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని అధికారిక, అనధికారిక వ్యక్తుల నుంచి నిత్యం ఫోన్లు చేసి బెదిరిస్తు న్నారు. నా పేరు శ్రీనివాసులు.. ఆర్టీసీలో చిరుద్యోగిని. సొంతింటి కలను నిజం చేసుకోవాలని, అప్పు చేసి 344-2బీ2, 340-1ఏ1ఏ 5.20 సెంట్ల స్థలం రూ.46 లక్షలకు కొనుగోలు చేశా. సర్వీసులో ఉండగా దాచుకున్న డబ్బుతో పాటు పి.ఎఫ్ మొత్తంతో పాటు బ్యాంకు రుణం తీసుకున్నా. ప్లాట్ కొనుగోలు చేసిన రెండు నెలలకే నా ప్లాటు జాతీయ రహదారి నిర్మాణంలో పోతోందని చెప్పారు. ఇప్పుడు నాకు వచ్చే పరిహారం కేవలం రూ.21 లక్షలు. నేటికీ తీసుకున్న బ్యాంకు రుణానికి వడ్డీ చెల్లిస్తున్నా.

చురకలు






# పుష్పరాజ్ కుమార్తె స్టన్నింగ్ లుక్

పావని కరణం .. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పేరు. తెలుగు ఫిలింసర్కిల్స్ లోను ఈ తెలుగమ్మాయి ప్రతిభ గురించి చర్చ సాగుతోంది. పుష్ప 1, పుష్ప 2 చిత్రాల్లో నటించిన పావని కరణం ఎంపిక చేసిన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. అసలు ఇంటి పేరుతో ఒక ఐడెంటిటీ లేని పుష్పరాజ్ కి అన్న కూతురు కావేరిగా పావని నటించింది. అంతేకాదు సొంత అన్నయ్య అజయ్.. పుష్పరాజ్ ని అవమానిస్తుంటే, చివరికి అతడిని అన్ని అవమానాల నుంచి బయట పడేసే కీలక పాత్రలో పావని కనిపించింది. పుష్ప 2 క్లైమాక్స్ ని అర్థవంతంగా ముగించేందుకు సుకుమార్ ఎంతో తెలివిగా అజయ్ కుమార్తె పాత్రను ఉపయోగించుకున్నారు. ఆ పాత్రలో అద్భుతంగా నటించింది పావని. పల్లెటూరిలో ఇంటి పేరు లేకుండా ఉంలికున్న దానికొడుకు అంటే ఆ బాధ ఎలా ఉంటుందో పల్లెల్లో నివశించే పుష్పరాజ్ లాంటి వ్యక్తులకు తెలుస్తుంది. ఆ బాధను తెరపై పండించడంలో బన్ని వందశాతం మార్కులు కొట్టేసాడు. అలాగే కీలక



సమయంలో అజయ్ కుమార్తె పై సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. అకస్మాత్తుగా కొందరు పోకిరి కుర్రాళ్లు పుష్పరాజ్ అన్న కూతురు కావేరి (పావని)ని కిడ్నాప్ చేసాక యాక్షన్ డ్రామా మరో లెవల్ కి చేరుకుంటుంది. చిన్నాన్న పుష్పరాజ్ పాత్రలో ఎమోషనల్ కంటెంట్ ని ఎలివేట్ చేసేందుకు పావని పాత్ర సహకరించింది. ఇక పావని పదహారణాల పల్లెటూరి తెలుగమ్మాయి ఎలా ఉంటుందో అలాగే తెరపై చీరల్లో మురిపించింది. క్లైమాక్స్ లో పావనిని అడ్డు పెట్టుకుని పుష్పరాజ్ పై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న రౌడీలకు జీవితంలో మర్చిపోలేని విధంగా ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. మొత్తానికి పావనికి సుకుమార్ కీలక పాత్రలో ఆఫర్ ఇవ్వడంతో ఆ ఎమోషన్ ని తను ఎప్పటికీ దాచుకోలేకపోతోంది. ఇంతకుముందు ఒక వేదికపై కన్నీటిపర్యంతం అవుతూ సుక్కూ అండ్ బన్నీకి థాంక్స్ చెప్పింది కూడా. పావని తెలుగు ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న నటి. ఈ భామ ఇంతకుముందు సివరపల్లి అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా పోస్టర్లను కూడా పావని ఇన్ స్టాలో షేర్ చేసింది. ముఖ్యంగా పుష్ప 2లో తన పాత్రకు సంబంధించిన చాలా ఫోటోలను పావని ఇన్ స్టాలో రెగ్యులర్ గా అప్ డేట్ చేసింది. ప్రతిభకు పట్టంగట్టే టాలీవుడ్ లో ఈ తెలుగమ్మాయి కెరీర్ కూడా మునుముందు స్కై ఈజ్ లిమిట్ అన్న చందంగా దూసుకెళుతుందనడంలో సందేహం లేదు.

# కాక పుట్టించే బ్యూటీ క్రేజీ ఛాన్సులకు దూరంగా!

యంగ్ బ్యూటీ ఇవానా గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు 'లవ్ టుడే' సినిమాతో తెలుగు నాట బాగా ఫేమస్ అయింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీతో యువతకి బాగా రీచ్ అయింది. 'లవ్ టుడే' తమిళ అనువాద చిత్రమైనా సక్సెస్ ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో తెలుగులో మంచి కెరీర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అమ్మడి కెరీర్ మాత్రం అలా సాగడం లేదు. 'లవ్ టుడే' తర్వాత తెలుగులో ఓ సినిమాకి సైన్ చేసింది. అదే 'సెల్ఫిష్'. దిల్ రాజు తమ్ముడు కుమారుడు అశిష్ రెడ్డి హీరోగా మొదలైన ప్రాజెక్ట్ ఇది. అయితే ఈసినిమా ప్రారంభమై చాలా కాలమవుతుంది. ఇంకా ఈ సినిమా సెట్స్ లోనే ఉంది. దిల్ రాజుసొంత నిర్మాణ సంస్థలోనే పట్టాలెక్కించిన చిత్రమిది. అయితే ఇదే సమయంలో రాజుగారు కొన్ని భారీ బడ్జెట్ చిత్రాలు కూడా పట్టా లెక్కించారు. దీంతో నిర్మాణ పరంగా ఇబ్బందులు తలెత్తడంతో సెల్ఫిష్ ని తాత్కాలికంగా వాయిదా వేసారు.



అయితే ఈ వాయిదా అన్నది అశిష్ సహా ఇవానా కెరీర్ పై కూడా ప్రభావం పడింది. ఇద్దరు ఆ ప్రాజెక్ట్ బాండ్ అయి ఉన్నారు. కొత్త సినిమా అవకాశాలు రాకపోవడంతో గ్యాప్ ఏర్పడింది. అశిష్ సంగతి పక్కన బెడితే? ఇవానాకి తెలుగులో మంచి క్రేజ్ ఉంది. నటిగా తొలి సినిమాతోనే ప్రూవ్ చేసుకుంది. ఈనేపథ్యంలో తెలుగులో పెద్ద హీరోయిన్ అవుతుంది అన్న అంచనాలు సైతం తెరపైకి వచ్చాయి. కానీ సెల్ఫిష్ ఇంకా సెట్స్లోనే ఉండటతో కొత్త ఛాన్సులు రాలేదు. అటు తమిళ్ లో కూడా అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఒక్క సినిమాతోనే ప్రేక్షకుల ముందు కొచ్చింది. మాలీవుడ్ లో కూడా సినిమాలు చేయలేదు. తొలుత కెరీర్ అక్కడే ప్రారంభించింది. అటుపై మరింత మెరుగైన కెరీర్ కోసం కోలీవుడ్ లో లాంచ్ అయింది. అక్కడ బాగానే ఫేమస్ అయింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి షిఫ్ట్ అయితే మొదటి కే మోసం వచ్చింది. ఇలా ఇవానా కెరీర్ డే బై డే మరింత నెమ్మదిస్తుంది.

# ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చిన సినిమాలేంటో తెలుసా..?



ఒక హీరో సినిమాకు మరో హీరో వాయిస్ ఓవర్ ఇస్తే ఆ కిక్ వేరేలా ఉంటుంది. స్టార్ క్రేజ్ ని వాడుకునేలా వారి వాయిస్ ని కొన్ని సినిమాలకు వాడుతుంటారు. వాటి వల్ల సినిమాలకు స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. స్టార్ హీరోలంతా కూడా ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి వాయిస్ ఓవర్ ఇస్తూనే ఉంటారు. వారిలో ఎన్టీఆర్ అయితే తనని అడిగిన ప్రతి ఒక్కరికి వాయిస్ ఓవర్ ఇస్తున్నాడు. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో టీజర్ లేదా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వస్తే ఆ గ్లింప్స్ కి ఎక్కడలేని క్రేజ్ ఏర్పడుతుంది. ఈ ట్రెండ్ ఎప్పటి నుంచో కొనసాగుతున్నా కూడా ఇప్పుడు మరింత ప్రభావం చూపిస్తున్నాయి. ఎన్టీఆర్ సినిమాకు సపోర్ట్ అందించేందుకు ఎప్పుడు ముందుంటాడు. తారక్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ నటించిన రామ రామ కృష్ణ కృష్ణ సినిమాకు రాం ఇంట్రడక్షన్ కోసం వాయిస్ ఓవర్ ఇచ్చాడు. ఆ సినిమా రిజల్ట్ ఆశించిన స్థాయి లేకపోయినా ఆ సినిమా టీజర్ టైం లో ఇంప్రెస్ చేసింది. ఇక నెక్స్ట్ రాజమౌళి డైరెక్షన్ లో తెరకెక్కిన RRR సినిమా కి రిలీజ్ చేసిన ప్రోమో లో కూడా రామ్ చరణ్ రామరాజు పాత్రని పరిచయం చేస్తూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ చెప్పాడు. RRR సినిమా లో తారక్ కూడా నటించిన విషయం తెలిసిందే. ఇక నెక్స్ట్ మెగా మేనల్లుడు సాయి ధరం తేజ్ నటించిన విరూపాక్ష సినిమా టీజర్ కి కూడా ఎన్టీఆర్ వాయిస్ ఇచ్చాడు. లేటెస్ట్ గా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ టీజర్ ని ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడు. గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా కథ ఏంటన్నది సీక్రెట్ గా ఉంచినా ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో సినిమాకు కావాల్సిన మాస్ ఎలివేషన్ ఇచ్చేశాడు. తారక్ వాయిస్ ఓవర్ తో కింగ్ డమ్ కి సూపర్ క్రేజ్ వచ్చింది. అందుకే జస్ట్ అలా రిలీజైన టీజర్ 24 గంటల్లో 29 మిలియన్ వ్యూస్ రాబట్టింది. ఎన్టీఆర్ నటించడమే కాదు తన వాయిస్ ఓవర్ కూడా అందిస్తూ ఇతర హీరోల సినిమాలకు కూడా సపోర్ట్ గా ఉంటున్నాడు. విజయ్ దేవరకొండ కింగ్ డమ్ కు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అదుర్స్ అనిపించగా ఈ సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.

# వర్మ 'శారీ' సైకో.. ట్రైలర్ చూశారా?




ఇటీవల సినిమాల్లో వైవిధ్యం కోసం ప్రయత్నించే దర్శకులు చాలా మంది ఉన్నప్పటికీ, రామ్ గోపాల్ వర్మ మాత్రం ఎప్పటికీ ట్రెండ్‌కి ముందుగా ఉంటాడు. సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా ఆయన నుంచి వచ్చే ప్రతి సినిమా ఏదో ఒక కొత్త అంశాన్ని హైలెట్ చేస్తోంది. ఇప్పుడు ఆయన సమర్పణలో వస్తున్న చిత్రం శారీ కూడా అలాంటిదే. యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా థ్రిల్లర్ జానర్‌కి చెందినదిగా రూపొందింది. సోషల్ మీడియాలో అమాయకంగా ప్రేమలో పడడం, అది ఎలాంటి భయానక పరిణామాలకు దారితీస్తుందో చూపించే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. వర్మ ఈ సినిమాకు కథను అందించగా గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించారు. ఇక ట్రైలర్ విషయానికి వస్తే, శారీ ప్రధానంగా ఓ అమ్మాయి చీరలో కనిపించడాన్ని చూస్తున్న అబ్బాయి, ఆమెను వెంబడించడం, చివరకు ఆ క్రమంలో చోటు చేసుకునే భయంకర పరిణామాలను హైలెట్ చేస్తోంది. ఇలాంటి కథని ఎంచుకోవడం రామ్ గోపాల్ వర్మ స్పెషాలిటీ. సోషల్ మీడియా కారణంగా యువత ఎలా ప్రభావితమవుతుందో చూపించే ప్రయత్నం చేశారు. ట్రైలర్ చూస్తే మొదట ఆరాధ్య దేవి పాత్ర మామూలుగానే కనిపించినా, ఆమె చుట్టూ అబ్బాయి తిరుగుతున్న తీరు కాస్త భయాన్ని రేకెత్తిస్తుంది. ట్రైలర్‌లో కథ ఎలా నడుస్తుందనే విషయాన్ని క్లియర్‌గా చూపించారు. ఫొటోగ్రాఫర్‌గా ఉన్న యువకుడు ఓ అమ్మాయిని చూసి ఆకర్షితుడవుతాడు. ఆమెను సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తాడు. అంతటితో ఆగకుండా ఆమె జీవితంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తాడు. అయితే ఆ తర్వాత ఏమి జరుగుతుందనేది అసలు ట్విస్ట్. వర్మ తరచూ రియలిస్టిక్ కథలతో వస్తుంటాడు కానీ, ఈసారి కథానాయిక పాత్రను న్యాచురల్‌గా మలచి మరింత ఆసక్తిని పెంచాడు. ఇకపోతే ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో ఆరాధ్య దేవి, సత్య యదు నటించారు. మరికొందరు కీలక నటులుగా సహిల్ సంపియాల్, అప్పాజీ అంబరీష్, కల్పలత కూడా ఉన్నారు. టెక్నికల్‌గా చూస్తే, ఈ సినిమాకి ఆనంద్ సంగీతం అందించగా, శబరి సినిమాటోగ్రఫీ చేశారు. ఎడిటింగ్ బాధ్యతలను గిరి కృష్ణ కమల్, పెరంపల్లి రాజేష్ నిర్వర్తించారు. సినిమాను రామ్ గోపాల్ వర్మ సమర్పించగా, రవి శంకర్ వర్మ నిర్మించారు. సినిమా నిర్మాణానికి సంబంధించి ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కథానాయికగా నటించిన ఆరాధ్య దేవిని రామ్ గోపాల్ వర్మ ఓ ఇన్‌స్టా రీల్ చూసి ఎంపిక చేశారని తెలుస్తోంది. కేరళకు చెందిన ఈ నటి, వర్మ సంస్థ అయిన %=+ఎ ఐజుచీ% ద్వారా సెలెక్ట్ అయ్యారు. ట్రైలర్‌లో ఆమె పోషించిన పాత్రని చూస్తే, సినిమాలో ఆమె ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉంటుందో అర్థమవుతుంది. ఈ సినిమా ఫిబ్రవరి 28న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ అయితే %=+ఎ% గత సినిమాలను గుర్తు చేస్తోంది. కానీ ఇటీవల కాలంలో ఆయనకు సరైన విజయాలు లేవు. మరి ఆడియెన్స్ ను శారీ సినిమా ఎంతవరకు ఎట్రాక్ట్ చేస్తుందో చూడాలి.

# ప్రేమించిన వ్యక్తి నుంచి వేధింపులు ఎదుర్కొన్నా: ఐశ్వర్యా రాజేష్

ఐశ్వర్యా రాజేష్ సౌత్ సినీ ఇండస్ట్రీలో మంచి హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి అయిన ఐశ్వర్యా రాజేష్ కోలీవుడ్ కు వెళ్లి అక్కడ వరుస సినిమాలు చేస్తూ స్టార్ డమ్ ను అందుకుంది. రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యంగా మెప్పించిన ఐశ్వర్య రీసెంట్ గా తన వ్యక్తిగత జీవితం గురించి పలు విషయాలను వెల్లడించింది. చిన్న తనంలోనే తన తండ్రి చనిపోవడంతో అమ్మ ఒక్కరే తమ నలుగుర్ని ఎంతో కష్టపడి పెంచిందని, ఆ క్రమంలో ఆమె ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. అమ్మ కష్టం చూసి ఆమెకు అండగా నిలబడాలని చిన్న వయసు నుంచే పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం మొదలుపెట్టిన ఐశ్వర్య క్రమంగా సినిమాల్లోకి వచ్చి అమ్మను చూసుకుంటున్నానని, ఆ విషయంలో తానెంతో గర్వంగా ఉన్నట్టు



అమ్మడు తెలిపింది. ఇక రిలేషన్‌షిప్ గురించి మాట్లాడుతూ, లవ్ కంటే బ్రేకప్ అయినప్పుడు ఎక్కువ బాధ కలుగుతుందని, ఆ బాధ నుంచి బయటకు రావడం అంత ఈజీ కాదని, అందుకే దానికే ఎక్కువ టైమ్ తీసుకుంటానని చెప్పిన ఐశ్వర్య తాను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ఇష్టపడ్డానని, అతన్నుంచి ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నట్టు వెల్లడించింది. దాని కంటే ముందు కూడా తాను అలాంటి ప్రేమనే చూశానని, రిలేషన్‌షిప్‌లో ఎందుకిలా జరుగుతుందని ఎంతో భయపడినట్టు చెప్తున్న ఐశ్వర్య ప్రస్తుతానికి సింగిల్ గానే ఉన్నానని, గతంలో జరిగిన అనుభవాల వల్ల మళ్లీ ఎవరినైనా ప్రేమించాలంటే ఎన్నో ఆలోచనలొస్తున్నాయని ఐశ్వర్య తెలిపింది. తాను చాలా ఎమోషనల్ అని మళ్లీ మళ్లీ అంత బాధను తట్టుకునే శక్తి తనకు లేదని, ప్రస్తుతం సింగిల్ గా ఉన్నప్పటికీ ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపింది. ఇక కెరీర్ విషయానికొస్తే సంక్రాంతికి వస్తున్నాం హిట్ తర్వాత తనకు అవకాశాలు బాగానే వస్తున్నాయి. కానీ అమ్మడు తన రెమ్యూనరేషన్ ను భారీగా పెంచినట్టు తెలుస్తోంది.

# మైకం కమ్మేలా మలైకా ఫ్యాషన్ గోల్స్

అర్జున్ కపూర్- మలైకా అరోరా జంట గత ఏడాది ఆరంభంలో బ్రేకప్ అయిన సంగతి తెలిసిందే. మలైకా నుండి విడిపోయిన విషయాన్ని అర్జున్ స్వయంగా ధృవీకరించారు. కానీ అతడిని ఇప్పటికీ ఫ్యాన్స్ వెంబడిస్తూ, మలైకా పేరుతో పబ్లిక్ లో డిస్ట్రబ్ చేస్తున్నారు. తాజాగా అర్జున్ కపూర్ నటించిన మేరే హస్బెండ్ కి బివి ప్రమోషన్స్‌లో మలైకా అరోరా పేరును ప్రస్థావిస్తూ, అభిమాని బిగ్గరగా అరిచిన వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. తన మాజీ ప్రేయసి మలైకా అరోరా పేరును పిలుస్తూ అతడు అరిచినప్పుడు అర్జున్ కపూర్ నోట మాట రాలేదు. ఆ సమయంలో అర్జున్ ప్రశాంతంగా ఉన్నాడు.. మౌనాన్ని ఆశ్రయించాడు. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్ లో ట్రెండ్ అవుతోంది. తన కథానాయికలు భూమి పెడ్నేకర్, రకుల్ ప్రీత్ సింగ్‌లతో మేరే హస్బెండ్ కి బివిని ప్రమోట్ చేస్తున్న అర్జున్ కపూర్ కి ఇది ఊహించని జోల్ట్. సినిమా గురించి ఒక ప్రశ్నకు భూమి ఫెడ్నేకర్ సమాధానం



చెప్పబోతుండగా, ఎవరో అకస్మాత్తుగా మలైకా అని బిగ్గరగా అరవడం వినిపించింది. అర్జున్ సహా అందరూ ఆ అరుపును గమనించారు. అలా అరవొద్దని అర్జున్ మౌనంగా చెప్పాడు. ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహించిన మేరే హస్బెండ్ కి బివిలో డినో మోరియా, హర్ష్ గుజ్రాల్, శక్తి కపూర్ సహాయక పాత్రల్లో నటించారు. వాషు భగ్నాని, జాకీ భగ్నాని, దీప్‌శిఖా దేశ్‌ముఖ్‌లు నిర్మించిన ఈ చిత్రం 21 ఫిబ్రవరి 2025న సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

**మలైకా ఫోటోషూట్లు వైరల్:** మరోవైపు మలైకా వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. మలైకా తాజాగా ఆల్ బ్లాక్ కలర్ డిజైనర్ గౌన్ ధరించి అదిరిపోయే ఫోజులివ్వగా, ఆ ఫోటోలు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్నాయి.

ఈ యూనిక్ డిజైనర్ లుక్ కోసం 50 ఏళ్ల మలైకా ఎంపిక చేసుకున్న జువెలరీ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ వయసులోను మల్లా అందచందాలకు యూత్ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం మలైకా ఆల్ బ్లాక్ లుక్ ఫోటోలు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536